




ESTD: 1999

www.voodayam.com

# వుదయం








సంపుటి : 27 సంచిక : 156 | హైదరాబాద్ | 06-08-2026 గురువారం

SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY

రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal

Follow us on




ఉమ్మడి ఆదిలాబాద్‌కు

ప్రాణహిత బ్యారేజీ అనుమతులపై రేవంత్ సర్కార్ వేగం

# సాగునీరే లక్ష్యం

**న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఎఎంఎస్) :**

ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం ఎత్తు పెంపునకు మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చేలా చొరవ చూపాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. బుధవారం ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్ ఆయనతో భేటీ అయ్యారు.

**ఎత్తు పెంచినా ముంపు తక్కువే!**

ఈ సందర్భంగా ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరిస్తూ.. బ్యారేజీ ఎత్తును 150 నుంచి 152 మీటర్లకు పెంచడం ద్వారా రూపాయి విద్యుత్ ఖర్చు లేకుండా, పూర్తిగా గ్రావిటీ (గురుత్వాకర్షణ) ద్వారానే నీటిని తరలించే వీలుంటుందని సీఎం స్పష్టం చేశారు. ఎత్తు పెంచడం వల్ల మహారాష్ట్రకు ముంపు ప్రమాదం పెద్దగా ఉండదని, ముంపునకు గురయ్యే ప్రాంతంలో 50 శాతానికి పైగా నదీ గర్భంలోనే (రివర్ బెడ్) ఉంటుందని వివరించారు. పుణెలోని 'సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్' అధ్యయనంలోనూ 148 మీటర్ల వద్ద లేదా 152 మీటర్ల వద్ద బ్యారేజీ నిర్మించినా ముంపు తేడా స్వల్పమేనని తేలిందని ఆధారాలతో సహా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**ఆదిలాబాద్ సాగునీటి స్వప్నం:**

గతంలో బ్యారేజీ ఎత్తుపై జరిగిన ఒప్పందాలను, ఈ ప్రాజెక్టు అనుమతుల కోసం ప్రధాని నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖను, దానికి స్పందిస్తూ ప్రధాని కార్యాలయం (PMO) జల్‌శక్తి శాఖకు పంపిన ఆదేశాలను సీఎం ప్రస్తావించారు. పూర్తిగా వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు అందాలంటే ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమని, కాబట్టి తెలంగాణ-మహారాష్ట్రల మధ్య వీలైనంత త్వరగా ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

**కేంద్రం సానుకూల స్పందన:**

సీఎం విజ్ఞప్తిపై స్పందించిన జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్.. నుంచి వచ్చిన లేఖ ఆధారంగా ఇప్పటికే చర్యలు ప్రారంభించామని తెలిపారు. ప్రాజెక్టు చిక్కుముడులు విప్పేందుకు ముందుగా 'కేంద్ర జల సంఘం' ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర అధికారుల స్థాయి సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రుల స్థాయిలో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

**సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు:**

ఈ భేటీలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎం. అనిల్ యాదవ్, డాక్టర్ కడియం కావ్యలతో పాటు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



20 నిమిషాల్లో

## 7 భారీ పేలుళ్లు

**దుబాయ్ :**

ప్రశాంతంగా ఉండే దుబాయ్ నగరం ఒక్కసారిగా భారీ పేలుళ్లతో దద్దరిల్లింది. జెబెల్ అలీ పారిశ్రామిక ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి వేళ వరుస పేలుళ్లు సంభవించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. కేవలం 20 నిమిషాల వ్యవధిలోనే ఏడుసార్లు అతిపెద్ద శబ్దాలతో పేలుళ్లు చోటుచేసుకున్నట్లు స్థానిక మీడియా సంస్థలు వెల్లడించాయి.

ఎగసిపడ్డ అగ్నికీలలు - దట్టమైన పొగ: ప్రపంచంలోనే అత్యంత భారీ నౌకాశ్రయానికి అత్యంత సమీపంలో ఉన్న పారిశ్రామిక ప్రాంతంలో ఈ ఘటన జరగడంతో తీవ్ర కలకలం రేగింది. పేలుళ్ల ధాటికి ఒడరేవును ఆనుకుని ఉన్న ప్రధాన ఇంధన నిల్వ, రవాణా గిడ్డంగి (వేర్‌హౌస్)లో భారీగా మంటలు చెలరేగినట్లు ఉపగ్రహ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. పరిసర ప్రాంతాలన్నీ దట్టమైన నల్లటి పొగతో అలుముకున్నాయి. ప్రమాద తీవ్రతపై ఆధారపడి ప్రాణ, ఆస్తి నష్టాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెల్లడికావాల్సి ఉంది.

హూతీల దాడేనని ఇరాన్ మీడియా ప్రచారం: ఈ వినాశకర పేలుళ్ల వెనుక యెమెన్‌కు చెందిన హూతీ తిరుగుబాటుదారుల ప్రమేయం ఉందని ఇరాన్ అధికారిక మీడియా ప్రకటించింది.

డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్

# బిల్లులపై ప్రత్యేక సమావేశాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఎఎంఎస్) :**

ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13తో ముగియనున్న నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) మరియు మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులకు పార్లమెంట్ ఆమోదం పొందేందుకు ఆగస్టు 16 నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని యోచిస్తున్నట్లు సమాచారం.

**ప్రత్యేక సమావేశాలపై త్వరలోనే ప్రకటన?**

ఆగస్టు 13 తర్వాత పార్లమెంట్‌ను నిరవధికంగా వాయిదా (Sine Die) వేయకుండా, స్వల్ప విరామం తర్వాత ప్రత్యేక సమావేశాలను నిర్వహించే అవకాశం ఉందని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ రాజ్యాంగ సవరణ బిల్లులు నెగ్గేందుకు అవసరమైన మూడింట రెండు వంతుల (2/3) మెజారిటీని సమీకరించే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది. సంఖ్యాబలంపై స్పష్టత రాగానే ఈ సమావేశాలపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

**సభలో తొలగని ప్రతిష్టంభన**

మరోవైపు వర్షాకాల సమావేశాల్లో విపక్షాల నిరసనలతో సభా కార్యకలాపాలు స్తంభించిపోతున్నాయి. బుధవారం లోక్‌సభ ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే విపక్షాల ఆందోళనల మధ్య వాయిదా పడింది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు చొరవ తీసుకున్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఛాంబర్‌కు వెళ్లి ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుల ఆమోదానికి సహకరించాలని కోరారు.

**అమిత్ షా ప్రకటన చేసే వరకు సహకరించం:**



రాహుల్ గాంధీ అయితే కేంద్ర మంత్రి రిజిజు విజ్ఞప్తిని రాహుల్ గాంధీ తోసిపుచ్చారు. అయోధ్య రామమందిరంలో విరాళాల చోరీ ఆరోపణలు, సీజేపీ నిరసనల సందర్భంగా విద్యార్థులపై జరిగిన పోలీసుల చర్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో స్పష్టమైన ప్రకటన చేసే వరకు తమ నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ స్పందనతో సభలో ప్రతిష్టంభనను తొలగించే మార్గాలపై చర్చించేందుకు మంత్రి కిరణ్ రిజిజు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మరియు హోంమంత్రి అమిత్ షాతో అత్యవసరంగా భేటీ అయ్యారు.

## భారత్‌కు బంగ్లా విజ్ఞప్తి



**న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఎఎంఎస్) :**

విద్యార్థుల తీవ్ర నిరసనలు, తిరుగుబాటుతో అధికారాన్ని కోల్పోయి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా త్వరలోనే స్వదేశానికి తిరిగెళ్లేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే, ఆశ్రయం పొందుతున్న నాటి నుంచి తొలిసారిగా ఆమె మీడియా ముందుకు రావడానికి సిద్ధమయ్యారు. బుధవారం ఢిల్లీ వేదికగా జరిగే విలేకరుల సమావేశంలో వర్చువల్ పద్ధతిలో పాల్గొని ప్రసంగించనున్నారు. భవిష్యత్ ప్రణాళికలపై స్పష్టత? ఈ మీడియా భేటీ ద్వారా హసీనా తన భవిష్యత్ రాజకీయ ప్రణాళికలతో పాటు బంగ్లాదేశ్‌కు ఎప్పుడు తిరిగి వెళ్తారనే అంశంపై కీలక ప్రకటన చేసే అవకాశముంది. ఈ కార్యక్రమంలో హసీనా కుమారుడు సాజీబ్ వాజెద్‌తో పాటు అవామీ లీగ్ ముఖ్య నేతలు కూడా పాల్గొననున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ కార్యక్రమంతో భారత ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని, ఒక ప్రైవేట్ మీడియా సంస్థ దీనిని నిర్వహిస్తోందని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

# ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్

**వాషింగ్టన్ :**

పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చాయి. వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన 'హర్మూజ్ జలసంధి'ని తక్షణమే పునరుద్ధరించాలని, లేకపోతే ఊహించని రీతిలో సైనిక దాడులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇరాన్‌ను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. వెనక నుంచి చర్చలు జరుపుతూనే, బహిరంగంగా తమపై విమర్శలు గుప్పించడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈసారి చర్చల నుంచి ఇరాన్ వెనక్కి తగ్గితే ఆ దేశం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని టెహ్రాన్‌కు స్పష్టం చేశారు. 48 గంటల్లో క్లారిటీ: ట్రంప్ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అతిపెద్ద స్థాయి దాడికి అగ్రరాజ్యం ప్రణాళికలు రచిస్తున్న తరుణంలోనే, ఇరాన్ తమను సంప్రదించి చర్చలకు పిలిచిందని ట్రంప్ సంచలన విషయం వెల్లడించారు. ఇరాన్



విషయంలో తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నామనే దానిపై మరో 48 గంటల్లో స్పష్టత వస్తుందని తెలిపారు. ఇరాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధ సామర్థ్యాన్ని సాధించకుండా అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని అధ్యక్షుడు పునరుద్ఘాటించారు. అమెరికా దావాను తిప్పికొట్టిన ఇరాన్ మరోవైపు, హర్మూజ్ జలసంధిలో నౌకల స్వేచ్ఛాయుత రాకపోకల కోసం ఇరాన్, ఒమన్‌లతో కలిసి తాము సంప్రదింపులు జరుపుతున్నామని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ వెల్లడించారు. రాబోయే ఒకటి రెండు రోజుల్లో దీనిపై ఒక ఒప్పందానికి వచ్చే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, అమెరికా వ్యాఖ్యలను ఇరాన్ తక్షణమే తిరస్కరించింది. ఒమన్‌తో తాము జరుపుతున్న చర్చల్లో అమెరికాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. తమ దేశ సార్వభౌమాధికారాన్ని, భద్రతా ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన నూతన సముద్ర రవాణా విధానాన్ని రూపొందించడంపైనే ఈ చర్చలు జరుగుతున్నాయని తేల్చిచెప్పింది. అమెరికా తీవ్ర హెచ్చరికలు, ఇరాన్ ఖండనలతో పశ్చిమాసియాలో మళ్లీ ఉత్కంఠ వాతావరణం నెలకొంది. రాబోయే 48 గంటల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోనని ప్రపంచదేశాలు ఆందోళనగా గమనిస్తున్నాయి.

# ప్రభుత్వ భూములను వదలం

**హైదరాబాద్, ఆగస్టు 5 (వుదయం) :**

రాష్ట్రంలో 22ఎ నిషేధిత జాబితాలో ఉన్న భూముల వివాదాలను పరిష్కరించే క్రమంలో ఏ ఒక్క పేదవాడికి, నిజమైన భూహక్కుదారునికి అన్యాయం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ, హౌసింగ్, సమాచారపౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన ప్రజల భూహక్కులను కాపాడుతూనే, మరోవైపు విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమణల బారిన పడకుండా రక్షించడమనే ద్విముఖ వ్యూహంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

**దుష్ప్రచారాన్ని నమ్మవద్దు - మంత్రి స్పష్టత**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఏ ఒక్క సెంటు ప్రైవేటు భూమిని కూడా 22ఎ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి తేల్చిచెప్పారు. వివాదాలు లేని ప్రైవేట్ భూములను ప్రభుత్వం కావాలనే నిషేధిత జాబితాలో చేర్చిందంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ప్రజలను ఇబ్బంది పెట్టే ఆలోచన ఈ ప్రభుత్వానికి ఎంత మాత్రం లేదని పునరుద్ఘాటించారు.



**ఉన్నత స్థాయి సమీక్ష - అధికారులకు దిశానిర్దేశం**

బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో క్యూర్ (CURE) పరిధిలోని 22ఎ నిషేధిత భూములపై వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజావాణి ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతుతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్‌మల్కాజిగిరి అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ఆదేశాలు కేవలం క్యూర్ పరిధి జిల్లాలకే కాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులకు వర్తిస్తాయని స్పష్టం చేశారు.

**45 రోజుల్లోనే తుది నిర్ణయం!**

22ఎ భూవివాదాల పరిష్కారానికి సంబంధించి హైకోర్టు నిర్దేశించిన 45 రోజుల గడువులోనే ప్రక్రియ అంతటినీ పూర్తి చేసి నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్, ఆర్డీవో, సబ్ కలెక్టర్, కలెక్టర్ కార్యాలయాల స్థాయిలో వచ్చే ప్రతి దరఖాస్తును చట్టబద్ధంగా పరిశీలించి నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా 'ప్రజావాణి'లో వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, క్షేత్రస్థాయి విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

**అక్రమ రిజిస్ట్రేషన్లపై ఉక్కుపాదం**

ప్రభుత్వ భూముల రక్షణే తమ ప్రథమ బాధ్యత అని పేర్కొన్న పొంగులేటి.. సర్కారు భూములపై ఎలాంటి అక్రమ లావాదేవీలు, అక్రమ రిజిస్ట్రేషన్లు జరగకుండా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. 22ఎ జాబితాపై సమగ్ర విచారణ జరిపి తుది నిర్ణయం తీసుకునే పూర్తి అధికారం జిల్లా కలెక్టర్లకే ఉందని గుర్తుచేశారు. ప్రజల హక్కులు, ప్రభుత్వ ప్రయోజనాలు రెండింటినీ సమతుల్యం చేస్తూ అత్యంత పారదర్శకంగా వ్యవహరించాలని కలెక్టర్లను ఆదేశించారు.

## ఇంతే కదా...!




## రూ. 11 కోట్ల నష్టపరిహారం కోరిన గడ్కరీ

**ముంబై:**

ఈ20 (ఇథనాల్ బ్లెండెడ్) పెట్రోల్ అంశాన్ని పురస్కరించుకుని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఆయన కుటుంబమే లక్ష్యంగా సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై బొంబాయి హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నితిన్ గడ్కరీ పరువుకు భంగం కలిగించేలా ఉన్న ఏఐ (AI) ఆధారిత డీప్‌ఫేక్

**టెక్ దిగ్గజాలపై బాంబే హైకోర్టు సంచలన వ్యాఖ్యలు**

వీడియోలు, తప్పుడు పోస్టులను తక్షణమే తమ ప్లాట్‌ఫామ్‌ల నుంచి తొలగించాలని గూగుల్, మెటా సహా వివిధ సామాజిక మాధ్యమ సంస్థలను న్యాయస్థానం ఆదేశించింది. 'అత్యంత నీచమైన కంటెంట్' - టెక్ సంస్థలపై సీరియస్ ఆన్‌లైన్‌లో ప్రచారంలో ఉన్న సదరు వీడియోల్స్, పోస్టులను "అత్యంత నీచమైన కంటెంట్"గా కోర్టు అభివర్ణించింది. డిజిటల్ ప్రపంచంలో ఇటువంటి అసత్య ప్రచారాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ చోటు ఉండకూడదని స్పష్టం చేసింది.

# తల్లిపాలే శిశువుకు సంపూర్ణ రక్షణ



- దౌల్తాబాద్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

దౌల్తాబాద్ ఆగస్టు 05(వుదయం)

దుబ్బాక ప్రొక్టు పరిధిలోని మండల కేంద్రమైన దౌల్తాబాద్ లోని అంగన్వాడి సెక్టార్ లో గల దౌల్తాబాద్-2 అంగన్వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ముచ్చుమర్రి అనురాధ ముఖ్య అతిథిగా హాజరై గర్భిణులు, బాలింతలను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలే ఉత్తమ ఆహారమని, ప్రతి తల్లి తప్పనిసరిగా బిడ్డకు తల్లిపాలు అందించాలని సూచించారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి, బిడ్డ ఇద్దరి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు.ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక మాట్లాడుతూ శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని, మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ముర్రుపాలు శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని అందించి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడతాయని వివరించారు. గర్భిణులు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవడంతో పాటు శిశు సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఆది బాలకృష్ణ, ఐసీడీఎస్ సూపర్వైజర్ రేణుక, పంచాయతీ కార్యదర్శి, గోపాల్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు రామ, ప్రతిభ, గిరిజ, సరోజ, రాధిక, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# బాలికల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ లక్ష్యం

- వైద్యాధికారి డాక్టర్ ఎం. ప్రియాంక
- పాలెం గాయత్రి హైస్కూల్‌లో హెచ్ పి వి వ్యాక్సినేషన్ డ్రైవ్

బిజినేపల్లి, ఆగస్టు 05 (వుదయం ప్రతినిధి):



బాలికల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హెచ్ పి వి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పాలెం వైద్యాధికారి డాక్టర్ ఎం.ప్రియాంక పరిశీలించారు. బుధవారం నాడుపాలెం గాయత్రి ఉన్నత పాఠశాల ఆవరణలో 14 నుండి 15 సంవత్సరాల వయస్సు గల విద్యార్థినులకు ప్రత్యేక వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు హెచ్ పి వి వ్యాక్సిన్ ఎంతో రక్షణ కల్పిస్తుందన్నారు. అర్హులైన బాలికలందరూ 100 శాతం వ్యాక్సిన్ వేయించుకొని సిబ్బందికి సహకరించాలని సూచించారు. మహిళల్లో విస్తృతంగా కనిపించే గర్భాశయ క్యాన్సర్‌ను అడ్డుకునేందుకు హెచ్ పి వి వ్యాక్సిన్ అత్యంత సురక్షితమైన, సమర్థవంతమైన మార్గమని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు ఇప్పటికే ఈ వ్యాక్సిన్ వినియోగిస్తున్నాయని, ఇది సురక్షితమైన టీకామని చెప్పారు. భారతదేశంలో ఇంకా దీనిపై విద్యార్థినులు, తల్లిదండ్రుల్లో అపోహలు ఉన్నాయని, అర్హులైన ప్రతి విద్యార్థినికి వ్యాక్సిన్ వేయించాలని కోరారు. ప్రైవేట్‌లో ఈ వ్యాక్సిన్ దాదాపు 6 వేల నుండి 8 వేల రూపాయల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ప్రజల ఆరోగ్యం అనేది సమాజ శ్రేయస్సుకు, వ్యాధుల నివారణకు, జీవితకాల పెంపుకు ముఖ్యమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే సమాజ భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీ, వైద్యసిబ్బంది, ఆరోగ్య విస్తరణ అధికారి బాదం రాజేశ్వర్, హెల్త్ అసిస్టెంట్ కూన గోవర్ధన్, ఏఎన్ఎం లు డి. సరస్వతి, పి. మల్లిక, ఆశా వర్కర్లు విజయ, నీల, షమీం, జయమ్మ, పార్వతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పట్టు పరిశ్రమ శాఖ అధికారుల పరిశీలన



ఊర్కొండ న్యూస్5
వుదయం ప్రతినిధి

నాగర్ కర్నూల్ జిల్లా ఉరకకొండ మండలం.ఉద్యాన శాఖ కల్వకుర్తి డివిజన్ ఈరోజు ఉరుకొండ గ్రామం లోనిడి. అల్వాల్ రెడ్డి గారి నాలుగో సంవత్సరం పామాయిల్ తోటను జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఎం వెంకటేశం సందర్శించడం జరిగింది.. ఎల్లోస్ ప్రభావం వల్ల నీళ్లను పొదుపుగా ఎలా వాడుకోవాలి, పామాయిల్ మట్టలని చిన్న చిన్నగా కత్తిరించి మొక్క పాదుల్లో వేసుకోవాలని మరియు ఎరువుల యాజమాన్యాన్ని గురించి , మరియు గెలలు కత్తిరించక సంవత్సరానికి రెండు దఫాలుగా పశువుల ఎరువు, వేపపిండి, వర్మీ కంపోస్ట్ మొక్క పాదుల్లో వేసుకోవడం వల్ల మొక్క ఎదుగుదల బాగుంటుందని తెలియజేయడం జరిగింది. ఉద్యాన శాఖ అధికారి మహేశ్వరి.

# తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు!

తాండూర్ ఆగస్టు 05
వుదయం ప్రతినిధి :-



అమెరికా: అమెరికాలో జరుగుతున్న 'ఆట' (ATA అమెరికన్ తెలుగు అసోసియేషన్ ) మహాసభల సందర్భంగా తాండూరు శాసనసభ్యులు బుయ్యాని మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు విదేశీ గడ్డపై ఎంతో కోలాహలంగా, ఘనంగా నిర్వహించబడ్డాయి. తెలంగాణ నుండి ఈ వేడుకలకు హాజరైన పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు మరియు ఎన్నారై నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది.

మంత్రులు & ప్రజాప్రతినిధుల శుభాకాంక్షలు:
'ఆట' కార్యక్రమంలో భాగంగా అమెరికా పర్యటనలో ఉన్న తెలంగాణ ప్రభుత్వ మంత్రులు, శాసనసభ్యులు మరియు ముఖ్య నాయకులు ఈ వేదుకల్లో పాల్గొని ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

**కేక్ కటింగ్ & కోలాహలం:**
అమెరికాలోని ప్రవాస భారతీయులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు,వివిధ శాఖల నాయకుల నడుమ ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అక్కడ పండుగ వాతావరణం నెలకొంది.

**ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలి:**
తాండూరు నియోజకవర్గ అభివృద్ధికై నిరంతరం శ్రమిస్తున్న మనోహర్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సంతోషంతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని వేడుకల్లో పాల్గొన్న ముఖ్య నాయకులు మరియు ఎన్నారైలు ఆకాంక్షించారు.

"అమెరికా గడ్డపై ఎన్నారై సోదరులు, మంత్రులు మరియు నాయకుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. నాపై అభిమానం చూపి శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు."
— బుయ్యాని మనోహర్ రెడ్డి (తాండూరు ఎమ్మెల్యే)

# ఎంపీడీఓ కు ఫీల్డ్ అసిస్టెంట్లసన్మానం



కోహీర్ ఆగస్టు 5( వుదయం ప్రతినిధి )

సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ ఎం.ఉమాదేవి ని ఫీల్డ్ అసిస్టెంట్లు కలిశారు. వారు మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, ఉపాధి హామీ పనుల నిర్వహణలో క్రియాశీలకంగా వ్యవహరిస్తామని చెప్పారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వ్యక్తపరిచారు.. అధికారులు సూచనలను పాటిస్తూ మండల ప్రగతికి శ్రమిస్తామని అసిస్టెంట్లు పునరుద్ఘాటించారు.అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన సేవలు అందించాలని కోరారు.ఉపాధి హామీ ,ఇతర ప్రభుత్వ పనులలో పారదర్శకత పాటించాలని తెలిపారు .అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తేనే మండలాన్ని అభివృద్ధి పథంలో ఉంచవచ్చని వ్యాఖ్యానించారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకట్ రెడ్డి మండల పరిధిలోని పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.



# తాండూరులో 1.150 కిలోల గంజాయి స్వాధీనం

- బీహార్‌కి చెందిన వ్యక్తి అరెస్ట్

తాండూరు ,ఆగస్టు 05
వుదయం ప్రతినిధి:

వికారాబాద్ జిల్లా మధ్యనిషేధ మరియు అబ్కారీ అధికారి డి .శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తాండూరు ఎక్సైజ్ పోలీసులు బుధవారం మెరుపు దాడులు నిర్వహించి భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం... బీహార్ రాష్ట్రం, కటిహార్ జిల్లా, బైరియా గ్రామానికి చెందిన మహమ్మద్ ముస్తకీమ్ (తండ్రి: హమీదుర్ రహమాన్) అనే వ్యక్తి గౌతాపూర్ గ్రామం వద్ద ఉన్న 'తబ్రేజ్ స్టోన్ పాలిషింగ్ ఫ్యాక్టరీ' సమీపంలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో డీ.ఎస్హెచ్ఓ తాండూర్ బృందం వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని దాడులు నిర్వహించింది. ఈ తనిఖీల్లో నిందితుడి వద్ద నుంచి 1.150 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా అబ్కారీ అధికారి తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మాదకద్రవ్యాల సమాచారం తెలిస్తే ఫిర్యాదు చేయండి:
గంజాయి అమ్మడం, కలిగి ఉండటం చట్టరీత్యా తీవ్రమైన నేరమని జిల్లా అబ్కారీ అధికారి D. శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. వికారాబాద్ జిల్లాలో మాదకద్రవ్యాల నివారణకు తెలంగాణ ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ కట్టుబడి ఉందన్నారు. ప్రజలు ఎవరైనా మాదకద్రవ్యాల సమాచారాన్ని 8712658754 (P&EI SHO,తాండూరు)నంబరుకు అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో కోరారు.
ఈ దాడుల్లో తాండూరు ఎస్హెచ్ఓ N. రాణి, ఎస్సైలు నిజాముద్దీన్, రవికుమార్, సిబ్బంది విక్రమ్, అలీం, పండరి, రాజేష్, రామరావు, రాములు, సతీశ్, జార్జ్ పాల్గొన్నారు.

# కోహీర్ మండలంలో ఉస్మాన్ అల్-హజ్రీ ఆకస్మిక పర్యటన

కోహీర్ ఆగస్టు 5 (వుదయం ప్రతినిధి )



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ జనాబ్ ఉస్మాన్ అల్‌హజ్రీ బుధవారం కోహీర్ మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సందర్శించి నాయకులతో కీలక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు టీ.సువర్ణ మల్లన్న పటేల్, మాజీ డిప్యూటీ ఎంపీపీ మహమ్మద్ షాకీర్ అలీ, సీనియర్ నాయకుడు అజ్జూ పటేల్ ఉస్మాన్ అల్‌హజ్రీకి ఘన స్వాగతం పలికారు.ఈ సమావేశంలో మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం మరియు భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.స్థానిక ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ సర్పంచ్ అశోక్, ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అబ్దుల్ సత్తార్, అబ్దుల్ మతీన్, అబ్దుల్ రషీద్ పలువురు కోహీర్ మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈఓ జాకీర్ హుస్సేన్



కోహీర్, ఆగస్టు 5 :
(వుదయం ప్రతినిధి )

కోహీర్ మండలంలోని బడంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి (ఎంఈఓ ) మహమ్మద్ జాకీర్ హుస్సేన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పరిశుభ్రత తదితర అంశాలను వారు పరిశీలించారు.
ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించి విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు నమోదులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లు, పాఠశాల నిర్వహణకు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన ఎంఈఓ , ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే ప్రతిరోజూ విద్యార్థులకు నాణ్యమైన, వేడి భోజనం అందించాలని ఆదేశించారు. భోజనం తయారీలో పరిశుభ్రత పాటించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన ఆహార పదార్థాలను వినియోగించాలని సూచించారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, ప్రాథమిక స్థాయిలోనే భాషా, గణిత నైపుణ్యాలను పెంపొందించేలా బోధన కొనసాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు.ఈ తనిఖీలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు ( వుదయం):



మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి యువతకు, విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో నషా ముక్తి భారత్ అభియాన్, బ్రాహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఏర్పాటు చేసిన మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై.. పాఠశాల, కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ..యువత దేశ భవిష్యత్తు అని, వారిని మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు, సామాజిక సంస్థలు, ప్రజలందరిపై ఉందని అన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ భవిష్యత్తు కూడా తీవ్రంగా దెబ్బతింటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వ్యసనం నేరాలు, హింస, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులకు దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత చదువు, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల వైపు దృష్టి సారించి తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, ప్రతి కాలనీ, ప్రతి విద్యాసంస్థ డ్రగ్స్ రహిత ప్రాంతంగా మారాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని ఎమ్మెల్యే తెలిపారు. సమాజంలో అవగాహన పెంపొందించడం ద్వారా మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు విజయ్ కుమార్, బాల్ రెడ్డి, నర్రా బిక్షపతి, అశోక్, హనుమంత్ రెడ్డి, మైత్రి క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, పృథ్వీరాజ్, బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# చదువుల పాలిట.. ఆర్టీసీ 'గండం'!

- బస్సు రాదు.. అధికారుల మనసు కరగదు!
- గార్లపాడు వద్ద నీలిపల్లి గ్రామస్థుల విప్లవ శంఖారావం.. మంత్రులు, ఎమ్మెల్యేలు ఏమైనట్లు?

మల్దకల్ ఆగస్టు 05
(వుదయం కరస్పాండెంట్)

ఆర్టీసీ అధికారుల ఆఫీసు గదుల్లోని ఏసీ చల్లదనంలో.. నీలిపల్లి విద్యార్థుల చదువుల భవిష్యత్తు మాడిపోతోంది! రవాణా సౌకర్యం లేక బడికి వెళ్లలేకపోతున్నామని మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారుల వైఖరిపై నీలిపల్లి గ్రామం సత్యాగ్రహానికి దిగింది. బుధవారం గార్లపాడు స్టేజీ వద్ద రవాణాను దిగ్బంధించి తమ నిరసన గళాన్ని విప్పింది. రోజూ 50 మంది విద్యార్థులు కాళ్లకు ఈతకర్రలు కట్టుకుని ప్రధాన రహదారికి నడవడం అధికారులకు వినోదంగా ఉందా? అని నిలదీశారు. ఎన్నిసార్లు విన్నవించినా "పరిశీలిస్తాం" అనే రొటీన్ నాటకాలు ఆడటం తప్ప సాధించింది ఏమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్, ఎమ్మెల్యే, ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉత్తుత్తి మాటలు పక్కనపెట్టి, ఉదయంసాయంత్రం వేళల్లో వెంటనే బస్సు సర్వీసును ప్రారంభించాలి. లేని పక్షంలో ఈ నిరసన మంటలు డిపోలను తాకుతాయని హెచ్చరించారు.

# హాస్టళ్లు కాదు... నరకకూపాలు!

- పేద విద్యార్థుల బతుకులతో చెలగాటం!
- పురుగుల అన్నం.. నాసిరకం వంటకం.. రోగాల పాలు చేస్తున్న సంక్షేమం!
- అధికారుల కక్కుర్తికి విద్యార్థుల ప్రాణాలు బలి పశువులా?
- దిగొచ్చి సమగ్ర విచారణ చేపట్టకపోతే జిల్లా దిగ్బంధం: ఏఐఎస్ఎఫ్ ఆక్రోశం

గద్వాల ఆగస్టు 05
(వుదయం బ్యూరో)



అణగారిన వర్గాల పిల్లల చదువులకు నీడనివ్వాల్సిన ప్రభుత్వ వసతి గృహాలు... నిర్లక్ష్యపు నిలయాలుగా, రోగాల పుట్టలుగా మారి విద్యార్థుల భవిష్యత్తును చిదిమేస్తు న్నాయి! అధికారుల కక్కుర్తి, యంత్రాంగం అంతులేని నిర్లక్ష్యం కలగలసి వసతి గృహాలను రక్షక నిలయాలుగా కాకుండా 'నరకకూపాలు'గా మార్చేశాయి. జోగులాంబ గద్వాల జిల్లాలోని బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాల్లో రాజుకుంటున్న అభాగ్య విద్యార్థుల వేదనను అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) గురువారం బయటపెట్టింది. విద్యార్థుల ప్రాణాలతో సంక్షేమ శాఖ చెలగాటమాడుతోందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. అన్నం పేరిట విషతుల్య ఆహారం! జిల్లాలోని పలు హాస్టళ్లను ఏఐఎస్ఎఫ్ బృందం ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడ నెలకొన్న దయనీయ పరిస్థితులను ప్రత్యక్షంగా చూసి దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. నిత్యం పళ్లెంలో పడుతున్న అన్నం చూస్తే కడుపు నిండడం దేవుడెరుగు... కళ్లు చెమరుస్తున్నాయని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పురుగులు పట్టిన బియ్యం, ఈగలు వాలిన కూరలు, కుళ్ళిన పదార్థాలతో వండివారుస్తున్న ముద్దను విద్యార్థుల నోటికి అందిస్తూ వారి ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు. రూ.కోట్లు బడ్జెట్ విడుదలవుతున్నా, విద్యార్థుల పొట్టకొట్టి నొక్కేస్తున్న కక్కుర్తి అధికారుల తీరుపై నిప్పులు చెరిగారు.

**అధికారుల పాపం.. విద్యార్థులకు శాపం!**

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భరత్, కార్యదర్శి ప్రవీణ్ ఆక్రోశంతో మాట్లాడుతూ— "సంక్షేమం పేరిట పేద విద్యార్థులను బలిపశువులను చేస్తారా? ప్రతి నెలా ఆడిటింగ్ పేరిట మామూళ్లు నొక్కేయడమే తప్ప, హాస్టళ్లలో పిల్లలు ఎలా చస్తున్నారో చూసే తీరిక అధికారులకు లేదా?" అని ప్రశ్నించారు. తక్షణమే జిల్లా సంక్షేమ శాఖ అధికారులు ఎసి గదుల నుంచి బయటకు వచ్చి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని, నాణ్యమైన ఆహారం, పారిశుధ్య వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలెక్టరేట్ ముట్టడితో పాటు జిల్లా వ్యాప్తంగా ప్రజాసంఘాలను ఏకం చేసి ప్రభుత్వాన్ని, జిల్లా యంత్రాంగాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు గంగాధర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల నివారణకు ప్రజల్లో అవగాహన ప్రధాన ఆయుధం




- జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక
- ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట ఆగస్టు 05
(వుదయం ప్రతినిధి)

సైబర్ నేరాలు జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, అవి జరగకుండా ముందుగానే ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే అత్యంత ప్రభావవంతమైన మార్గమని జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పేర్కొన్నారు.సురక్ష కా తిరంగా -సైబర్ జాగృత్ దివస్ సందర్భంగా జిల్లా పోలీసు శాఖ డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో నారాయణ పేట జిల్లా కేంద్రంలోని అభినందన్ గార్డెన్స్‌లో నిర్వహించిన భారీ సైబర్ అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్, ఎస్పీలు పాల్గొని ప్రసంగించారు.అంతకు ముందు వివిధ రకాలుగా సైబర్ నేరాల బారిన పడిన బాధితులు స్వయంగా మాట్లాడి సైబర్ నేరాల వలలో ఎలా చిక్కుకున్నారో స్వయంగా వారి మాటల్లో వివరించి ఓటీపీలు ఎవరికి చెప్పొద్దని, అనవసర లింక్స్ ఓపెన్ చేయరాదని, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చు అనే ఆశకు గురికావద్దని అలాంటి చిన్న చిన్న తప్పులు చేయొద్దని ఎవరికైనా డబ్బులు పంపించే ముందు ఒకసారి ఆలోచించి పంపాలని స్వయంగా తెలిపారు. సైబర్ నేరగాళ్లు ప్రజలను భయం, సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్ లైన్ కు కాల్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతూ అవసరమైన సహాయాన్ని అందించేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందన్నారు .ఈ కార్యక్రమంలో డీఎస్పీలు మహేష్, నల్లపు లింగయ్య, డీఎంహెచ్‌వో జయ చంద్రమోహన్, సీఐలు శివశంకర్, రామ్‌లాల్, భగవంత్‌రెడ్డి, సైదులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, జిల్లా పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, విద్యార్థులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు,సుమారు 5 వేల మంది ఈ అవగాహన సదస్సుకు హాజరయ్యారు.

# సర్పంచ్ సోదరుని అంత్యక్రియల్లో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

- మృతుడి కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి....

వుదయం న్యూస్
శివ్వంపేట, ఆగస్టు 5 :



మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ గుణంగారి రాజు తమ్ముడు బీఆర్ఎస్ కార్యకర్త గుణంగారి స్వామి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి గుణంగారి స్వామి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్త గుణంగారి స్వామి మృతి బాధకరమని, వారి కుటుంబానికి దేవుడు మనోధైర్యం కల్పించాలని, వారి కుటుంబానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, సీనియర్ నాయకులు సింగాయపల్లి గోపి, మాజీ సర్పంచ్ అనూషఅశోక్ గౌడ్, అంజాగౌడ్, లింగంయాదవ్, మాజీ కోఆప్షన్ సభ్యులు లాయక్, యాదాగౌడ్, ముద్ద గల లక్ష్మీనరసయ్య. ఉపసర్పంచ్ శ్రావణిప్రవీణ్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ పొల్దాస్ సంధ్యవెంకటస్వామి. బిర్తి రాములు. మాజీ సర్పంచ్ శంకర్. గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# పథకాలు పక్కదారి పడితే అధికారులపై వేటు తప్పదు!

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు తీవ్ర ఆగ్రహం
- అధికారుల ఉదాసీనతపై సహనం నశించిన ఎమ్మెల్యే.. క్షేత్రస్థాయికి వెళ్లాలని ఘాటు హెచ్చరిక

ఆలంపూర్ ఆగస్టు 05
(వుదయం కరస్పాండెంట్)



గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక లాంటి నేతన్నల పొట్ట కొట్టేలా అధికారులు వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆలంపూర్ శాసనసభ్యులు విజయుడు అత్యంత ఘాటుగా హెచ్చరించారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాణప్రదంగా అందిస్తున్న పథకాలు పక్కదారి పడితే బాధ్యులైన అధికారులను ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా చేనేత, వస్త్ర పరిశ్రమల శాఖ సహాయ సంచాలకురాలు (ఏడీ) వి. ఇందిర ఎమ్మెల్యేను నియోజకవర్గంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో చేనేత రంగం నిర్వీర్యమవుతున్న తీరు, సహకార సంఘాల్లో పేరుకుపోయిన అక్రమాలు, ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలు నిజమైన లబ్ధిదారులకు అందకపోవడంపై ఎమ్మెల్యే అధికారులను కడిగిపారేశారు. ఎసి గదులు దాటి క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే! సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే విజయుడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహకాలు దళారుల జేబుల్లోకి వెళ్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు?" అని నిలదీశారు. కాగితాల్లో లెక్కలు చూపి చేతులు దులుపుకుంటే సరిపోదని, అధికారులు ఎసి గదులు వదిలి క్షేత్రస్థాయి లోకి వెళ్లాలని ఆదేశించారు. సంక్షేమ పథకాల పంపిణీలో నూటికి నూరు శాతం పారదర్శకత ఉండాలని, అర్హుడైన ఏ ఒక్క నేతన్నకు అన్యాయం జరిగినా సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సహకార సంఘాల తీరును తక్షణమే ప్రక్షాళన చేయాలని, కష్టజీవులైన చేనేత కుటుంబాల జీవనోపాధికి భరోసా కల్పించకపోతే కఠిన చర్యలు తప్పవని యంత్రాంగాన్ని తీవ్ర స్వరంతో హెచ్చరిం చారు.



# గ్రేటర్ హైదరాబాద్



## స్టీల్ బ్రిడ్జ్‌పై ఘోర రోడ్డు ప్రమాదం.



- ఎలక్ట్రిక్ బైక్ స్కిడ్ కావడంతో పూజారికి తీవ్ర గాయాలు

ముషీరాబాద్, ఆగస్టు05(వుదయం)

ముషీరాబాద్ పరిధిలోని ఇందిరాపార్క్-విద్యానగర్ మార్గంలోని స్టీల్ బ్రిడ్జ్‌పై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ పూజారి తీవ్రంగా గాయపడ్డారు.పోలీస్ సమాచారం ప్రకారం. అంబర్పేట్ లో నివాసం ఉండే 39 ఏళ్ల చంద్రశేఖర్, వృత్తిరీత్యా పూజారి. బేగంపేటలోని తన అన్న ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా, ఎలక్ట్రిక్ బైక్‌పై ఇందిరాపార్క్ నుంచి విద్యానగర్ వైపు ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో స్టీల్ బ్రిడ్జ్‌పైకి చేరుకోగానే బైక్ ఒక్కసారిగా స్కిడ్ కావడంతో అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. ప్రమాదంలో చంద్రశేఖర్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడే వెళ్తున్న వాహనదారులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స అనంతరం బాధితుడిని సమీప ఆసుపత్రికి తరలించారు.అనంతరం స్థానికులు చిక్కడపల్లి పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు.

ఈ ఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.

## అంబేద్కర్ విగ్రహంపై రాజకీయాలు మానుకోండి



షాద్‌నగర్

చౌరస్తా విస్తరణ పేరుతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించే కుట్రలను MRPS రంగారెడ్డి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది.భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక న్యాయానికి చిరునామా అయిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని అభివృద్ధికి అడ్డంకిగా చిత్రీకరించడం అత్యంత దురదృష్టకరం. చౌరస్తా విస్తరణకు అంబేద్కర్ విగ్రహం అడ్డంకి కాదని, వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే ఇతర నిర్మాణాలే ప్రధాన సమస్యగా ఉన్నాయని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొంటున్నాము. అభివృద్ధి పనుల పేరుతో దళితుల ఆత్మగౌరవ ప్రతీక అయిన అంబేద్కర్ విగ్రహాన్ని లక్ష్యంగా చేసుకోవడం సమంజసం కాదు. అభివృద్ధి అందరికీ అవసరమే, కానీ అది ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉండకూడదు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం మరియు సంబంధిత అధికారులు వెంటనే ఈ అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలి. ఒకవేళ చౌరస్తా పునర్వ్యవస్థీకరణలో భాగంగా విగ్రహాన్ని మార్చాల్సిన అవసరం ఉంటే, ముందుగా చౌరస్తాలోనే ప్రజలకు నిర్ణయం మేరకు నూతన అంబేద్కర్ విగ్రహాన్ని చౌరస్తా సెంటర్ లో ఏర్పాటు చేసి, ఆ తర్వాత మాత్రమే పనులు ప్రారంభించాలి. అంబేద్కర్ విగ్రహం విషయంలో ఏకపక్షంగా, ప్రజల అభిప్రాయం లేకుండా నిర్ణయాలు తీసుకుంటే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్య పద్ధతుల్లో విస్తృత ఉద్యమాలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ప్రభుత్వం గమనించాలి. దీనివల్ల ఏర్పడే పరిణామాలకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే.ప్రజల ఆత్మగౌరవాన్ని గౌరవించండి. అంబేద్కర్ విగ్రహాన్ని రాజకీయాలకు బలి చేయవద్దు. సమాన న్యాయం, పారదర్శకతతో వ్యవహరించాలని MRPS రంగారెడ్డి జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేస్తోంది.పెంట నోళ్ళ నరసింహ మాదిగMRPS రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు SC ST అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు

## భౌరంపేట్ లో ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే పర్యటన

దుండిగల్, ఆగష్టు 5,(వుదయం ప్రతినిధి ),

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ సర్కిల్, భౌరంపేట్ గ్రామంలో ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ శ్రీ కె.పి. వివేకానంద స్థానిక నాయకులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామం లోని ప్రధాన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, ట్రాఫిక్ సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి స్థానిక ప్రజలు, నాయకులు, గ్రామ పెద్దలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పూర్తిగా దెబ్బతిన్న రోడ్లు, సరిగా లేకపోయిన డ్రైనేజీ వ్యవస్థ, రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలపై అధికారులతో చర్చించి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్ల మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు శంబిపూర్ కృష్ణ, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, గ్రామ పెద్దలు, వివిధ కాలనీల ప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు డిజిటల్ భద్రతపై అవగాహన పెంచుకోవాలి



చేవెళ్ల సీఐ కట్టా నరేందర్ రెడ్డి

చేవెళ్ల,ఆగస్టు5(వుదయం)

చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల సీఐ కట్టా నరేందర్ రెడ్డి, మరియు ఎస్సై కోటేశ్వరరావు లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఐ కట్టా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... నకిలీ పెట్టుబడులు, ఫిషింగ్ లింకులు, డిజిటల్ అరెస్ట్‌లు, OTP-UPI మోసాలు, లోన్ యాప్‌లు, నకిలీ ఉద్యోగ ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.OTP, UPI PIN, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. ఎస్సై కోటేశ్వరరావు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. కాంచనలత మాట్లాడుతూ..విద్యార్థులు సైబర్ భద్రతపై అవగాహన పెంచుకుని, కుటుంబ సభ్యులు, స్నేహితులకు తెలియజేస్తూ 'సైబర్ అవగాహన రాయబారులు'గా మారాలని పిలుపునిచ్చారు.వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్ బాబు సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జగన్,బుగ్గయ్య, కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా కృషి



- మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్‌రెడ్డి

చేవెళ్ల ఆగస్టు 5(వుదయం)

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేసేందుకు కృషి చేస్తున్నామని చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని బుధవారం దామరగిద్ద 9వ వార్డులో బేగరి కవిత-రాజు దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ... పేద మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని అన్నారు.స్థానిక కౌన్సిలర్ తాళ్లపల్లి నర్సిములు ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మాజీ డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ రాములు, కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్, మాజీ సర్పంచులు వెంకటేశం గుప్తా, మధుసూదన్ గుప్తా, పడాల ప్రభాకర్, దొడ్డి సత్తయ్య, దొడ్డి మల్లేష్, బేగరి ప్రభాకర్, పవన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బదలావ్ జరూరి హై ప్రచార యాత్ర వాల్ పోస్టర్లు విడుదల



కుత్బుల్లాపూర్, ఆగష్టు 5,(వుదయం ప్రతినిధి ),

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ ఆధ్వర్యంలో తలపెట్టిన బదలావ్ జరూరి హై మార్పు కావాలి వాల్ పోస్టర్లు నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప లో విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలభిస్తున్న ప్రజా, రైతు,విద్యార్థి,కార్మిక వెతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో చేపడుతున్న సెప్టెంబర్ 1వ తేదీన ఛలో డిల్లీ కార్యక్రమంలో భాగంగా ఈ నెల ఆగస్టు 06 నుండి 14 వ తేదీ వరకు ప్రచార యాత్రను జయప్రదం చేయాలనీ వారు పిలుపునిచ్చారు. భారత దేశం అభివృద్ధి చెందాలంటే మార్పు కావాలని బదలావ్ జరూరి హై అని వారు అన్నారు. ఇటీవల పేపర్ లీ కేజీలు, కార్మిక వెతిరేక నల్ల చట్టాలు, నూతన రైతు వెతిరేక చట్టాలు, నిరుద్యోగ యువత పెరగడం వల్ల ప్రజలు మార్పు కోరుకుంటున్నారని వారు గుర్తు చేశారు. ఈ ప్రచార యాత్రకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గోని జయప్రదం చేయాలనీ వారు కోరారు. ఈ కార్యక్రమంలో పొన్నాకంటి దస్తగిరి, రాము, పుష్పమ్మ, సత్తమ్మ, లక్ష్మి, కవిత, రవి, పద్మ, నర్సమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి పరీక్ష కేంద్రానికి విశేష స్పందన



బాచుపల్లి, ఆగష్టు 3,(వుదయం ప్రతినిధి ),

సామాజిక స్పృహతో ప్రగతి నగర్ భారతీయ జనతా పార్టీ సూచన మేరకు ఓబీసీ మోర్చా అధ్యక్షులు తూమాటి శంకర్రావు ఆధ్వర్యంలో ఆనంద్ ఐ ఇన్స్టిట్యూషన్ సౌజన్యంతో ప్రగతి నగర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్ష కేంద్రాన్ని స్థానిక బిజెపి అధ్యక్షులు నరేంద్ర చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 210 మంది ఉచిత ఐ క్యాంపును సద్వినియోగం చేసుకున్నారని, ఈ క్యాంపులో 14 మందికి క్యాటరాక్ట్ శస్త్రచికిత్సకు ఎంపిక చేయగా 28 మందికి ఉచిత కళ్ల జోడులు, 70 మందికి ఐ డ్రాప్స్ పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని హెల్త్ చెకప్ క్యాంపులు నిర్వహించడంతో పాటు సాధ్యమైనంత వరకు ఉచితంగా లేదా రాయితీ ధరలతో ఆపరేషన్లు నిర్వహించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఓబీసీ మోర్చా అధ్యక్షులు తూమాటి శంకర్రావు భారతీయ జనతా పార్టీ ప్రగతి నగర్ డివిజన్ తరపున శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీచర్ సెల్ స్టేట్ కోకన్వీనర్ సుమన్ రావు, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల రవికుమార్ యాదవ్, జిల్లా నాయకులు మందపాటి శ్రీధర్ రెడ్డి, నిజాంపేట అధ్యక్షులు ప్రసాద్ రాజు, ఉపాధ్యక్షులు ఉదయ్, ప్రగతి నగర్ డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్యామా సుందరి, యువ మోర్చా అధ్యక్షుడు దొడ్డ పవన్, ఉపాధ్యక్షులు ఉప్పాల వంశీ, యువ నాయకులు రాకేష్, లక్ష్మచారి డివిజన్ నాయకులు మహేష్, రామారావు, సిరికొండ శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మోకిలా పోలీసుల సైబర్ అవగాహన

శంకర్‌పల్లి ఆగస్టు 05(వుదయం)

శంకర్‌పల్లి మండలం మోకిలా గ్రామంలో బుధవారం నేషనల్ సైబర్ జాగ్రత్తక్ దివస్ సందర్భంగా మోకిలా పోలీసుల ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాచీన్ గ్లోబల్ స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తత ఎంత అవసరమో పోలీసులు వివరించారు. డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ బ్యాంకింగ్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ మోసాల నుంచి ఎలా రక్షించుకోవాలో విద్యార్థులకు ఉదాహరణలతో వివరించారు. ఈ సందర్భంగా సైబర్ భద్రతకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేసి ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చర్యలు చేపట్టారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, అపరిచిత వ్యక్తులు పంపే లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు, నకిలీ ఉద్యోగాలు, పెట్టుబడి ఆఫర్లు, లాటరీ సందేశాలు వంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఏదైనా సైబర్ మోసం జరిగితే వెంటనే సంబంధిత పోలీసులకు లేదా సైబర్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించే ఉద్దేశంతో గంజాయి, డ్రగ్స్ వంటి



మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సీఐ శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, మంచి విద్య, క్రమశిక్షణ, విలువలతో ముందుకు సాగితేనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరితో మత్తు పదార్థాలను ఎప్పటికీ వినియోగించబోమని, సైబర్ నేరాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై సురేష్ గౌడ్, పోలీసు సిబ్బంది, ప్రాచీన్ గ్లోబల్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలనే సందేశాన్ని పోలీసులు అందించారు. కార్యక్రమం విజయవంతంగా ముగియగా, విద్యార్థులు సైబర్ భద్రతా నియమాలను పాటిస్తూ ఇతరులకు కూడా అవగాహన కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## సైబర్ సురక్ష తిరంగా సదస్సు

గజ్వేల్, ఆగస్టు 05 (వుదయం ప్రతినిధి)

స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గజ్వేల్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో 'సైబర్ సురక్ష తిరంగా' వారోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ, ఇతరులను కూడా చైతన్యపరచాలని పిలుపునిచ్చారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గజ్వేల్ సీఐ వి. రవికుమార్ మాట్లాడుతూ.. ఫోన్ వినియోగంలో జాగ్రత్త వహించాలని, డిజిటల్ అరెస్ట్, క్యూఆర్ కోడ్ స్కాన్ మోసాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 'గోల్డెన్ అవర్'లో 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న డబ్బును వెంటనే రికవరీ చేసే అవకాశం ఉంటుందని వివరించారు.ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సీఐ దత్తాత్రేయ, ఎస్సైలు జైపాల్ రెడ్డి, వెంకటరమణారెడ్డి, పీడీ డాక్టర్ రాజారావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, అధ్యాపకులు డాక్టర్ మురళీధర్, సుజాత, బాలచంద్రం, జయరాజు, నరేష్ మరియు విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE XX JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURTS: AT HYDERABAD**
**O.S. NO. 1343 OF 2025**

*Between:*
Mr. Giridhar Gopal Dhoot, S/o Nandlal Dhoot, Aged about: 61 years, Occ: Business, R/o: 4-2-212, Sultan Bazaar, Hyderabad
**... Plaintiffs**
**AND**
K. Vishal Kumar, S/o. K. Vijaya Kumar, Aged about: Major, Occ: Business R/o. H. No. 7-198, Lenin Nagar, Balapur X roads, Hyderabad-01 & Tenant of One Mulgi bearing Municipal No. 4-2-212/A1, Sultan Bazaar, Hyderabad-01
**... Defendants**

**PUBLIC NOTICE**

Please take notice that the above suit is filed against you the above mentioned Defendants seeking Eviction and Recovery of Rental arrears and the said suit stands posted to 31.08.2026 for your appearance before the Hon'ble XX Junior Civil Judge, City Civil Courts, At Hyderabad. Kindly note that in the event of your non-appearance on the said next date of hearing, the matter will be proceeded with ex-parte.

*[By order of the Hon'ble XX Junior Civil Judge ]*

*sd/-*
***A. RAVI TEJA***
***ADVOCATE***
***#401, 4th Floor, KVR Bhagavathi Pride, Street No. 6, Advocates Street, Himayathnagar, Hyderabad – 29, 9848338125***

**IN THE COURT OF THE I JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: SECUNDERABAD**
**O.S. NO: 114 OF 2022**

*Between:*
CANARA BANK
SECUNDERABAD BRANCH, SD ROAD
**...PETITIONER/PLAINTIFF**
**AND**
**M/S**. Sri. Perisetti Govindaraju,
**TO**
**M/S** Sri. Perisetti Govindaraju, Sri. Perisetti Govindaraju, S/o. late AppaRao, Aged: 44 years, Occ; Business, R/o. H. No. 1-8-700/7, Ramayya IIT Study Circle, Padma Colony, New Nallakunta, Hyderabad-500 044.

Please take notice that the Plaintiff herein has filed the above said case against you for Recovery of money. The said case is posted for 20-08-2026 for your appearance, hence you shall appear either in person or through an advocate before the said court on at 20-08-2026 10:30 am or else the matter will be settled as per law.

*[By order of the court ]*

*sd/-*
***THIRUMAL RAO MAMIDALA***
***THIRU LEGAL ASSOCIATES***
***CHAMBERS: SRI ROI VILLA APARTMENT 101 & 102, 8-2-293/K, SAGAR SOCIETY SRINAGAR COLONY, HYDERABAD –500073.***
***MOBILE NO: 8790806999***

**IN THE COURT OF THE HONBLE XIX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD**
**O.S. No. 2314 OF 2026**

*Between:*
Mr. Gorugantu Vani & Others
**... Plaintiffs**
**AND**
The Tahsildar Amberpet, Mandal, & All Concerned
**... Defendants**

To,
All Concerned

This is to inform the general public that the plaintiff have filed the above suit for declaration to declare them as legal heir of Late Gorugantu V S S S Srinivas. The said suit is posted on 03-09-2026 at 10:30 A.M, if anybody has any objections kindly appear before the above Hon'ble Court on 03-09- 2026 at 10:30 A.M, either in person or through advocate, failing which the matter will be decided in your absence as per law.

*[By order of the court ]*

*sd/-*
***Mohd Abdul Quadeer,***
***Mohd Shanoor***
***Syed Muzaffar Hussain***
***Advocates***
***opp to Nampally Criminal Courts, Hyderabad 04.***
***Ph.No.9966332055***

**IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE, AT : SECUNDERABAD.**
**O.S. No. 531 of 2026**

*Between:*
DEVI PRASAD JHANWAR & Others
**... Plaintiffs**
**AND**
TAHSILDAR/M.R.O TIRUMALGIRI Mandal and another
**... Defendants**

To,
All concern

1. Please take notice that the above named Plaintiffs have filed the above O.S. against you and another to declare them as legal heir of Deceased **PUSPA DEVI MAHESWARI** who died on 05-05-2026 at Hyderabad and she is the permanent resident of Hyderabad and the above case is posted to 25-08-2026, for your appearance kindly appear before the above court on the above said date at 10:30 A.M. by person or through a pleader failing which the Hon'ble court will decide the matter on merits.

*[By order of the court ]*

*sd/-*
***M/S.A.CHANDRA SHEKAR***
***T. Abhishek Singh***
***Advocates & Associates***
***H.No. 14-10-151, Lower Dhoolpet, Hyderabad.***
***Cell: 939 130 1466***
***630 393 7822***
***Counsel for Plaintiff.***

**IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE ,CITY CIVIL COURT,AT: HYDERABAD**
**O.S.NO: 2101 OF 2026**

*Between:*
1. Naveen Sanghi S/o.Naresh Sanghi Age: 51years, occ: Business R/o. 8-2-331/4, Road No.3, Banjara Hills, Hyderabad, Telangana – 500034
2. Rajesh Sanghi S/o. Naresh Kumar Sanghi, Age: 48years, Occ: Business R/o. 8-2-331/4, Road No-3, Near Banjara Hills Police Station, Hyderabad, Telangana – 500034

**... Plaintiffs**
**AND**
1. Mandal Revenue Officer(Tahsildhar), Hyderabad, (Shaikpet Mandal).
2. All Concerned

**... Defendants**

To,
All Concerned

Please note that, the above named plaintiffs have filed a suit in O.S. No. 2101 of 2026 seeking declaratory relief to declare them as legal heirs of the deceased Late. NARESH KUMAR SANGHI AND SANTHOSH SANGHI. Any person or persons having any objection with regard to above claim shall appear before the above court at 10:30 A.M. on. 24.08.2026 either in person or through an advocate. Otherwise the matter will be decided as per law.

*[BY ORDER OF THE HON'BLE COURT]*

*sd/-*
***D. SUMITHA YADAV***
***C. ADITHYA***
***Advocates,***
***H.No. 6-3-709, Padmavathi Arcade, 4th Floor, Punjagutta, Hyderabad – 500072***
***Mb. No.9291310444***

**IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE CUM -XII ADDL.JUDICIAL MAGISTRATE OF FIRST CLASS RANGAREDDY DISRICT AT: RAJENDRANAGAR.**
**O.S.NO. 432 OF 2026**

*Between:*
Smt. Chinnola Laxmi
**...Petitioners/ Plaintiffs**
**AND**
1. All Concerned
2. Tahsildar RAJENDRANAGAR mandal

**...Respondents/ Defendants**

**NOTICE**

The General Public hereby intimated that the above named Smt. Chinnola Laxmi W/o. Chinnolla Laxmaiah, D/o. Pusala Chandraiah @ G. Ram Chandraiah@Ram Chandri, Age: 43 years, Occ: House hold, All are R/o H.No.10-35, Kancharla Gudem, Bhanoor, Patan cheruvu, Medak, Telangana have filed a suit on the file of Hon'ble i ADDL JUNIOR Civil Judge CUM XII ADDL JUDICIAL MAGISTRATE, R.R District, at RAJENDRANAGAR, praying the Hon'ble court to declare her as legal heirs of deceased Sri Late Pusala Chandraiah@G. Ram Chandraiah @ Ram Chandri S/o. Balaiah, R/o. H.No. 5- 48, Shanthi Nagar, Hydershakote, Telangana In consideration of said suit the Hon'ble court pleased to its orders directing under signed to publish the notice in UDAYAM daily newspaper calling objections if anybody having, in declaring Smt. Chinnola Laxmi as legal heirs of Sri Late Pusala Chandraiah @ G. Ram Chandraiah @ Ram Chandri and if any person or persons may have any objections, such person(s) should appear before the Hon'ble court on the next day of hearing on 24/08/2026 at 10:30 am, failing which the Hon'ble court will proceed with the case basing on the record of the case. Hence this notice.

*[As per order of the Hon'ble court ]*

*sd/-*
**CH PRAVEEN KUMAR**
**ADVOCATE**
**OFF:H.NO.7-140, KUMMARIGUDA (V), KOTHUR (M), RANGAREDDYDIST.**
**CELL: 9948143582.**




## ఆ హక్కు మీకెవరిచ్చారు?

"ఒక బహిరంగ వేదికపై మహిళను దూషించే జన్మహక్కు మీకు ఎవరు ఇచ్చారు? ఇది కేవలం ఉదయనిధి స్టాలిన్ విషయంలోనే కాదు.. ఇతర రాజకీయ పార్టీలలోనూ జరుగుతోంది. మీ రాజకీయ ప్రయోజనాల కోసం ఇంకెన్నాళ్లు మహిళలను నిందిస్తారు? మీ స్వార్థ ప్రయోజనాల కోసం మహిళను అడ్డుపెట్టుకుని ప్రగల్భాలు పలుకుతూ ఆమెను అవమానిస్తున్నారంటే.. మీరు ఎంత బలహీనంగా ఉన్నారో అర్థమవుతోంది. మిమ్మల్ని మీరు బలమైన నాయకుడని చెప్పే అర్హత కోల్పోయారు. మీకు ధైర్యముంటే, నిజమైన నాయకుడిగా కొనసాగాలంటే.. ఏ మహిళనూ దూషించకుండా రాజకీయాల్లో నిలబడి చూపించండి. అది చేయగలరో లేదో చూద్దాం. నేను ఇలాంటి మాటలు, లింగవివక్ష వ్యాఖ్యలను గతంలోనూ చూశాను. డీఎంకేలో మహిళలపై వేధింపులు జరగడం కూడా చూశాను. కానీ, ఉదయనిధి స్టాలిన్ నుంచి ఇలాంటి మాటలు ఊహించలేదు."

**- ఖుష్బూ, ప్రముఖ నటి, బీజేపీ నేత**

## వే'మన' పద్యం



**ఆశచేత మనుజు లాయువు గలనాళ్ళు**
**తిరుగుచుండ్రు భ్రమను ద్రిప్పలేక**
**మురికి భాండమందు ముసుగు నీగల భంగి**
**విశ్వదాభిరామ! వినురవేమ**

# సంపాదకీయం

## న్యాయ వ్యవస్థకు అపార నష్టం

భారత ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం తర్వాత అత్యంత గౌరవనీయమైన వ్యవస్థ ఏదైనా ఉందంటే అది న్యాయవ్యవస్థ. ప్రభుత్వం తప్పు చేసినప్పుడు ప్రశ్నించేది, పౌరుల హక్కులను కాపాడేది, అధికార దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేది కోర్టులే. కానీ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు 'కొలీజియం' ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని మరోసారి బహిర్గతం చేశాయి. ప్రజల్ని 'చీమలు'గా చూసే భావజాలం ఉన్నవారు కూడా న్యాయ మూర్తులవుతున్నారని, నిజాయితీగా పనిచేసినవారికి పదోన్నతులు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పారదర్శకత లేకపోవడం వల్లనే ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయన్న ఆయన మాటలు వాస్తవానికి అద్దం పడుతున్నాయి. 'న్యాయవ్యవస్థలో పారదర్శకత' అన్న అంశంపై ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన ఓ సదస్సులో ఉజ్జల్ భుయాన్ ప్రసంగించగా, ఆయన చెప్పిన అంశాలు జరుగుతున్న పరిణామాల్ని బలపరిచేలా ఉన్నాయి. భారత రాజ్యాంగం న్యాయ వ్యవస్థను కార్య నిర్వాహక, శాసన వ్యవస్థల నుంచి స్వతంత్రంగా ఉంచింది. కారణమొక్కటే, అధికార దుర్విని యోగం జరిగినప్పుడు ప్రజలకు న్యాయం చేయగల చివరి సంస్థ న్యాయస్థానం కావాలి. కానీ, ఆ సంస్థలోకి ఎవరు వస్తున్నారు? ఏ ప్రమాణాలతో వస్తున్నారు? వారి రాజ్యాంగ నిబద్ధత ఏమిటి? అనే ప్రశ్నలు నేడు మరింత ముందు కొస్తున్నాయి. ఎందుకంటే, గత కొన్నేండ్లుగా కేంద్ర ప్రభుత్వ న్యాయవ్యవస్థపై ప్రభావం చూపాలనే ప్రయత్నాల పట్ల విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. కొలీజియం సిఫారసులను ఆలస్యం చేయడం, నియామకాలపై ఒత్తిడి తీసుకురావడం, న్యాయ వ్యవస్థ స్వతంత్రతపై రాజకీయ వ్యాఖ్యలు చేయడం వంటి పరిణామాలు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేలా చేస్తున్నాయి. రెండేండ్ల క్రితం అలహాబాద్ హైకోర్టు జడ్జి వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. వీహెచ్‌పీ నిర్వహించిన ఓ సభలో పాల్గొనడమే కాకుండా ప్రజల్ని చీమలతో పోల్చడం, ఆ మాటలు ముస్లింలనుద్దేశించి చేశారంటూ అప్పట్లో తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇలాంటి వ్యాఖ్యలతో న్యాయవ్యవస్థకు, ప్రజాప్రయోజనాలకు అపారమైన నష్టం వాటిల్లుతుంది. ఒక వర్గానికి అనుకూ లంగా వ్యవహరిస్తున్న తీరు తీర్పుల్లో కూడా వ్యక్తమయ్యే అవకాశం ఉంది. సందర్భం ఎలాంటిదైనా న్యాయ మూర్తి వ్యాఖ్య రాజ్యాంగానికి లోబడి ఉండాలి. కానీ, అది వ్యక్తిగత అభిప్రా యంగా మారకూడదు. మొన్నటికి మొన్న దేశమంతా చూసింది. 'బొద్దింకలు' అనే వ్యాఖ్య దేశ రాజకీయ చర్చల్లో సునామిని సృష్టించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తే ఈ పదాన్ని వాడటం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. తర్వాత వివరణ ఇచ్చినప్పటికీ అప్పటికే యువత సంఘటి తమైంది. ఈ ఐక్యత వెనుక దాగి ఉన్న నిరాశ, ఆవేదన, వ్యవస్థలపై నమ్మకం కోల్పోవడం వంటి అంశాలను విస్మరించలేం. ప్రజాస్వామ్యంలో మాటలను మాత్రమే కాదు, వాటిని పుట్టించిన పరిస్థితులను కూడా విశ్లేషించాలి. అందుకే జస్టిస్ భుయాన్ వ్యాఖ్యలలో అత్యంత ముఖ్యమైన అంశం కొలీజియంలో పారదర్శకత. న్యాయమూర్తుల ఎంపిక ఏ ప్రమాణాలపై జరుగుతోంది? రాజ్యాంగంపై నిబద్ధత, ప్రజాస్వామ్య విలువలపై విశ్వాసం, సామాజిక స్పృహ వంటి అంశాలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారు? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం లేకపోవడం వల్లే అనుమానాలు పెరుగుతున్నాయి. ఈ ప్రక్రియలో జరిగే చర్చలు పూర్తిగా గోప్యంగా ఉండటంతో పాటు, తీసుకునే నిర్ణయాలకు గల కారణాలను కూడా చాలా సందర్భాల్లో వెల్లడించడం లేదు. ఏ ప్రమాణాల ఆధారంగా నియామకాలు, పదోన్నతులు, బదిలీలు చేపడుతున్నారన్నది ప్రజలకు స్పష్టంగా తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవల కొలీజియం చేసిన తీర్మానాల్లో నిర్ణయాలకు ఎలాంటి కారణాలను నమోదు చేయకపోవడం పారదర్శకతపై మరిన్ని సందేహాలకు తావి స్తోంది. గతంలో కనీసం కొన్ని కారణాలనైనా వెల్లడించే పద్ధతి ఉండగా, ఇప్పుడు అది కూడా కనిపించకపోవడం 'అధికార వైఖరి'ని ప్రతిబింబిస్తోంది. ఇంకోవైపు, కొందరు న్యాయమూర్తుల తీరు ఆందోళన కరంగా ఉంది. బెయిల్ విషయంలో భిన్న ప్రమాణాలు, భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించిన కేసుల్లో విరుద్ధ వ్యాఖ్యలు, సామాజిక వాస్తవాల పట్ల స్పృహ లేని పరిశీలనలు ప్రజల్లో ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. న్యాయమూర్తి తీర్పు చట్టపరంగానే కాకుండా రాజ్యాంగ స్ఫూర్తికి కూడా అనుగుణంగా ఉండాలి.

### రచనలు పంపండి

ఉదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# దృశ్య కావ్యాల దర్శకుడు బి.ఎన్.రెడ్డి !




**కడప జిల్లా పులివెందుల తాలూకాలోని కొత్తపల్లి గ్రామంలో బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి, ఎరుకలమ్మ దంపతులకు 16-11-1908న పెద్ద కొడుకుగా జన్మించారు.తండ్రి మద్రాసులో ఉల్లిపాయల వ్యాపారం, కమీషన్ వ్యాపారం భారీగా విదేశాలతో కూడా నిర్వహిస్తుండే వారు. బి.ఎన్.రెడ్డికి మాత్రం చదువు మీదే ఆసక్తి ఎక్కువ వుండేది. జి.డి.ఎ చదువు (చార్‌టర్డ్ అక్కౌంటెన్సీతో సమానమైనది) పూర్తిచేసి తండ్రి వ్యాపారం ఇష్టపడక ఉద్యోగంలో చేరారు. చిన్నతనం నుంచి సాహిత్యం మీద రంగస్థలం మీద ఆసక్తివుండేది.**

సందేశాత్మక ప్రయోజనాత్మక చిత్రాలు తీయాలనే తపనతో అసభ్యత, అశ్లీలతకు తావులేకుండా చిత్రాలు తీసిన దృశ్య కావ్యాల దర్శకుడు బి.ఎన్. రెడ్డి. ఈయన సినిమాలకు ఒక్క సెన్సార్ కట్ కూడా పడకపోవడంవిశేషమే! .తెలుగు వారిలో తొలుత పద్మభూషణ్ అవార్డు అందుకున్న వానిగా, దాదా ఫాల్కే అవార్డు 1974లో అందుకున్న దక్షిణ భారతదేశానికి చెందిన మొదటి వ్యక్తిగా బి.ఎన్.రెడ్డి (బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి)కి గుర్తింపు వుంది. డాక్టర్ ఆఫ్ లెటర్స్ స్వీకరించిన తొలి భారతీయ సినీ ప్రముఖుడు.నటుడు కావాలని ఎంతో తపించిన నాగయ్యకు నటుడుగా అవకాశ మిచ్చారు. సినిమాలు మానేయాలని పెళ్లి తరువాత గట్టిగా నిర్ణయం తీసుకున్న భానుమతిని స్వర్గ సీమలో నటింప జేసి ఆమె బహు ముఖ ప్రజ్ఞాశాలి కావడానికి తోడ్పడ్డారు. చంద్రమోహన్ ని రంగుల రాట్నంలో పరిచయం చేసారు.దేవులపల్లి కృష్ణశాస్త్రిని సినీ రచయితగా పరిచయం చేయాలని అయిదు సంవత్సరాలు ఆయన చుట్టూ తిరిగి నిరీక్షించి తీసిన 5వ చిత్రం 'మల్లీశ్వరి ' ఎంతో ఘనవిజయం సాధించింది. ఎస్. రాజేశ్వరరావు అద్భుత సంగీతం తో ఎన్.టి.ఆర్, భానుమతి ముఖ్య పాత్ర ధారులుగా 20121951న విడుదలైంది. ఎస్.వి. ఆర్, జగ్గయ్య, కృష్ణకుమారి, జమున ప్రభృతులతో రూపొందించిన 'బంగారు పాప' 1931955లో విడుదలై ప్రశంసలు పొందింది. లండన్ ఫిలిం ఫెస్ట్‌వల్‌లో కూడా ప్రదర్శితమై ఎస్.వి.ఆర్ కి మంచి పేరు తెచ్చిన ఈ చిత్రాన్ని తొలిసారి దేవకీ బోస్ బెంగాలీ చిత్రంగా ఆ తర్వాత తీసారు. దర్శక నిర్మాతగా తీసింది తక్కువ చిత్రాలే అయినా, కేవలం దర్శకుడుగా బయట నిర్మాతలకు తక్కువ చిత్రాలే చేసినా కథలోగాని, సన్నివేశాల్లో గాని, సంభాషణల్లోగాని, సెట్స్, సెట్ ప్రాపర్టీ విషయంలోగాని ఏమాత్రమూ రాజీ పడకుండా దృశ్యకావ్యాల్లాంటి చిత్రాలు రూపొందించారు. అందుకే అవి క్లాసిక్స్‌గా పేరు తెచ్చుకున్నాయి.తన వాహిని స్టూడియో ఇచ్చేశారు. విజయా పతాకాన పలు చిత్రాలు నిర్మించిన, విజయా వాహినీ స్టూడియో, విజయాగార్డెన్స్ అధినేత బి. నాగిరెడ్డికి అన్నగారు బి.ఎన్.రెడ్డి.

సినిమా ద్వారా ప్రేక్షకుడుకి నీతి, సందేశం అందకపోతే ఆ చిత్రం తీయాల్సిన అవసరమే లేదు. దర్శక నిర్మాతలు సమాజానికి బాధ్యత వహించాలి కనుకనే తను ఈ అభిప్రాయానికి ఎప్పుడూ కట్టుబడి వుంటానని బి.ఎన్. రెడ్డి అనేవారు. కడప జిల్లా పులివెందుల తాలూకాలోని కొత్తపల్లి గ్రామంలో బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి, ఎరుకలమ్మ దంపతులకు 16111908న పెద్ద కొడుకుగా జన్మించారు.తండ్రి మద్రాసులో ఉల్లిపాయల వ్యాపారం, కమీషన్ వ్యాపారం భారీగా విదేశాలతో కూడా నిర్వహిస్తుండే వారు. బి.ఎన్.రెడ్డికి మాత్రం చదువు మీదే ఆసక్తి ఎక్కువ వుండేది. జి.డి.ఎ చదువు (చార్‌టర్డ్ అక్కౌంటెన్సీతో సమానమైనది) పూర్తిచేసి తండ్రి వ్యాపారం ఇష్టపడక ఉద్యోగంలో చేరారు. చిన్నతనం నుంచి సాహిత్యం మీద రంగస్థలం మీద ఆసక్తివుండేది. చెన్నపురి ఆంధ్ర మహాసభలకు తరచు హాజరౌతూ, అక్కడ జరిగే సాహితీ, సాంస్కృతిక కార్యక్రమల్లో కీలక బాధ్యతలుకూడా నిర్వహించేవారు. ఇది తండ్రికి ఇష్టం వుండేది కాదు. అలా అప్పటి ప్రముఖ నటులు బళ్లారి రాఘవాచారి, స్థానం నరసింహా రావు, వేమూరి గగ్గయ్య వంటి ప్రముఖులతో గాఢ స్నేహం వుండేది. వరవిక్రయం నాటకంలో బి.ఎన్.రెడ్డి పోషించిన పాత్ర చూసిన మహాత్మ గాంధీ అభినందించడం విశేషమే! కలకత్తాలోని శాంతి నికేతన్‌లోకొంత కాలం వుండటంతో కళలు, సాహిత్యంపై మరింత మక్కువ పెరిగింది. బెంగాలీ సాహిత్యం, బెంగాలీ నాటకాలపై ఆసక్తి పెరిగాక బొంబాయి వెళ్లి మరాఠీ, రంగస్థలంపై కూడా అవగహన ఏర్పరుచుకున్నారు. బర్మా సందర్శించినప్పుడు, అక్కడే చైనా ఒపేరాలు తిలకించాక కళలపై మరింత అభిరుచి పెరిగింది. ఈ ప్రభావం ఆయన రూపొందించిన సినిమాలపై వుండేది.బి.ఎన్.కె.ప్రెస్‌ని నిర్వహించడం వలన గూడవల్లి రామబ్రహ్మం, చక్రపాణి తదితరులు పరిచయమయ్యారు. టాకీ పులిగా గుర్తింపు పొందిన హెచ్.ఎం.రెడ్డి చిత్ర నిర్మాణ ఫైనాన్స్ కోసం కొల్హాపూర్ నుంచి మద్రాసు రావడంతో గూడవల్లి కూడా ప్రోత్సహించడంతో తండ్రి నుంచి పాతిక వేలు బి.ఎన్. తీసుకున్నారు. నటి కన్నాంబ కూడా భాగస్వామైంది. ఆరోజుల్లో 'రంగూన్ రౌడీ' నాటకం బహుళ ప్రజాదరణ పొందిన, సామాజిక ప్రయోజనం వున్నదిగా గుర్తింపు పొందింది. మద్యపాన వ్యసనం, అందమైన భార్య వున్నా పరాయి స్త్రీపై మోజుపడటం, భార్యా భర్తల మధ్య సయోధ్య లేకపోవడం, మహిళలను కించపరచడం, భార్యని రకరకాలుగా హింసించే భర్త వంటి అంశాలతో ఈ నాటకం వుండేది. టైటిల్‌ని 'గృహలక్ష్మి'గా పెట్టి హెచ్.ఎం.రెడ్డి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందించారు కన్నాంబ, కాంచన మాల, రామానుజాచారి ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం ద్వారానే నాగయ్య ఒక మంచి పాత్రలో సినీ నటుడుగా పరిచయమయ్యారు. మద్రాసులోని కార్తికేయ స్టూడియోలో షూటింగ్ జరుపుకున్న ' గృహలక్ష్మి' విడుదలై ఘనవిజయం సాధించింది. హెచ్.ఎం.రెడ్డితో కొన్ని అంశాల్లో విబేధించిన బి.ఎన్.రెడ్డి తన అభిరుచితో మంచి చిత్రాలు రూపొందించాలని తలచి, రోహిణీ నుంచి విడిపోయి వాహి నీ పిక్చర్స్ సంస్థని నెలకొల్పారు. టెక్నిషియన్స్‌గా గుర్తింపు పొందిన కె.రామనాథ్, ఎ.కె.శేఖర్, నటులు నాగయ్య, ముదిగొండ లింగమూర్తి, క్యాషియర్ కె.వి.రెడ్డి పూర్తి సహకారం అందిం చడంతో పాటు కె.రామ్‌నాథ్ ఒత్తిడి చేయడంతో 'వందేమాతరం ' చిత్రాన్ని తొలుత దర్శకత్వం వహిస్తూ రూపొందించారు. బాల్యవివాహాలను నిరసిస్తూ, విధవా పునర్వివాహాలను సమర్థిస్తూ ముక్కోణ ప్రేమకథా చిత్రంగా వాహినీ పతాకాన 'సుమంగళి' ద్వితీయ చిత్రంగా బి.ఎన్. రెడ్డి దర్శకత్వంలో రూపొంది 3151940లో విడుదలైంది. నాగయ్య, గిరి, లింగమూర్తి, గౌరీపతి శాస్త్రి, కుమారి మాలతి, పార్వతీబాయి ముఖ్య పాత్ర ధారులు. తృతీయ చిత్రంగా 'దేవత' బి.ఎన్.రెడ్డి దర్శకత్వంలో రూపొం దింది. కుమారి, టంగుటూరి సూర్యకుమారి, సి.హెచ్.నారాయణ రావు, లింగమూర్తి ముఖ్య పాత్రలు ధరించిన ఈ చిత్రం471941న విడుదలై ఘన విజయం సాధించి, రజతోత్సవాలు జరుపుకుంది. నాల్గవ చిత్రంగా భానుమతి, నాగయ్య, జయమ్మ, లింగమూర్తి, సి.హెచ్. నారాయణ రావులతో 'స్వర్గ సీమ' రూపొందించారు. 661946న విడుదలై నాలుగు రాష్ట్రాల్లో ఘనవిజయం సాధించింది. అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో వియత్నాంలో ప్రదర్శితమై ప్రశంసలు పొందింది. వాహినీ పతాకాన ఎన్.టి.ఆర్, రాజ సులోచన, రాజనాల, గుమ్మడిలతో తెలుగు, తమిళ భాషల్లో బి.ఎన్.రెడ్డి దర్శకత్వంలో 'రాజమకుటం' రూపొంది 2421960న విడుదలైంది.అక్కినేని, సావిత్రి, జమున నటించగా 'పూజాఫలం '

**1-10-1964న విడుదలై మంచి పేరు తెచ్చింది**

చంద్రమోహన్‌ని పరిచయం చేస్తూ వాహినీ పతాకాన రూపొందించిన 'రంగుల రాట్నం' చిత్రం 891966లో విడుదలై మంచి పేరు తెచ్చింది. ఆ తరువాత వాహినీ పతాకాన శోభన్ బాబు, వాణిశ్రీ లతో రూపొందిన 'బంగారు పంజరం' మంచి చిత్రం అనిపించుకున్నా విజయం సాధించ లేదు. బయట సంస్థలు తీసిన భాగ్యరేఖ, పూజా ఫలం చిత్రాలకు మాత్రమే బి.ఎన్.రెడ్డి దర్శకత్వం వహించారు. 16112008న మృతి చెందారు. కె.వి.రెడ్డి దర్శకత్వంలో నాగయ్యను భక్త పోతనగా చూపిస్తూ బి.ఎన్.రెడ్డి వాహినీ పతాకాన నిర్మించిన చిత్రానికి వచ్చిన పేరు ప్రతిష్ఠలు అంతాఇంతా కాదు. 1942లో విడుదలైన ఈ చిత్రంలో జంధ్యాల గౌరీనాథ శాస్త్రి, లింగమూర్తి, సి.హెచ్. నారాయణరావు ముఖ్య పాత్రధారులు బి.ఎన్.రెడ్డి ప్రతి అంశమూ ఒకటికి పదిసార్లు ఆలోచిస్తారు కనుక ఆయన దర్శకత్వంలో నటించాలంటే, సన్నివేశాలు పూర్తి కావాలంటే చాలా ఓపిక, సహనం వుండాలని తను నటుడైనా ఇలా నటించాలని చెప్పేవారు కాదని భానుమతి, నాగయ్య, లింగమూర్తి ప్రభృతులు అనేవారు.సినీరంగంలోని ఆర్టిస్టులు, టెక్నీషియన్లులో అవగాహన, విజ్ఞానం పెంపొందాలంటే పుస్తకాలు ఎక్కువగా చదవాలని, అర్థం కాకపోతే మళ్లీ మళ్లీ చదవాలని, ఇతర భాషా చిత్రాలు చూడాలని బి.ఎన్.రెడ్డి చెప్పేవారు. వాహినీలో పనిచేసే వారిలో తారతమ్యాలు వుండకూడదని, కలసికట్టుగా వుండాలని చెబుతూ అది ఆచరణలో పెట్టించేవారు. లైట్‌బాయి నుంచి దర్శకుడు వరకు ఒకే రకమైన భోజనం ఏర్పాటు చేయడమే కాక అందరూ కలసి తినే పద్ధతి అమలుచేసేవారు.



వి.ఎస్. ఆర్. కేశవరావు
సెల్: 9989235320

### ఎల్లవ్వ తల్లి బైలెల్లినామె




ఎళ్లినామే తల్లి బైలెల్లి నామే,
అమ్మ ఎల్లమ్మ, బహురూపుల
తల్లివే, బంగారు మాయమ్మవే, కోటి
కోర్కెలీడేర్చే శతకోటి కలల కల్పవల్లి.
కొంగుబంగారమైన కొండంత
మాయమ్మవే.
""ఎళ్లినామే తల్లి బైలెల్లినామే"
గౌడులకుల దేవతవని మమ్ముగన్న
తల్లివని, ఒడిబియ్యం గట్టుకొని,
ఎండి బోనమెత్తుకొని
ముత్తైదువులంతా భువనమంత
బోనమెత్తి మురిపంగా కదలిరంత.
""ఎళ్లినమే తల్లి బైలెల్లినామే""
డప్పుదరువు సప్పల్లతో, జమిడిక డమరుక ధ్వనులతో
శిగాలూగే శివసత్తులు, వీరగోల ఝుడిపింపుల,పోటీపడే
పోతురాజుల వీరంగం, అంగరంగ వైభవంగా పోటే త్తిన
జైకొట్టే జనంతోటి
""ఎళ్లి నామేతల్లి బైలెల్లినామె""
ఆషాడ మాసాన కొత్తకుండ యాపాకుల బోనమెత్తి,
పూనకాల ఊపులతో సిత్రాలు సేయంగా, ఘటమెత్తి సాగంగా
ఊరంతా ఊపు మీద ఉత్సవమై కదలంగ.
""ఎల్లి నామే తల్లిబైల్లినామె""
పోచమ్మ ,మైసమ్మ ,కాలమ్మ, ఎల్లమ్మ, దుర్గమ్మ పేర్లున్న,
అపురూపాల తల్లి వమ్మ అమ్మలగన్నవమ్మ , అంబా
భవానివమ్మ ,నల్లకోడి యాటలతో ఆరంబడిగ.
""ఎళ్లినామే తల్లి బైలెల్లినామే""
అంబరమంత సంబరంగా ఎదురుకోడి పిల్లలతో,
పలారంబండ్లు, కల్లు ముంత సాకలతో, మొక్కులు
చెల్లించంగా జడతలిచ్చి గావుపట్టి నైవేద్యమిచ్చుటకు .
""ఎళ్లినామే తల్లిబైలెల్లినామే""
పట్టు చీర కట్టుకొని కత్తులు బల్లెం పట్టుకున్న నిన్ను చేరి,
గుగ్గిలం మైసాచ్చుల దూపమేసి శాంతిచేసి అమ్మ నీకు
మొక్కులివ్వ అట్టహాసంతో,
""ఎల్లినామె తల్లి బైలెల్లినామె""
గోల్కొండ జగదాంబికా, ఉజ్జయిని మహంకాళి, జూబ్లీహిల్స్
పెద్దమ్మ, లాలూ దర్వాజ తల్లి, ఎల్లప్పుడుగాచే మాఇలవేల్పు
రేణుకఎల్లవ్వకు జోడు బోనమెత్తి జోహార్లు చేయంగా.
ఎళ్లినామే తల్లి బైలెల్లినామె

# నీరున్నా.. కూటమికి కనికరమేది?

**ఏల్ ని నో ప్రభావం వల్ల రాష్ట్రంలో వర్షా భావంతో పాటు కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు ఖరీఫ్ కు చాలా ముందే ప్రకటించారు. ఆ విధంగా కూటమి ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. శాస్త్రవేత్తల సూచనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎల్ ని నో ప్రభావాన్ని ఎదుర్కోవధానికి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి. కాని చంద్రబాబు నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం అలాంటి చర్యలు తీసుకోలేదు. నదుల్లో నీరు నిల్వకు అవసరమైన చర్యలు తీసుకోలేదు. అలాంటి చర్యలు తీసుకోకుండా సాగు నీటి విడుదల గురించి ఆర్భాటపు ప్రకటనలు చేశారు.**

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల వల్ల నదుల్లో నీటి నిల్వలు పడిపోయాయని, అందువల్ల కృష్ణా డెల్టాకు సాగునీరు ఇవ్వలేమని జూలై 242026న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ప్రకటించింది. మంత్రివర్గ నిర్ణయాన్ని సమాచార మంత్రి కె.పార్థసారథి తెలియ చేశారు. వరి పంట వేయ వద్దని, వరి పంట వేస్తే తర్వాత నీరు లేక నష్టపోయేది మీరేనని రైతులకు హెచ్చరిక జారీ చేశారు. ఏల్ ని నో ప్రభావం వల్ల రాష్ట్రంలో వర్షాభావంతో పాటు కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు ఖరీఫ్ కు చాలా ముందే ప్రకటించారు. ఆ విధంగా కూటమి ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. శాస్త్రవేత్తల సూచనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎల్ ని నో ప్రభావాన్ని ఎదుర్కోవధానికి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి. కాని చంద్రబాబు నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం అలాంటి చర్యలు తీసుకోలేదు. నదుల్లో నీరు నిల్వకు అవసరమైన చర్యలు తీసుకోలేదు. అలాంటి చర్యలు తీసుకోకుండా సాగు నీటి విడుదల గురించి ఆర్భాటపు ప్రకటనలు చేశారు. జూన్ 1 నుంచే కాల్వలకు నీరు విడుదల చేస్తామని మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామ నాయుడు ప్రకటించారు. కృష్ణా డెల్టాకి జూలై 1 నుంచి, నాగార్జున సాగర్ ఆయకట్టుకు జూలై చివరికి ,కే సీ కెనాల్ కి మరియు వంశధార ఆయకట్టుకు జూలై 15 నుంచి సాగు నీరు విడుదల చేస్తామని, రైతులు సేద్యానికి సిద్ధం కావాలని చెప్పారు. కృష్ణా డెల్టా ఆయకట్టుకి 150 టి ఎం సి లు అవసరమని, బ్యారేజిలో 461 టి ఎం సి ల నీరు అందుబాటులో ఉందని కూటమి ప్రభుత్వం ప్రకటించి జూలై 1న ప్రకాశం బ్యారేజీ నుంచి ఆర్భాటంగా నీరు విడుదల చేసింది. ఏరువాక పౌర్ణమి నాడు సాగు నీరు విడుదల చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఎన్ టి ఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ శా అన్నారు. కృష్ణా డెల్టా లోని 13 లక్షల ఎకరాలకు అవసరమైన నీరు కృష్ణా బ్యారేజి నుంచి ప్రకాశం బ్యారేజి కి ప్రవహిస్తుందని, రైతుల మొఖాల్లో ఆనందం నింపేందుకు నీటిని విడుదల చేశామని ఆమె అన్నారు.

మంత్రుల ప్రకటనతో రైతాంగం ఖరీఫ్ సేద్యానికి సమాయత్తం అవుతూ ఉండగా రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా డెల్టాకి సాగు నీరు విడుదల చేయలేమని జూలై 24న ప్రకటించింది. మంత్రివర్గ ప్రకటన తర్వాత ఇరిగేషన్ శాఖ సమావేశం జరిగింది. ఆ సమావేశం అనంతరం ఇరిగేషన్ చీఫ్ ఇంజనీరు కె. నరసింహామూర్తి మాట్లాడుతూ ఎల్ ని నో ప్రభావం వల్ల కృష్ణా పరివాహక ప్రాంతంలో వర్షాలు తగ్గాయని చెప్పారు. రాష్ట్రంలో 51%, కృష్ణా డెల్టాలో 49% లోటు వర్ష పాతం ఉందని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం తాగు నీటి కే ప్రాధాన్యత ఇచ్చిందని చెప్పారు. పులిచింతల నీటిని కూడా తాగు నీటి అవసరాలకే భద్రపర్చినట్లు వెల్లడించారు. గోదావరి ప్రవాహం తగ్గడంతో పట్టి సీమ ఎత్తి పోతల పంపింగ్ పై ప్రభావం పడిందని అన్నారు. సీలేరు నీటి లభ్యత కూడా తగ్గిందని చెప్పారు. అందువల్ల కృష్ణా డెల్టా సాగుకు అవసరమైన నీటి లభ్యత ప్రస్తుతం లేదని చావు కబురు చల్లగా చెప్పారు. ప్రకాశం బ్యారేజి నుంచి అనధికారికంగా



నీరు తీసుకోవద్దని రైతాంగానికి హెచ్చరిక జారీ చేశారు. కుడి కాల్వ పరిధిలో రైతులు వరి సాగు చేయవద్దని చెప్పారు. ఆరు తడి పంటలు సాగు చేయాలని పేర్కొన్నారు.

జూన్ జూలై నెలల మధ్య సాగు నీరు విడుదల విషయంలో కూటమి ప్రభుత్వ వైఖరిలో మార్పు వచ్చింది. జూన్ నెలలో రాష్ట్రం లోని అన్ని ప్రాంతాలకు సాగు నీరు విడుదల తేదీలను కూటమి మంత్రులు ప్రకటించారు. సాగుకి రైతులు సిద్ధం కావాలని చెప్పారు. మంత్రుల ప్రకటనతో అప్పులు చేసి సేద్యానికి కావాల్సిన వాటిని సమకూర్చుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే ఎకరాకు 10 వేలకు పైగా రైతులు సేద్యానికి ఖర్చు చేశారు.ఇలాంటి పరిస్థితుల్లో ఎల్ ని నో ప్రభావం వల్ల ఇప్పుడు సాగు నీరు ఇవ్వలేమని ప్రభుత్వం చెప్పడం వల్ల రైతాంగం తీవ్రమైన మనో వేదనకు గురౌతున్నారు. జూలై 1లో 461 టి ఎం సి ల నిల్వ ఉన్న నీరు జూలై 23 నాటికి ఏమైంది. సాగు నీరు ఇవ్వలేమని ప్రభుత్వం ఎలా చెప్పగలుగుతున్నది. ఎల్ ని నో ప్రభావం ముందుగానే కూటమి ప్రభుత్వానికి తెలుసుగా, తెలిసే సాగు నీరు ప్రాంతాల వారిగా విడుదల చేస్తామన్నది గదా! ఇప్పుడు సాగు నీరు విడుదల సాధ్యం కాదని చెప్పడం రైతులను మోసం చేయడం కాదా! సేద్యం పైనే చిన్న,సన్న కారు రైతు కుటుంబాల ఆధారపడి ఉన్న విషయం కూటమి ప్రభుత్వానికి తెలియదా, ఆ కుటుంబాల పరిస్థితి ఏమికావాలి.

సాగు నీరు విడుదల గురించి ప్రభుత్వం చెప్పే మాటలు వాస్తవ విరుద్దంగా ఉన్నాయి. జల వనరుల వ్యవస్థ తాజా గణాంకాల ప్రకారం ప్రకాశం బ్యారేజి నీటి నిల్వ 2.978 టి ఎం సి లు కాగా,పూర్తి నీటి మట్టం 3.071 టి ఎం సి లు. అంటే పూర్తి నీటి మట్టానికి అతి తక్కువ మాత్రమే. 96.97% నీటి నిల్వతో సురక్షితంగా ఉన్నందువల్ల సాగు నీటి సరఫరాకు ఎటువంటి ఆటంకం లేదని నిపుణులు చెబుతున్నారు. డెడ్ స్టోరేజికి చేరాలంటే 2 టి ఎం సి ల కంటే తక్కువ ఉండాలి. బ్యారేజి లో నీరు లేనప్పుడు సాగు నీరు ఇవ్వాల్సి వస్తే, నాగార్జున సాగర్ లేదా పులిచింతల నుంచి నీరు విడుదల చేయాలి. పులిచింతలలో ప్రస్తుతం 29.039 టి ఎం సి ల నీరు ఉంది. సాగు,తాగు నీటి అవసరాలకు నీటిని దిగువకు విడుదల చేయవచ్చని కూడా నిపుణులు అంటున్నారు. అంటున్నారు. మరి కూటమి ప్రభుత్వం సాగు నీరు ఎందుకు విడుదల చేయడం లేదు. గతంలో బ్యారేజి లో ఇంతకన్నా తక్కువ నీరు ఉన్నప్పుడే సాగు నీరు విడుదల చేయడం జరిగింది.

కృష్ణా డెల్టా లో ప్రధాన సేద్యం వరి. అలాంటి వరి సేద్యం చేయ వద్దంటే, రైతులు ఖరీఫ్ సేద్యానికి దూరం కావడమే గదా! ఆగస్టు నెల నాటికి పూర్తిగా సేద్యం జరగాలి.ఆ తర్వాత పంటలు వేసినా ప్రయోజనం లేదు. నల్ల రేగడి భూముల్లో ఇప్పుడు ఆరు తడి పంటల సాధ్యా సాధ్యాలను పరిగణన లోకి తీసుకోవాలి. ఆరు తడి పంటలకు మల్లడం కూడా రైతులకు చాలా ఇబ్బందికరం అవుతుంది. వరి సేద్యం జరగక పోతే ఆహార సమస్య కూడా ముందుకు వస్తుంది. రెండు కోస్తా తీర ప్రాంతాల్లోని చాలా జిల్లాల్లో వరి పంట తర్వాత జొన్న, మొక్క జొన్న పంట వేస్తారు. ఈ పంటలు రైతులకు కొంత మిగులు ఆదాయాన్ని ఇస్తున్నాయి. ప్రకాశం బ్యారేజి కుడి,ఎడమ కాల్వలకు సాగు నీరు విడుదల చేయక పోతే ఆ పంటల సేద్యం సాధ్యం కాదు. అందువల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది.

ఆరు తడి పంటలు వేయమనే కూటమి ప్రభుత్వ, అందుకు అవసరమైన వాటిని కూడా ముందు జాగ్రత్తగా సిద్ధం చేయలేదు. రైతులు వాటిని సమకూర్చుకోవాలంటే అనేక అవస్థలు పడాలి. అవస్థలు పడి ఆరు తడి పంట వేసినా చేతికి వస్తాయనే నమ్మకం లేదు. వరి పంట వల్ల మిగులు ఎక్కువ లేక పోయినా నష్టం అనేది తక్కువగా ఉండటంతో రైతాంగం వరి పంట సాగు కే మొగ్గు చూపుతున్నారు.

నేడు సాగు నీటి సమస్యకు పాలకుల విధానాలే కారణం. ఎల్ ని నో ప్రమాదం గురించి ముందుగానే సమాచారం ఉన్నప్పుడు నదుల నీటి నిల్వల గురించి సరైన చర్యలు తీసుకోవాలి. అలాంటి చర్యలు కూటమి ప్రభుత్వం తీసుకోలేదు. భారతదేశంలో అత్యధిక చెరువులు ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందు ఉంది. 2023లో కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 1,90,777 నీటి వనరులు ఉండగా,వాటిల్లో 99.7% గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. వీటిలో 81,703 చెరువులు పంచాయతీ మరియు ఇరిగేషన్ వంటి ప్రభుత్వ శాఖల పరిధిలో ఉన్నాయి. ఈ చెరువులు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకుని , పూడికలు తీసి నీటితో వాటిని నింపి ఉంటే ,వాటి ద్వారా సాగు నీరు లభించేది. చెరువులను కాపాడే చర్యలను ఏ ప్రభుత్వం తీసుకోలేదు.పట్టి సీమ ఎత్తిపోతల పంపింగ్ గురించి గొప్పలు చెప్పే కూటమి ప్రభుత్వం ముందుగానే కృష్ణా బ్యారేజికి నీరు పంపింగ్ ఎందుకు చేయలేదు. ఇప్పుడు పంపింగ్ చేయడం సాధ్యం కాదని ఎందుకు చేతులు ఎత్తింది. అవసరానికి ఉపయోగపడని పట్టి సీమ స్కీమ్ ప్రయోజనం ఏముంది. చెరువులను నీటితో నింపి , నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితుల్లో కూడా తాగు,సాగు నీరు సమస్య తీరేదిగదా! ఇది పాలకుల వైఫల్యం కాదా ! ప్రస్తుత పరిస్థితులను కూడా తన వ్యవసాయ విధానాలను అమలు జరపడం కోసం అన్న కూటమి ప్రభుత్వ విధానంగా ఉంది. వరి ధాన్యం ఎవరూ కొనరని, ఆ పంట మాని లాభదాయక పంటలు వేయాలని కొద్ది నెలల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పటం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటలకు న్యాయమైన మద్దతు ధరలు ప్రకటించకుండా సేద్యాన్ని నష్ట దాయకంగా మార్చి, సేద్యం నుంచి రైతులు సేద్యం నుంచి వైదొలిగేలా చేసి, ఆ రైతుల భూములు కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధానాలు అమలు చేస్తున్నాయి. నేటి సాగు నీటి విడుదల చేయక పోవడంలో కూడా ఈ ప్రమాదం దాగి ఉంది. రాష్ట్రంలో నెలకొన్న దుర్భిక్ష పరిస్థితుల వల్ల కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి.

రాష్ట్రం లోని 608 మండలాల్లో 250 మండలాలు తీవ్ర కరువు మండలాలుగా ఉన్నాయి. వీటిలోనూ 122 మండలాలు అత్యంత తీవ్ర కరువు మండలాలు. ఇలాంటి పరిస్థితుల్లో కరువును ఎదుర్కొనేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ప్రకాశం బ్యారేజి కుడి,ఎడమ కాల్వలకు వెంటనే సాగు నీరు విడుదల చేయాలి.కరువు మండలాల్లో గ్రామీణ ఉపాధి హామీ పనులను 250 రోజులకు పెంచి గ్రామీణ పేద కుటుంబాలకు పనులు కల్పించాలి. ఆ పనుల వేతనం పెంచాలి. రైతాంగానికి కావాల్సిన ఎరువులు, విత్తనాలను చిన్న, సన్న కారు రైతులకు ఉచితంగా ఇవ్వాలి. వారు తీసుకున్న పంట రుణాలు రద్దు చేయాలి. గ్రామ పంచాయితీలకు ఎరువులు సరఫరా చేసి మిగతా రైతులకు తక్కువ ధరలకు అందించాలి.రేషన్ దుకాణాలకు అన్ని రకాల నిత్యావసరాల సరుకులు సప్లయ్ చేసి చౌకగా ప్రజలకు ఇవ్వాలి.

వ్యవసాయ కూలీ కుటుంబాలకు ప్రతి నెల అవసరం మేరకు ఉచితంగా నిత్యావసర సరుకులు అందించాలి. తాగు నీటి సమస్య లేకుండా చూడాలి. ఈ డిమాండ్ల సాధన కోసం రైతాంగం , ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలి.



బొల్లిముంత
సాంబశివరావు



# జాతీయం - అంతర్జాతీయం



## ఆర్టికల్ 370 రద్దుపై కాశ్మీర్‌లో నిరసనలు

- **సీపీఐ (ఎం), ఎన్‌సీ, పీడీపీ సహా పలు పార్టీల ఆందోళనలు**
- **ఇది ఒక వ్యవస్థీకృత దాడి: ఎమ్మెల్యే తరిగామి**
- **మా ఆకాంక్షలను చెరిపేయలేరు: మెహబూబా ముఫ్తీ**

**శ్రీనగర్, ఆగస్టు 05 (ఎ.ఎం.ఎస్) :**
ఆర్టికల్ 370 రద్దు ఏడో వార్షికోత్సవాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. సీపీఐ(ఎం), పాలక నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి), పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ) సహా పలు పార్టీలు ఆందోళనలు చేపట్టాయి. 2019, ఆగస్టు 5న కేంద్రం జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని ఇచ్చే ఆర్టికల్ 370ని కేంద్రం ఏకపక్షంగా రద్దు చేసిన సంగతి తెలిసిందే. 2019 ఆగస్టు 5న జరిగిన ఘటన, కేంద్ర ప్రభుత్వం, జమ్మూకాశ్మీర్ల మధ్య ఉన్న సంబంధంపై జరిగిన ఒక వ్యవస్థీకృత దాడిగా సిపిఐ(ఎం) ఎమ్మెల్యే తరిగామి అభివర్ణించారు. ఏడేళ్లు గడిచినా, రాజకీయ కార్యకలాపాలు, ప్రజాస్వామ్యం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛపైన కఠినమైన ఆంక్షలు, అణచివేత చర్యలు కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు.

విచిత్రమైన పరిణామం ఏమిటంటే .. ఈ అణచివేతను బిజెపి ప్రభుత్వం తాము సాధించిన అత్యంత గొప్ప విజయాలలో ఒకటిగా ప్రచారం చేసుకుంటోందని మండిపడ్డారు. వ్యతిరేకతను వ్యక్తం చేసే అవకాశాన్ని, పత్రికా స్వేచ్ఛను అణచివేయడానికి ప్రభుత్వం ఇప్పటికీ కఠినమైన, బలవంతపు చర్యలు చేపడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్టికల్ 370 రద్దు ప్రకటనను గుర్తు చేసుకుంటూ జమ్మూకాశ్మీర్ ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. ఏడేళ్లయినా తాము మర్చిపోలేమని అన్నారు. ఇప్పటికీ పరిస్థితులను అంగీకరించలేని స్థితిలో ఉన్నామని అన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేసి కేంద్రం తమ హక్కులను, తమ గుర్తింపును లాక్కుందని మండిపడ్డారు. పలువురు ఎన్‌సి నేతలు కూడా ఆందోళనలు చేపట్టారు. శ్రీనగర్‌లోని పార్టీ ప్రధానకార్యాలయం ఎదుట సీనియర్ నేత సకీనా ఇటూ ఆందోళన చేపట్టారు.

ప్రత్యేక హోదాను పునరుద్ధరించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఆగస్టు 5వ తేదీ ఎప్పటికీ తమకు 'బ్లాక్ డే' అని మరో ఎన్‌సి ఎమ్మెల్యే అషన్ పరదేశి పేర్కొన్నారు. కాలం గడుస్తున్న కొద్దీ, తమ రోజులు గడుస్తున్నాయని, తమ డిమాండ్ ఇంకా బలంగా రూపుదిద్దుకుందని ఎన్‌సి మంత్రి జావేద్ రానా అన్నారు. ఆరోజులను ఎప్పటికీ మర్చిపోలేము, అంగీకరించనూ లేమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గౌరవం, ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగ హామీ, ప్రజల విశ్వాసాన్ని తిరిగి చట్టబద్ధంగా, శాంతియుతంగా పునరుద్ధరించాలని కోరుకుంటున్నామని అన్నారు.

తమ సందేశం స్పష్టమైందని పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ పేర్కొన్నారు. కృత్రిమంగా నెలకొల్పిన సాధారణ పరిస్థితులు, కల్పితంగా అల్లిన కథనాలు జమ్మూకాశ్మీర్ ప్రజల ఆకాంక్షలను చెరిపివేయలేవని అన్నారు. గౌరవం, న్యాయం, ఆర్టికల్ 370 పునరుద్ధరణ కోసం తమ డిమాండ్ ఎప్పటికీ బలంగా ఉంటుందని అన్నారు. పిడిపి పిలుపు మేరకు జిల్లాల వారీగా పలువురు నేతలు ఆందోళనలు చేపట్టారు. పలువురు పిడిపి నేతలపై గృహనిర్బంధం విధించారని పిడిపి పేర్కొంది. పోలీసు స్టేషన్‌లో నిర్బంధించిన, గృహనిర్బంధం విధించిన నేతల వీడియోను పిడిపి సోషల్‌మీడియాలో పోస్ట్ చేసింది.

## అమెరికా ఎత్తులకు ఇరాన్ పై ఎత్తులు

- **టెహ్రాన్ తాజా యుద్ధ వ్యూహం**
- **రాయితీల నుంచి ఒత్తిడి వైపు**
- **మారిన గల్ఫ్ దేశాల వైఖరి**

**బీరుట్, ఆగస్టు 05 :**
అమెరికాపై ఒత్తిడి పెంచడానికి మధ్యప్రాచ్యంలోని వాణిజ్య - సముద్ర మార్గాలు, ఇంధన మౌలిక సదుపాయాలను ఉపయోగించుకోవాలని ఇరాన్ భావిస్తోంది. యుద్ధ వ్యయాన్ని పెంచి అమెరికాను చికాకు పరచడం ద్వారా ఆ దేశంపై పైచేయి సాధించడం కూడా టెహ్రాన్ వ్యూహంలో భాగమేనని గల్ఫ్ అధికారులు, విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. నిర్ణయాత్మక సైనిక విజయం కోసం ప్రయత్నించకుండా...అంటే పూర్తి స్థాయి యుద్ధానికి దిగకుండా సంఘర్షణలను విస్తరించాలని, ఉద్రిక్తతలను పెంచాలని టెహ్రాన్ అనుకుంటోంది. హోర్ముజ్ జలసంధి విషయంలో తన డిమాండ్లకు తలవంచడం కంటే సంక్షోభాన్ని అదుపులో ఉంచడమే ఎక్కువ ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని అమెరికా, దాని మిత్రదేశాలకు అర్థమయ్యేలా చేయడం ఇరాన్ ఉద్దేశం.హోర్ముజ్‌లో తన పట్టును పెంచేందుకు అమెరికా అంగీకరించని పక్షంలో ప్రస్తుత సంఘర్షణ గల్ఫ్‌ను దాటి ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తుందని ఇరాన్ సంకేతాలు పంపుతోంది. అనేక సముద్ర కీలక మార్గాలను, ఇంధన ఆస్తులను ప్రమాదంలోకి నెట్టడం ద్వారా భవిష్యత్తులో జరిగే చర్చలలో తనదే పైచేయి అయ్యేలా చూసుకోవాలని టెహ్రాన్ భావిస్తోంది. ఇరాన్



మొదటి నుంచి ఉద్రిక్తతలను పెంచేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నదని, ప్రతి వారం ఓ కొత్త భౌగోళిక ప్రాంతాన్ని, ఓ కొత్త ఆయుధాన్ని, ఓ కొత్త లక్ష్యాన్ని ముందుకు తీసుకొస్తోందని వాషింగ్టన్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన మైఖేల్ నైట్స్ వ్యాఖ్యానించారు.

అమెరికా, ఇజ్రాయిల్ దేశాలను మాత్రమే దెబ్బతీస్తే వారికి పెద్దగా ఒరిగేదేమీ ఉండదని, ప్రాంతీయ దేశాలను, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తేనే వారికి ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని ఆయన చెప్పారు.ప్రపంచ చమురు రవాణాలో దాదాపు ఐదో వంతు వాటాను కలిగిన హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలను అడ్డుకొని తన సామర్థ్యాన్ని నిరూపిం చుకున్న ఇరాన్...ఏ కీలక సముద్ర మార్గం తనకు అతీతం కాదని నిరూపించింది. ఎర్ర సముద్రానికి, సౌదీ ఇంధన మౌలిక సాదుపాయాలకు ఇప్పటికే ముప్పు పొంచి ఉంది. సంఘర్షణలను విస్తృతం చేసి, ఒత్తిడి పెంచితే ట్రంప్ చివరికి లొంగిపోక తప్పదని ఇరాన్ గట్టిగా నమ్ముతోంది. ఇరాన్‌ను దెబ్బతీసి, చర్చల వేదిక వద్దకు రప్పించాలని ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఇరాన్‌తో సోమవారం చర్చలు మొదలవుతాయని ట్రంప్ చెప్పగా అలాంటిదేమీ లేదని టెహ్రాన్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. గతంలో అమెరికా నుంచి అధిక రాయితీలు రాబట్టాలని ఇరాన్ చేసిన ప్రయత్నాలు పెద్దగా ఫలితాన్ని ఇవ్వలేదు. దీంతో ఇక ఒత్తిడి ద్వారానే కార్యాన్ని చక్కబెట్టుకోవాలని అది నిర్ణయానికి వచ్చింది.దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని, సైనిక దాడులను నిలిపివేయాలని అమెరికాపై ఇరాన్ ఒత్తిడి తెస్తోంది. జరగబోయే పరిణామాలను అమెరికా నిర్దేశించడం దానికి సుతరామూ ఇష్టం లేదు. వివాదానికి కేంద్ర బిందువైన హోర్ముజ్‌పై ఒమన్‌తో ఇరాన్ చర్చలు జరిపింది. జలమార్గం నిర్వహణ కోసం స్వచ్ఛంద వినియోగ రుసు మును వసూలు చేయడంతో పాటు గల్ఫ్ దేశాల మద్దతు ఉన్న ఓ ప్రతిపాదనను ఒమన్‌కు అందజేసింది. ఇరాన్‌ను నేరుగా ఎదుర్కోవడంకంటే వాణిజ్యనౌకలకు రక్షణ కల్పించడం, నిఘా సమాచారాన్ని పంచుకోవడం, సముద్ర మార్గాలను కాపాడుకోవడంపై గల్ఫ్ దేశాలు దృష్టి సారిస్తున్నాయి. ఇందుకోసం సౌదీ నేతృత్వంలో ఓ సముద్ర కూటమి ఏర్పడింది. ఈ పరిణామం ఇరాన్‌కు ఓ రకంగా విజయమేనని చెప్పాలి. అమెరికా సైన్యాన్ని నేరుగా ఎదుర్కోలేకపోయినా ప్రభుత్వాలను, నౌకాదళా లను రక్షణాత్మక స్థితిలోకి నెట్టడం ద్వారా ఇరాన్ వాటికి నష్టాలను కలిగించగలదు.

## మహిళా రిజర్వేషన్లపై జాప్యం వద్దు

- **వాటిని తక్షణమే అమలు చేయాలి**
- **ఎన్‌సీడబ్ల్యూఆర్ ఆధ్వర్యంలో 12వ రోజుకు ఆందోళన**
- **సీపీఐ(ఎం) ఎంపీ అమ్రారామ్, బృందాకరత్ సంఘీభావం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 05 (ఎ.ఎం.ఎస్):**
మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలులో జాప్యం వద్దని సీపీఐ(ఎం) ఎంపీ అమ్రారామ్ డిమాండ్ చేశారు. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 'నేషనల్ కోయిలిషన్ ఫర్ ఉమెన్స్ రిజర్వేషన్స్ (ఎన్‌సీడబ్ల్యూ ఆర్) ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ఆందోళన 12వ రోజు కొనసాగింది. మంగళవారం ఢిల్లీ నుంచే కాకుండా రాజస్థాన్ నుంచి కూడా పెద్ద సంఖ్యలో మహిళలు తమ సంప్రదాయ రంగుల దుస్తులను ధరించి ఆందోళనలో పాల్గొన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని కోరుతూ పాటలు కూడా ఆలపించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ఎంపీ అమ్రారామ్ సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయ ప్రాతినిధ్యం విషయంలో మహిళలకు ఉన్న రాజ్యాంగపరమైన హక్కును సాధించేందుకు సీపీఐ(ఎం) పార్లమెంటు లోనూ, బయటా నిరంతరం పోరాడుతోందని అన్నారు. జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) వంటి షరతులతో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని వెంటనే అమలు చేయాలని ఆయన పునరుద్ఘా టించారు. పార్లమెంటులో ఈ డిమాండ్‌ను బలంగా లేవనెత్తామని, ఈ అంశంపై దేశంలోని మహిళలకు బీజేపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలును వాయిదా వేయడానికి విధించిన షరతులు అన్యాయమైనవనీ, వివక్షతో కూడినవని రాజ్యసభ మాజీ సభ్యురాలు బృందా కరత్ తెలిపారు. దేశ జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలకు సమాన రాజకీయ ప్రాతినిధ్యాన్ని నిరాకరించడం ప్రజాస్వామ్య సూత్రాలకు ద్రోహం చేయడమేనని, ప్రభుత్వం ఎటువంటి జాప్యం లేకుండా 33 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని పేర్కొన్నారు. సమానత్వం, న్యాయం వంటి రాజ్యాంగ విలువలను కాపాడటానికి మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచడం అత్యవసరమని ఎన్‌ఎఫ్ ఐడబ్ల్యు అధ్యక్షురాలు సయ్యదా హమీద్ అన్నారు. మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలన్న డిమాండ్‌ను ఆమె పునరుద్ఘాటించారు. జీవితంలోని ప్రతి రంగంలోనూ మహిళలు తమ బాధ్యతను నిరూపించుకున్నప్పటికీ, రాజకీయ ప్రాతినిధ్యం మాత్రం అత్యంత తక్కువగా ఉందని ఐద్వా ఉపాధ్యక్షురాలు, మాజీ ఎంపీసుభాషిణి




అలీ సెహగల్ అన్నారు. పార్లమెంటు,రాష్ట్ర శాసనసభలలో మహిళలకు అధిక ప్రాతినిధ్యం లభిస్తే భారత ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని ఆమె పేర్కొన్నారు. క్రీడలు, విద్య, విజ్ఞానశాస్త్రం, వ్యవసాయం, కార్మిక రంగాలలో మహిళలు అద్భుతమైన కృషి చేశారని, నిర్ణయాలు తీసుకునే అన్ని వేదికలలో వారికి సమాన భాగస్వామ్యం దక్కాలని ఐద్వా ఉపాధ్యక్షురాలు, అంతర్జాతీయ క్రీడాకారిణి జగ్మతి సాంగ్వాన్ అన్నారు.
విధాన రూపకల్పనలో దేశవ్యాప్తంగా ఉన్న మహిళల, ముఖ్యంగా గ్రామీణ, శ్రామిక మహిళల గళానికి అర్థవంతమైన ప్రాతినిధ్యం లభించేలా మహిళా రిజర్వేషన్ల అమలు దోహదపడుతుందని ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి నిషా సిధు పేర్కొన్నారు. ఐద్వా రాజస్థాన్ రాష్ట్ర కార్యదర్శి సీమా జైన్ కూడా ప్రసంగించారు. ఈ ఆందోళనలో ఐద్వా జాతీయ అధ్యక్షురాలు, మాజీ ఎంపీ పి.కె. శ్రీమతి, ప్రధాన కార్యదర్శి కనినిక ఘోష్, కార్యదర్శి ఆశా శర్మ, సవిత, మంజీత్ రాఠీ, సర్బాని సర్కార్, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ నేత దీప్తి, ఏఐపీడబ్ల్యూఎ జాతీయ కార్యదర్శి శ్వేత రాజ్, 'టుగెదర్ ఫర్ ట్రాంక్విలిటీ'కి చెందిన భావనా శర్మతో పాటు వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎర్రసముద్రంలో భారత నౌకపై దాడి

- **14 మందిని రక్షించిన కోస్ట్ గార్డ్స్**

**యెమెన్, ఆగస్టు 05 :**
యెమెన్ తీరానికి సమీపంలోని ఎర్ర సముద్రంలో ప్రయాణిస్తున్న భారత వాణిజ్య నౌకపై దాడి జరిగింది. ఈ ఘటనలో నౌక పూర్తిగా మునిగిపోయిందని, అయితే అందులోని 13 మంది భారతీయ సిబ్బంది సహా మొత్తం 14 మంది సురక్షితంగా బయటపడ్డారని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ తెలిపారు. 'ఎంఎస్‌వి పైజె నూరే ఓలియా' అనే భారత జెండాతో ఉన్న నౌకపై ఆగస్టు 4న ప్రొజెక్టైల్ (క్షిపణి లాంటిది)తో దాడి జరిగింది. దీంతో నౌక బోల్తా పడి సముద్రంలో మునిగిపోయింది. వెంటనే స్పందించిన యెమెన్ కోస్ట్ గార్డ్, సిబ్బంది అందరినీ రక్షించి సమీపంలోని మోఖా పోర్టుకు తరలించారు.ఈ ఘటనపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. "నిరాయుధులైన



సిబ్బంది ఉన్న నౌకపై జరిగిన ఈ అకారణ దాడిని భారత్ తీవ్రంగా ఖండిస్తోంది. మన ప్రజల భద్రతే మాకు అత్యంత ముఖ్యం. సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని తెలియజేయడం ఊరటనిస్తోంది" అని మంత్రి సోనోవాల్ పేర్కొన్నారు. సిబ్బంది సంక్షేమం, భద్రత కోసం అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు.

## ఆ సుంకాలు అక్రమమైనవి

- **వాటిని అమలు చేయొద్దు**
- **చట్టవిరుద్ధమని ప్రకటించాలి**
- **ట్రంప్‌పై కోర్టులో అమెరికా రాష్ట్రాల వ్యాజ్యం**

**వాషింగ్టన్, ఆగస్టు 05 :**
భారత్ సహా 60 వాణిజ్య భాగస్వామ్య దేశాల నుంచి దిగుమతి అవుతున్న వస్తువులపై 10 నుంచి 12.5 శాతం వరకూ కొత్తగా సుంకాలు విధించాలని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అమెరికాలోని ఇరవై ఐదు రాష్ట్రాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. ఈ సుంకాలు అక్రమమైనవని, ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు కొట్టివేసిన దిగుమతి పన్నుల స్థానంలో ట్రంప్ ప్రభుత్వం వీటిని తీసుకొచ్చే ప్రయత్నం చేసిందని ఆరోపించాయి. సుంకాల విధింపును కొట్టివేయాలని, వాటిని చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించి ఇప్పటికే వసూలు చేసిన సొమ్మును తిరిగి వాపసు చేసేలా చూడాలని యూఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్‌లో దాఖలు చేసిన వ్యాజ్యంలో ఆ రాష్ట్రాలు అభ్యర్థించాయి. 59 రాష్ట్రాలు, యూరోపియన్ యూనియన్‌పై గత నెలలో విధించిన సుంకాలు అమెరికా దిగుమతు లలో 99.4 శాతం వాటాను కలిగి ఉన్నాయని రాష్ట్రాలు వాదించాయి. కార్మికులతో బలవంతంగా పనులు చేయించి తయారు చేసిన వస్తువుల దిగుమతులను ఆపాలని కోరినప్పటికీ ఆయా



దేశాలు పట్టించుకోలేదని ట్రంప్ ప్రభుత్వం చెబుతోంది. 'సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ తగిలిన తర్వాత ట్రంప్ ప్రభుత్వం కుటుంబాలు, వ్యాపారాలపై కొత్త టారిఫ్‌లతో భారం మోపాలని మరోసారి ప్రయత్నిస్తోంది' అని న్యూయార్క్ అటార్నీ జనరల్ లెతితియా జేమ్స్ ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వం తన చర్యను ఏ విధంగా సమర్థించుకుంటున్నప్పటికీ తాను కోరుకున్న దేశాలపై అధిక సుంకాలు విధించేందుకు దేశాధ్యక్షుడికి అధికారం లేదని అమెరికా చట్టం, రాజ్యాంగం స్పష్టం చేస్తున్నాయని ఆయన అన్నారు. ట్రంప్ ప్రభుత్వ ప్రయత్నాలకు వ్యతిరేకంగా న్యాయస్థానంలో వ్యాజ్యం వేసిన రాష్ట్రాలలో న్యూయార్క్, కాలిఫోర్నియా, ఇల్లినాయిస్, మాసాచూసెట్స్, వాషింగ్టన్, విల్కాన్సిస్ సహా 18 రాష్ట్రాలు, కెంటుకీ, పెన్సిల్వేనియా గవర్నర్లు ఉన్నారు. విముక్తి దినోత్సవం సందర్భంగా ట్రంప్ ప్రభుత్వం విధించిన సుంకాలను రాజ్యాంగ విరుద్ధమైనవిగా న్యాయస్థానం గతంలో తీర్పు ఇవ్వడంతో 1974వ సంవత్సరపు వాణిజ్య చట్టంలోని సెక్షన్ 301 కింద కొత్తగా ముందుకు తెచ్చిన టారిఫ్‌లు గత నెల నుంచే అమలులోకి వచ్చాయి. ఈ కొత్త సుంకాల కారణంగా ప్రధాన వాణిజ్య భాగస్వాములైన కెనడా, జపాన్, నార్వే, తైవాన్, చైనాలపై బాగా ప్రభావం పడుతుంది. కాగా ట్రంప్ తన కార్యనిర్వాహక అధికారాన్ని అతిక్రమించారంటూ రెండు చిన్న వ్యాపార సంస్థల తరఫున లిబర్టీ జస్టిస్ సెంటర్ కూడా విడిగా వ్యాజ్యాన్ని వేసింది. బలవంతంగా పనులు చేయిస్తున్నారన్న పేరుతో ప్రభుత్వం సుంకాలను భారీగా పెంచిందని, ఇది వినియోగదారులపై అధిక ఆర్థిక భారాన్ని మోపిందని న్యూయార్క్ గవర్నర్ కాథీ హోచల్ విమర్శించారు.



## ఒప్పందానికి ఇరాన్‌పై ఒత్తిడి తెద్దాం

- **అమెరికా సెంట్రల్ కమాండ్ విజ్ఞప్తి**

**వాషింగ్టన్, ఆగస్టు 05 :**
ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చి దానిని శిక్షించేందుకు సృజనాత్మకమైన, సంప్రదాయేతర కొత్త మార్గాలను సూచించాలని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) సైనిక విశ్లేషకులను కోరింది. ఈ మేరకు సెంట్‌కామ్ ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన అధికారి ఒకరు సైనిక విశ్లేషకులకు ఈ - మెయిల్స్ పంపారని సీఎన్‌ఎన్ వార్తా సంస్థ తెలియజేసింది. ఈ - మెయిల్ ద్వారా క్రౌడ్‌సోర్సింగ్ తరహాలో ప్రశ్నలు వేయడం ఓ అసాధారణ చర్య అని అధికారులు వ్యాఖ్యానించారు. ఒప్పందం కుదుర్చుకునేలా ఇరాన్‌పై ఒత్తిడి తేవడానికి ట్రంప్‌కు పరిమితమైన అవకాశాలు మాత్రమే మిగిలి ఉన్నాయని చెప్పడానికి ఇది ఒక సూచిక అని చెప్పారు. సెంట్రల్ కమాండ్ అన్ని విషయాలనూ పరిశీలిస్తోందని, వ్యూహాన్ని పున్ణపరిశీలించాల్సిన అవసరం ఉన్నదని అది అంగీకరిస్తోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.వినూత్న మార్గాలలో ఆలోచించడం, పనిచేయడంలో సెంట్రల్ కమాండ్‌కు సుదీర్ఘ చరిత్ర ఉన్నదని సెంట్‌కామ్ ప్రతినిధి కెప్టెన్ తిమోతి హాకిన్స్ చెప్పారు. సాధ్యమైనంత వరకూ అత్యున్నత స్థాయి కార్యాచరణ పనితీరును కనబరచడం కోసం బృందంలోని సభ్యులను వారి హోదాలతో సంబంధం లేకుండా సంప్రదిస్తామని ఆయన తెలిపారు.

## వాడివేడిగా పార్లమెంటు సమావేశాలు

- **విద్యార్థులపై లాఠీచార్జికి ప్రతిపక్షాల నిరసన**
- **అయోధ్య విరాళాలపై సమగ్ర చర్చకు పట్టు**
- **ఆందోళనల మధ్యే పలు బిల్లుల ఆమోదం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 05 (ఎ.ఎం.ఎస్):**
వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు మూడోవారంలోనూ వాడీవేడీగా సాగుతున్నాయి. పది రోజుల క్రితం జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల ఆందోళనలపై లాఠీ చార్జీ ను నిరసిస్తూ ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. అయోధ్య రామమందిర్ విరాళాల చోరీపై సమగ్ర చర్చ జరగాలని, పారదర్శక దర్యాప్తు నిర్వహించాలని మోడీ ప్రభుత్వాన్ని విపక్ష సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ప్రతిపక్షాల ఆందోళన నేపథ్యంలోనే కేంద్రం పలు బిల్లులను ఆమోదించింది. తాజాగా గత పార్లమెంట్ సమావేశాల్లో వీగిపోయిన డీలిమిటేషన్ బిల్లును ప్రస్తుత సమావేశాల్లో ప్రవేశపెట్టాలని మోడీ ప్రభుత్వం పావులు కదుపుతోంది. అందుకు పార్లమెంట్ వ్యవహారాల మంత్రి





కిరణ్ రిజిజును రంగంలోకి దింపింది. దీనిలో భాగంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో ఆయన భేటీ అయ్యారు. ప్రభుత్వం ప్రతిపాదించే డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు తెలపాలని కోరినట్లు సమాచారం. అయితే రిజిజు ప్రతిపాదను రాహుల్ గాంధీ తిరస్కరించనట్లు జాతీయ మీడియాలు పేర్కొన్నాయి. ఉభయ సభల్లో అయోధ్య రామ్ మందిర్ విరాళాల చోరీపై చర్చ జరగాలని, అలాగే రాజధానిలో జూలై 20న జరిగిన నిరసన సందర్భంగా విద్యార్థులపై పోలీసులు తీసుకున్న చర్యల గురించి.. హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేసేంత వరకు సభలో ఎటువంటి కార్యకలాపాలు జరగవని ప్రతిపక్ష నాయకుడు కిరణ్ రిజిజుకు చెప్పారని సంబంధిత వర్గాలు తెలిపాయి. కాగా, గత పార్లమెంట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు డీలిమిటేషన్ బిల్లును మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ చర్యను ప్రతిపక్షాలు ముక్తకంఠంతో వ్యతిరేకించాయి. డీలిమిటేషన్ బిల్లును వేరుగా ప్రవేశపెట్టాలని, సదురు బిల్లుపై రాష్ట్రాలకు పలు సందేహాలున్నాయి తెలియజేశాయి. అయినా కానీ మోడీ ప్రభుత్వం మొండిగా ముందుకుకెళ్లడంతో లోక్ సభలో సదురు బిల్లు వీగిపోయింది.

## నా అరెస్టు.. 'దృష్టిమళ్లించే వ్యూహం'

- **సీఎం విజయ్‌పై.. ఉదయనిధి స్టాలిన్ ఆగ్రహం**
- **తమిళనాడులో రాజకీయ వేడి**

**చెన్నై, ఆగస్టు 05 (ఎ.ఎం.ఎస్):**
తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌పై అసెంబ్లీ ప్రతిపక్ష నేత ఉదయనిధి



స్టాలిన్ విరుచుకుపడ్డారు. తన అరెస్టు 'దృష్టిమళ్లించే వ్యూహం' అని మండిపడ్డారు. బుధవారం విజయ్ ప్రభుత్వం అసెంబ్లీలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అనంతరం ఉదయనిధి స్టాలిన్ మీడియాతో మాట్లాడారు. కావేరీ, మెకదాటు అంశాలను లేవనెత్తకుండా అడ్డుకునేందుకు విజయ్ ప్రభుత్వం యత్నించిందని మండిపడ్డారు. ఈ రెండు అంశాలపై ప్రభుత్వ వైఫల్యాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం తాను ఆందోళన చేపట్టానని, దీంతో తనను అరెస్టు చేశారని అన్నారు. అన్నాడిఎంకె ఎమ్మెల్యేలను, డిఎంకెకి చెందిన జన్ జెడ్ కార్యకర్తలను కూడా లక్ష్యంగా చేసుకుందని అన్నారు. టివికె నేతృత్వంలోని తమిళనాడులో పలు అంశాలు, సమస్యలు ఉన్నాయని, వీటి నుండి ప్రజల దృష్టి మళ్లించేందుకు తనను అరెస్టు చేయించారని అన్నారు. శాంతి భద్రతలు క్షీణించాయని, గడిచిన ఐదు వారాల్లో రాష్ట్రంలో ఐదు లాకప్ డెత్ కేసులు, ఆరు కుల ఆధారిత హత్యలు జరిగాయని అన్నారు. మధ్యంతర బడ్జెట్‌పై మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను నెరవేర్చేందుకు బడ్జెట్‌లో ఒక్క పథకాన్ని కూడా ప్రవేశపెట్టలేదని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ల్యాప్‌టాప్ సహా పలు పథకాలకు, పేర్లు మార్చారని దుయ్యబట్టారు. పలు రంగాల్లో తమిళనాడు మొదటి స్థానంలో ఉందని గుర్తించినందుకు ఆర్థికమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.

## కేంద్రానికి జుకర్ బర్గ్ క్షమాపణ

- **డీప్ ఫేక్‌లపై తీవ్ర విచారం**
- **'జెన్-జీ అవుట్‌రీచ్' వీడియోను తొలగించామని వెల్లడి**

**న్యూఢిల్లీ, ఆగస్టు 05 (ఎ.ఎం.ఎస్):**
భారత్ ప్రభుత్వానికి మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లో బాలల లైంగిక వేధింపుల సామగ్రి, డీప్‌ఫేక్‌లు, అల్గారిథమిక్ పాలనలో జరిగిన తీవ్రమైన లోపాలపై జుకర్‌బర్గ్ అధికారికంగా క్షమాపణలు చెప్పి.. విచారం వ్యక్తం చేశారు. కొన్ని రకాల కంటెంట్‌ను ప్రోత్సహించడానికి భారీ మొత్తంలో చెల్లింపులు జరిగాయని ఆ సంస్థ అంగీకరించింది. ఇటీవల ప్రధాని మోడీ యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. అయితే 'జెన్‌జీ అవుట్‌రీచ్' వీడియోను మెటా తొలగించింది. అయితే సాంకేతిక కారణాలతో డిలీట్ అయిందని వివరణ ఇచ్చింది. అయితే మెటా వివరణపై పార్లమెంటరీ ఐటీ స్థాయీ సంఘం అసంతృప్తి వ్యక్తం చేసింది. మూడు రోజుల్లో క్షమాపణ



చెప్పక పోతే.. మెటాకు చట్టపరమైన రక్షణను తొలగించే అంశాన్ని పరిశీలిస్తామని కమిటీ హెచ్చరించినట్లు సమాచారం. కేంద్ర హెచ్చరికల నేపథ్యంలో మొత్తానికి మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ దిగొచ్చి కేంద్రానికి క్షమాపణ చెప్పారు. ఇదిలా ఉంటే ప్రత్యేకంగా ప్రధాని మోడీకి క్షమాపణ చెప్పినట్లుగా కనిపించలేదు.

## యూపీఐపై ఆర్బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు

- **మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధిస్తామంటూ వెల్లడి**

**న్యూఢిల్లీ, ఆగస్టు 05 (ఎ.ఎం.ఎస్):**
యూపీఐ లావాదేవీలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం యూపీఐ సేవలను ప్రభుత్వం సబ్సిడీల ద్వారా ప్రోత్సహిస్తోందని, అందువల్ల వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు లేకుండా సేవలు అందుతున్నాయని సంజయ్ మల్హోత్రా తెలిపారు. అయితే, డిజిటల్ చెల్లింపుల మౌలిక వసతులు, సాంకేతిక నిర్వ



హణ, భద్రత వంటి అంశాలకు ఖర్చు అవుతుందని తెలిపారు. ఆ ఖర్చును ఎవరో ఒకరు భరించాల్సి ఉంటుందని అన్నారు.
wకాగా, ఇప్పటికే పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టంలో మార్పులు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. వ్యాపార సంస్థలు స్వీకరించే కొన్ని యూపీఐ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధించాలని భావిస్తోంది. అయితే తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదు .
\రూ.2 వేల కంటే ఎక్కువ విలువైన వ్యాపార లావాదేవీలపై మాత్రమే స్వల్ప ఎమ్‌డీఆర్ విధించే అవకాశం ఉందని తెలుస్తోంది. వ్యక్తుల మధ్య జరిగే సాధారణ యూపీఐ నగదు బదిలీలపై ఎలాంటి ప్రభావమూ ఉండదని సంబంధిత వర్గాల సమాచారం.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఈవీఎం గోదాం నెలవారి తనిఖీ: కలెక్టర్



**ములుగు, ఆగస్టు 05 (వుదయం ప్రతినిధి) :**

ఈవీఎం గోదాం ను జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు నెలవారి తనిఖీ నిర్వహించారు.బుధవారం జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారి తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భం లో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్ లు సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయం లో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు ప్రతి నెల గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా 24 గంటలు భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గోదాంలోని భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం.డి. సలీం, డిప్యూటీ తహసీల్దార్ నితీష్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పంట కుంటల ఏర్పాటుతో జల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

**నిర్దేశిత లక్ష్యాన్ని తప్పకుండా సాధించాలి**

**జిల్లా స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి**



**హనుమకొండ, ఆగస్టు 05 (వుదయం ప్రతినిధి) :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'జలసిరి' కార్యక్రమంలో భాగంగా పంట కుంటల (ఫామ్ పాండ్స్) ఏర్పాటులో నిర్దేశించిన లక్ష్యాన్ని తప్పకుండా సాధించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శేషాద్రి సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎంపీడీవోలు, ఎంపీఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జలసిరి గ్రామ అభివృద్ధి ప్రణాళిక అమలుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. పంట కుంటల ఏర్పాటు వల్ల వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెరుగుదల, సాగునీటి లభ్యత వంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. ఈ అంశాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించి, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పంట కుంటల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే పంట కుంటలు ఏర్పాటు చేసి ప్రయోజనాలు పొందుతున్న ప్రాంతాలకు రైతులను తీసుకెళ్లి ప్రత్యక్షంగా వాటి ఉపయోగాలను వివరించాలని అధికారులకు సూచించారు. దీనివల్ల రైతుల్లో అవగాహన పెరిగి పంట కుంటల ఏర్పాటుకు మరింత ప్రోత్సాహం లభిస్తుందన్నారు. గ్రామ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో అన్ని అనుబంధ శాఖల అధికారులతో సమన్వయం సాధించి, గ్రామ సభల ద్వారా త్వరితగతిన సమగ్ర గ్రామ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

శాస్త్రీయ ప్రణాళికతో గ్రామాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే గ్రామీణాభివృద్ధికి బాటలు పడతాయని పేర్కొన్నారు.జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించేందుకు జల సంరక్షణ చర్యలు అత్యంత అవసరమని అన్నారు. పంట కుంటలు, ఊర కుంటలు, ఇంకుడు గుంతలు వంటి నీటి సంరక్షణ నిర్మాణాలను విస్తృతంగా ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకొని భవిష్యత్ అవసరాలకు వినియోగించుకోవచ్చని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ఎల్. రమాకాంత్, ఎంపీడీవోలు, ఎంపీఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నాం..కలెక్టర్



**ఖమ్మం, వుదయం బ్యూరో ఆగస్టు 5:**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘంమార్గదర్శకాల మేరకు పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 86.98 శాతం ఓటర్ల వివరాలు డిజిటలైజ్ అయ్యాయని, పోలింగ్ స్టేషన్ వారీగా డిజిటలైజేషన్ నివేదికను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేస్తామని చెప్పారు. ప్రత్యేక పరిశీలనలో జిల్లాలో 95,740 మంది ఓటర్లు శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారినట్లు, 33,134 మంది మరణించినట్లు గుర్తించామని తెలిపారు. 42,814 మంది ఓటర్లు మ్యాపింగ్ పూర్తి కాలేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్.ఐ.ఆర్. కార్యక్రమానికి భారత ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసిందని తెలిపారు. ఆగస్టు 10, 2026 నాటికి ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌తో పాటు పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఖమ్మం జిల్లాలో 19 కొత్త పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించనున్నట్లు తెలిపారు. కొత్త పోలింగ్ స్టేషన్లను వీలైనంత వరకు ప్రభుత్వ భవనాల్లోనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని, సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరిస్తామని, వాటిని అక్టోబర్ 15 నాటికి పరిష్కరించి, అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్‌డీసీ సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు ఏ.గోపాల రావు, జి.సూర్య నారాయణ, బీ.ఆర్.ఎస్. ప్రతినిధులు ఎం.రమేష్, బి వేణుగోపాల్, సిపిఎం డి.తిరుపతి రావు, బీజేపీ ప్రతినిధి వి.రాజేష్, టీడీపీ ప్రతినిధి కృష్ణప్రసాద్, ఆప్, ఇతర రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అవసరమైన సేవలు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**చిట్యాల, 05 ఆగస్టు (వుదయం ప్రతినిధి)**

ప్రజలకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుఅన్నారు బుధవారం చిట్యాల మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వ్యవసాయ శాఖ, ఆరోగ్య శాఖ,పశుసంవర్ధక శాఖ, మిషన్ భగీరథ,ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్,విద్య, విద్యుత్, మహిళా శిశు సంక్షేమ శాఖ, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ, బీసీ సంక్షేమ శాఖ, ఎస్సీ సంక్షేమ శాఖ తదితర శాఖలకు సంబంధించిన అంశాలపై అధికారులతో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించారు సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా,వాటిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను వెంటనే చర్యలు తీసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు.ప్రజలకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.ముఖ్యంగా విద్య, వైద్యం వంటి కీలక అంశాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా చర్యలు చేపట్టాలని, గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు మరియు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.ప్రజల సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధి, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలే లక్ష్యంగా ప్రతి శాఖ అధికారి పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి , సంబంధిత అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్



**సూర్యాపేట ఆగస్టు 5:**

ప్రత్యేక సవరణ (SIR) కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలని, ఇందులో అన్ని రాజకీయ పార్టీ నాయకులు ముఖ్యపాత్ర పోషించాలని అదనపు కలెక్టర్ హరిసింగ్ అన్నారు. బుధవారం తుంగతుర్తి మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ బి హరిసింగ్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఇచ్చిన గడువును సద్వినియోగం చేసుకొని వంద శాతం పూర్తి చేయుటకు పార్టీ నాయకులు సహకరించాలని అన్నారు. ఈ సమీక్ష సమా వేశంలో తుంగతుర్తి తాసిల్దార్ దయా నందం బీజేపీ నుండి యాదగిరి, బి ఆర్ ఎస్ నుండి తాటికొండ సీతయ్య, రాములు, సిపియం నుండి బుర్ర శ్రీనివాస్, పల్లా సుదర్శన్, తుంగతుర్తి నియోజక వర్గంలోని తాసిల్దార్లు పాల్గొన్నారు.

## పంటల వైవిధ్యీకరణతోనే రైతులకు అధిక రాబడి – కలెక్టర్

**నీర్మాలలో మునగ, మల్బరీ, ఆయిల్ పామ్ తోటల పరిశీలన**

**ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ,**

**విద్యా ప్రమాణాల పరిశీలన**



**జనగామ, ఆగస్టు 05 వుదయం ప్రతినిధి):**

భూగర్భ జలాల పరిరక్షణ, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని రైతులు వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో అధిక లాభాలనిచ్చే పంటలను సాగు చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. బుధవారం దేవరుప్పుల మండలం నీర్మాల గ్రామంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు.ముందుగా గ్రామానికి చెందిన ప్రగతిశీల రైతు నరేందర్ రెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి మల్బరీ, పట్టుపురుగుల పెంపకం, ఆయిల్ పామ్, మునగ పంటలను పరిశీలించారు. డ్రిప్ ఇరిగేషన్, నాటు పద్ధతులు, మార్కెటింగ్ అవకాశాలపై రైతుతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు నీటి లభ్యతను బట్టి పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని, నువ్వులు, కందులు, పెసర్లు, మినుములు, ఆముదం వంటి ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యమివ్వాలని పిలుపునిచ్చారు.అనంతరం నీర్మాల ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని 2వ తరగతి విద్యార్థులకు ఉచిత ఏకరూప దుస్తులను (యూనిఫామ్స్) పంపిణీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించి వారి చదువు, గణిత నైపుణ్యాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పరిశుభ్రత, చిన్నారుల పోషకాహార పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు.ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని, ఎంఏఓ మనోహిత్, ఏఈఓ సాయి కిరణ్, గ్రామ సర్పంచ్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్య మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి:కలెక్టర్



**యాదాద్రి భువనగిరి జిల్లా, తేది: 05.08.2026**

ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. బుధవారం రాజాపేట మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల మరియు కళాశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. గతంలో పర్యటన సందర్భంగా వచ్చినప్పుడు సూచించిన పెండింగ్ పనుల పురోగతిని పరిశీలించారు. హాస్టల్‌లో కిటికీల మరమ్మతులు, డోర్ల ఫిట్టింగ్, మెష్ అమరిక, గదుల్లో వర్షపు నీటి లీకేజీల నివారణ కోసం పైకప్పు ఫ్లాస్టింగ్ పనులను పరిశీలించి, ఇంకా మిగిలిన ఉన్న పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హాస్టల్‌లోని కొన్ని టాయిలెట్లు బ్లాక్ అయి వినియోగానికి అనుకూలంగా లేవని గుర్తించి, సంబంధిత ఎస్.ఈ. వెంటనే మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం అందించాల్సిన గుడ్లు,చికెన్ వంటి ఆహార పదార్థాలు క్రమం తప్పకుండా అందడం లేదని విద్యార్థులు తెలియజేయడంతో కలెక్టర్ వెంటనే సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఒప్పందం ప్రకారం సరఫరా జరిగేలా చూడాలని, దీనిపై పాఠశాల ప్రిన్సిపాల్ ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సూచించారు. సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ తరగతి గదులను పరిశీలించారు, తరగతి గదులలో గోడలు మరియు పైకప్పుల నుంచి పెచ్చులు ఊడిపోతున్న వాటిని వెంటనే మరమ్మతు చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గురుకుల కళాశాలలు మరియు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు జేఈఈ,నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేలా ప్రత్యేక శిక్షణ,అనుభవం కలిగిన లెక్చరర్ డాక్టర్ రాజునునియమించారు. విద్యార్థులు ఉన్నత చదువుల కొరకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ సుధాకర్, యం ఆర్ ఓ, ఎంపిడిఓ నాగవేణి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పీఎం పోషణ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలి – కలెక్టర్



**మహబూబాబాద్, ఆగస్టు 05 (వుదయం ప్రతినిధి) :**

స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు పీఎం పోషణ జిల్లా స్థాయి స్టీరింగ్ కమ్ మానిటరింగ్ కమిటీ (DSMC ) జిల్లా కలెక్టర్ చైర్మెన్ గా , జిల్లా విద్యా శాఖ అధికారి (DEO) కన్వీనర్‌గా వ్యవహరిస్తుండగా, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు సభ్యులుగా నియమితులయ్యారు.ఈ సందర్భంగా కమిటీ తొలి సమావేశం బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధ్యక్షతన జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో. నిర్వహించారు.ఈ సమావేశంలో పీఎం పోషణ పథకం అమలు, విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడం, పరిశుభ్రత ప్రమాణాలు, వంటశాలల నిర్వహణ, ఎల్పీజీ వినియోగం, పోషకాహార ప్రమాణాల అమలు, నిధుల సక్రమ వినియోగం, ఆన్‌లైన్ ఎంఐఎస్ నమోదు, వంట కార్మికుల గౌరవ వేతనాల చెల్లింపులు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.జిల్లాలో పీఎం పోషణ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, సంబంధిత శాఖల సమన్వయంతో ప్రతి పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషకాహారం అందేలా అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జిల్లా రెవెన్యూ అధికారి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి (FAC) ఎ. సత్యనారాయణమూర్తి, జిల్లా పరిషత్ సీఈఓ, జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా సంక్షేమ శాఖల అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులు, జిల్లా MDM సూపరింటెండెంట్ సి.హెచ్. శ్రీనివాస్ రావు, జిల్లా MDM ఇన్‌చార్జి ఎం. గణేష్, డీఎస్‌వో అప్పారావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## లోక్‌సభలో మెగా లెదర్ పార్క్, రైల్వే సమస్యలపై గళమెత్తిన వరంగల్ ఎంపీ కావ్య

**స్టేషన్ ఘన్‌పూర్ మెగా లెదర్ పార్క్‌కు వెంటనే ఆమోదం తెలపాలని విజ్ఞప్తి**

**వరంగల్‌లో ఆర్‌ఓబీ, ఆర్‌యుబీ పనులను వేగవంతం చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేసిన ఎంపీ**



**వరంగల్, ఆగస్టు 05 (వుదయం ప్రతినిధి) :**

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య బుధవారం లోక్‌సభలో గళమెత్తారు. జానగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో ప్రతిపాదించిన మెగా లెదర్ పార్క్‌కు తక్షణ అనుమతులతో పాటు, వరంగల్ జిల్లాలోని రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద నిలిచిపోయిన ఆర్‌ఓబీ (ROB), ఆర్‌యుబీ (RUB) నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.మెగా లెదర్ పార్క్‌కు వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి!లోక్‌సభలో రూల్–377 కింద ఎంపీ కడియం కావ్య మాట్లాడారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో టీఎస్ఎల్ఐపీసీఓ (TSLIPCO) ఆధ్వర్యంలో 120 ఎకరాల్లో మెగా లెదర్ పార్క్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ప్రతిపాదనలు పంపినప్పటికీ, కేంద్రం వద్ద సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో లెదర్ పరిశ్రమకు కావాల్సిన ముడిసరుకుతో పాటు ఎఫ్‌డీడీఐ, నిఫ్ట్ వంటి ప్రముఖ సంస్థల సహకారం అందుబాటులో ఉందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఎస్సీ వర్గాల యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, స్వయం ఉపాధి లభిస్తుందని, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ వెంటనే స్పందించి ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలపాలని కోరారు.రైల్వే క్రాసింగ్ సమస్యలపై ప్రశ్నోత్తరాలువరంగల్ జిల్లాలో రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వల్ల ఎదురవుతున్న ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కేంద్ర రైల్వే శాఖ చేపట్టిన ఆర్‌ఓబీలు, ఆర్‌యుబీల పురోగతిపై ఎంపీ లోక్‌సభలో ప్రశ్నించారు.దీనికి కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ లిఖితపూర్వక సమాధానమిస్తూ... జిల్లాలో ప్రస్తుతం 4 ఆర్‌ఓబీ/ఆర్‌యుబీ పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. వరంగల్–చింతలపల్లి మధ్య ఎల్‌సీ నెం.64 వద్ద రూ.77 కోట్లతో చేపడుతున్న ఆర్‌ఓబీకి టెండర్ ఖరారైందని వెల్లడించారు. కాజీపేట–వరంగల్ (ఎల్‌సీ నెం.60), ఎల్గూర్–నెక్కొండ (ఎల్‌సీ నెం.66, 67) మధ్య మరో మూడు ఆర్‌ఓబీలను రాష్ట్ర ప్రభుత్వమే సొంత నిధులతో నిర్మిస్తున్నట్లు వివరించారు. ప్రజా సమస్యలపై పోరాటం ఆపేది లేదు:ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. టెండర్లు పూర్తయిన, జీఏడీ (GAD) దశలో ఉన్న రైల్వే ప్రాజెక్టులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఆర్‌ఓబీలకు కూడా రైల్వే శాఖ పూర్తి సాంకేతిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్ ప్రజలకు సురక్షితమైన, అంతరాయం లేని రవాణా సౌకర్యం లభించే వరకు పార్లమెంట్‌లో తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## జల సంరక్షణ అత్యంత కీలకం: కలెక్టర్



**జయశంకర్ భూపాలపల్లి ఆగస్టు 05(వుదయం జిల్లా ప్రతినిధి)**

ఎల్ నినో ప్రభావం కారణంగా ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనడానికి ప్రతి రైతు తమ పొలాల్లో ఫామ్ పాండ్స్ (పంట కుంటలు) నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు.బుధవారం రేగొండ మండలం గూడెపల్లి గ్రామంలో పర్యటించిన కలెక్టర్, రైతు లింగంపల్లి సంతోష్‌రావు తన వ్యవసాయ క్షేత్రంలో నిర్మించిన ఫామ్ పాండ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల సంరక్షణ అత్యంత కీలకమని తెలిపారు. వర్షపు నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి, నీటి కొరతను అధిగమించవచ్చని తెలిపారు.సంతోష్ రావు చేసిన ఈ ప్రయత్నం ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. వర్షాభావ సమయంలో ఫామ్ పాండ్స్‌లో నిల్వ ఉన్న నీరు పంటలను రక్షించడానికి ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. ఫామ్ పాండ్స్ ద్వారా చేపల పెంపకం చేపట్టడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. రైతులు విబిజి రాంజీ పథకం మరియు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, భూగర్భ జలాల పెంపులో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. విబిజి రాంజీ పథకం ద్వారా ఫామ్ పాండ్స్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని డిఆర్డీఓకు సూచించారు. అలాగే, ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన పథకం కింద జిల్లాకు మొత్తం 214 ఫామ్ పాండ్స్ మంజూరు కాగా, అందులో 170 పనులు ప్రారంభమై, 131 నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. విబిజి రాంజీ పథకం కింద 372 ఫామ్ పాండ్స్ మంజూరు కాగా, వాటిలో 78 గ్రౌండింగ్ దశలో ఉన్నట్లు వెల్లడించారు. ఫామ్ పాండ్స్ నిర్మాణంలో మన జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, రైతులు విబిజి రాంజీ మరియు ప్రధాన మంత్రి కృషి సంచాయి పథకాల క్రింద సమీకృత ఫామ్ పాండ్స్ అభివృద్ధి చేసుకునేలా ప్రోత్సహించే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నీటి సంరక్షణ, వినియోగ సామర్థ్యం పెంపు మరియు వ్యవసాయ ఉత్పాదకత మెరుగుపడేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ బాలకృష్ణ, ఎంపిడిఓ వేంకటేశ్వర్లు, నయాబ్ తహసీల్దార్ రజాక్, డిఆర్డీఏ ఎపిడి సంతోష్ రెడ్డి, సర్పంచ్ రాజేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సర్వారం పంచాయతీలో నిధుల మాయాజాలం?

**సర్వారం పంచాయతీ నిధులపై కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలి!**

**బిల్లులకు–వాస్తవ ఖర్చులకు పొంతన లేదన్న ఆరోపణలు**

**లక్షల్లో తేడాలపై సమగ్ర విచారణకు గ్రామస్తుల డిమాండ్**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 05 (వుదయం ప్రతినిధి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం సర్వారం గ్రామపంచాయతీలో గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధుల వినియోగంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీ ఖర్చులకు సంబంధించిన బిల్లులు, రికార్డుల్లో చూపిస్తున్న లెక్కలకు, వాస్తవంగా జరిగిన ఖర్చులకు మధ్య లక్షల రూపాయల తేడాలు ఉన్నాయంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ప్రభుత్వ నిధులతో చేపట్టినట్లు రికార్డుల్లో చూపిస్తున్న పనులు, వాటికి సంబంధించిన బిల్లులు, వాస్తవంగా జరిగిన పనులు, ఖర్చుల మధ్య పొంతన ఉందా? లేదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పంచాయతీ రికార్డుల్లో నమోదైన ఖర్చుల వివరాలు వాటికి సంబంధం లేని బిల్లులు జత చేయడం నిబంధనలు ఉల్లంఘించి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించే విధంగా పొంతన లేని బిల్లులను అప్లోడ్ చేయడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

**అసలు ఎన్ని లక్షల నిధులు ఖర్చయ్యాయి?**


సర్వారం గ్రామపంచాయతీకి ప్రభుత్వం, వివిధ పథకాల ద్వారా ఎంతమేర నిధులు విడుదల చేసింది? వాటిలో ఏయే పనులకు ఎంత మొత్తం కేటాయించారు? ఏ పనులకు ఎంత ఖర్చు చేశారు? బిల్లుల్లో ఎంత మొత్తం చూపించారు? వాస్తవంగా ఎంత ఖర్చయింది? వంటి అంశాలపై పూర్తిస్థాయి లెక్కలు వెలుగులోకి రావాల్సి ఉంది.బిల్లుల్లో చూపించిన మొత్తం, వాస్తవ ఖర్చు మధ్య తేడా ఉన్నట్లయితే ఆ వ్యత్యాసానికి కారణమేంటి? నిధుల వినియోగంలో ఏమైనా నిబంధనల ఉల్లంఘనలు జరిగాయా? అనే అంశాలపై అధికారుల విచారణలో స్పష్టత రావాల్సి ఉంది.

**అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?**

ప్రభుత్వ నిధుల వినియోగానికి సంబంధించిన బిల్లులు, వౌచర్లు, తీర్మానాలు, చెల్లింపుల వివరాలు, పనుల రికార్డులను పరిశీలించడం సంబంధిత అధికారుల బాధ్యత. అయితే సర్వారం పంచాయతీలో నిధుల వినియోగంపై ఆరోపణలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో పంచాయతీ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు జరిగిన పర్యవేక్షణపై ప్రజలు ప్రశ్నలు సంధిస్తున్నారు. ఇలాంటి వ్యత్యాసాలు అధికారుల పరిశీలనలో ఎందుకు గుర్తించబడలేదనే అంశంపై కూడా సమగ్ర విచారణ అవసరమని గ్రామస్తులు కోరుతున్నారు.

**'ఉన్నతాధికారుల గైడెన్స్ లేక పోవడం వల్లే'.. కార్యదర్శి సతీష్ వివరణ..**

సర్వారం గ్రామపంచాయతీ కార్యదర్శి సతీష్ చరవాణిలో వివరణ కోరగా, ఉన్నతాధికారుల నుంచి సరైన మార్గదర్శకాలు అందకపోవడం వల్లే పాత పద్ధతిలో బిల్లులు అప్లోడ్ చేశామని తెలిపారు. బిల్లులను ఏ విధంగా అప్లోడ్ చేయాలనే విషయంపై స్పష్టమైన మార్గదర్శకాలు అందలేదని పేర్కొన్నారు.మండలంలోని మరికొన్ని గ్రామపంచాయతీల్లో కూడా ఇదే విధంగా జరిగిందని ఆయన తెలిపారు. ఎంపీడీవోకు కూడా బిల్లులు ఎలా అప్లోడ్ చేయాలనే విషయంపై స్పష్టమైన మార్గదర్శకాలు అందలేదని తమకు తెలిపారని ఆయన వివరించారు.అయితే బిల్లుల్లో చూపించిన మొత్తాలకు, వాస్తవ ఖర్చులకు మధ్య ఏమైనా వ్యత్యాసాలు ఉన్నాయా? ఉంటే వాటికి కారణాలేమిటి? అనే అంశాలపై అధికారిక రికార్డుల పరిశీలనతోనే స్పష్టత వస్తుందని గ్రామస్తులు అంటున్నారు.




**సుజాతనగర్ మండలం ఎంపీడీవో భారతి వివరణ..**

సుజాతనగర్ మండల ఎంపీడీవో భారతిని చరవాణిలో వివరణ కోరగా, "పంచాయతీ ఖర్చులకు సంబంధించిన బిల్లులు తక్కువగా పెట్టమని ఎవరు చెప్పారు కదా?" అంటూ స్పందించారు. అనంతరం తనకు మరో ఫోన్ వస్తోందని, తర్వాత మాట్లాడతానని చెప్పి ఫోన్ కట్ చేశారు.ఈ స్పందనపై కూడా గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలతో అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.రికార్డులు పరిశీలిస్తే అసలు నిజం తేలేనా?సర్వారం గ్రామపంచాయతీలో గతంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు, వౌచర్లు, తీర్మానాలు, చెక్కులు, చెల్లింపుల వివరాలు, పనుల కొలతల రికార్డులు, సంబంధిత రిజిస్టర్లు, క్షేత్రస్థాయి పనులను సమగ్రంగా పరిశీలిస్తే అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

**కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని డిమాండ్..**

సర్వారం గ్రామపంచాయతీలో నిధుల వినియోగంపై వస్తున్న ఆరోపణలపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని సమగ్ర విచారణకు ఆదేశించాలని గ్రామస్తులు కోరుతున్నారు.విచారణలో నిధుల దుర్వినియోగం, నిబంధనల ఉల్లంఘన, తప్పుడు లెక్కలు లేదా బిల్లుల్లో అవకతవకలు జరిగినట్లు తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వ నిధులు ప్రజల అభివృద్ధి కోసం కేటాయించబడుతున్నందున వాటి వినియోగంలో పూర్తి పారదర్శకత ఉండాలని, పంచాయతీ ఖర్చులకు సంబంధించిన రికార్డులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## విద్యార్థుల మృతి అత్యంత విషాదకరం...

**ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశాలు...**

**బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది...**

**ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**



**జగిత్యాల ఆగస్టు 03 (వుదయం ప్రతినిధి)**

మల్యాల మండలంలోని ఎంపీపీఎస్ ఒడ్డెర కాలనీ పాఠశాలలో చదువుతూ సమీకృత బాలుర వసతి గృహంలో ఉంటున్న ఇద్దరు విద్యార్థులు ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందడం అత్యంత విషాదకరమని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ అన్నారు. సోమవారం జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని సందర్శించిన జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ మృత విద్యార్థుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఘటనపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ మాట్లాడుతూ మల్యాలలోని ఎంపీపీఎస్ ఒడ్డెర కాలనీ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు విరామ సమయంలో ఎవరికి సమాచారం ఇవ్వకుండా పాఠశాల ఆవరణ నుంచి బయటకు వెళ్లినట్లు తెలిపారు కొంతసేపటి తర్వాత వారు పాఠశాలకు తిరిగి రాకపోవడంతో ప్రధానోపాధ్యాయుడు హాస్టల్ వార్డెన్ ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు గాలింపు చర్యలు చేపట్టారని తెలిపారు. గాలింపు సందర్భంగా పాఠశాల హాస్టల్ కు సమీపంలోని కొత్త కుంట వద్ద విద్యార్థుల దుస్తులు కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించామని తెలిపారు. అనంతరం పోలీసు శాఖ మత్స్యశాఖ ఆధ్వర్యంలో గజ ఈత గాళ్లతో కలిసి కుంటలో గాలింపు చేపట్టగా దురదృష్టవశాత్తు ఇద్దరు విద్యార్థులు మృతి చెందినట్లు గుర్తించి మృతదేహాలను వెలికితీసినట్లు తెలిపారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర విచారణ నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ సంఘటనకు దారితీసిన పరిస్థితులను పూర్తి స్థాయిలో పరిశీలించి నివేదిక సమర్పించాలని సూచించారు. విచారణలో ఎవరి నిర్లక్ష్యం ఉన్నా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ప్రభుత్వం తరపున అందాల్సిన సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ ఘటన అత్యంత బాధాకరమని పేర్కొన్న ఆయన విచారణలో విధుల్లో నిర్లక్ష్యం తేలితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యమంత్రి రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజకుమార్ డిఈఓ రాము ఇతర అధికారులు పోలీసు అధికారులు సంబంధిత శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : కలెక్టర్



**పెద్దపల్లి (సుల్తానాబాద్) ఆగస్టు-5 (వుదయం ప్రతినిధి)**

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందేలా వైద్యాధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.బుధవారం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రిలోని ఓపీ విభాగం, వార్డులు, ప్రసూతి విభాగం, ల్యాబ్, ఫార్మసీ, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి వైద్యాధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని ఆదేశించారు.ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ (అవుట్ పేషెంట్లు) సంఖ్య పెరిగేలా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. గర్భిణులందరినీ ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది సమన్వయంతో క్రమం తప్పకుండా ఫాలోఅప్ చేస్తూ అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణులను ప్రత్యేకంగా గుర్తిం చి నిరంతర పర్యవేక్షణలో ఉంచి మెరు గైన వైద్య సేవలు అందించాలని సూచిం చారు.ఆసుపత్రిలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వార్డులు, మరుగుదొడ్లు, ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. రోగులకు అవసరమైన మందులు, వైద్య పరీక్షలు సకాలంలో అందుబాటులో ఉండేలా చూడాలని, అత్యవసర సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి సంతృప్తి చెందేలా సేవలు అందించాలని, రోగుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, రిఫరల్స్ ను తగ్గిస్తూ సాధ్యమైనంత మేరకు స్థానికంగానే నాణ్యమైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల నమ్మకాన్ని మరింత పెంచే విధంగా ప్రతి ఉద్యోగి సేవాభావంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో సంబంధిత వైద్యాధికారులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## రీ సర్వే ద్వారా భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం: కలెక్టర్



**నిర్మల్ జిల్లా 4 ఆగస్ట్ 2026 (వుదయం ప్రతినిధి)**

రీ సర్వే నిర్వహణ ద్వారా భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. బుధవారం సోన్ మండలం న్యూ పోచంపాడ్ గ్రామానికి చెందిన వ్యవసాయ భూముల్లో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను పరిశీలించారు. ముందుగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూముల రీ సర్వే ప్రక్రియ చేపట్టింది అన్నారు. సర్వే అధికారులకు రైతులు సహకరించాలని తెలిపారు. రీ సర్వే నిర్వహించే సమయంలో తప్పనిసరిగా రైతులు అందుబాటులో ఉండాలని చెప్పారు. రీ సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. సంబంధిత అధికారుల బృందం తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియకు సహకరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి సంబంధించి భూముల వివరాలు, చేపట్టిన సర్వే వివరాలు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన రైతు భూమి రీ సర్వే ప్రక్రియను ఈ సందర్భంగా కలెక్టర్ పరిశీలించారు. ఎకరం భూమి సర్వే చేయడానికి సుమారు ఎంత సమయం అవసరం అవుతుంది అనే వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే ప్రక్రియను మొత్తం పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఏడి ల్యాండ్ సర్వే రికార్డ్ నరసింహమూర్తి, తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో రామకృష్ణ, సర్పంచ్ సాగర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఏడుగురికి కారుణ్య నియామక పత్రాలు అందించిన కలెక్టర్ చిత్ర మిశ్రా



**కరీంనగర్ ఆగస్టు 05 (వుదయం ప్రతినిధి):**

జిల్లాలో వివిధ శాఖల్లో కారుణ్య నియామకం కింద ఏడుగురికి ఉద్యోగాలు కల్పించినట్లు బుధవారం కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. వివిధ శాఖల్లో ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లుగా, ఇద్దరినీ ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించినట్లు పేర్కొన్నారు. వారికి కలెక్టరేట్ లోని తన చాంబర్ లో కలెక్టర్ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉద్యోగం పొందిన వారు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ తమ కుటుంబాలకు ఆసరాగా నిలవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్ఓ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ ఫోటో జర్నలిస్టుగా వడ్లూరి రవీందర్

**కర్ణాటక మీడియా అకాడమీ ఆధ్వర్యంలో పురస్కార ప్రధానం**

**అరుదైన చిత్రానికి దక్కిన ప్రాధాన్యం**



**ధర్మపురి ఆగస్ట్05 త(వుదయం ప్రతినిధి):**

ధర్మపురి పట్టణానికి చెందిన టీవీ-5 న్యూస్ రిపోర్టర్ వడ్లూరి రవీందర్ జాతీయ స్థాయిలో ఉత్తమ ఫోటో జర్నలిస్ట్ అవార్డును కైవసం చేసుకున్నారు. కర్ణాటక మీడియా అకాడమీ, సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వ హించిన ఫోకస్ ఆన్ న్యూస్ 2.0 జాతీయ స్థాయి న్యూస్ ఫోటోగ్రఫీ పోటీల్లో ఆయన పంపిన అరుదైన వుడెన్ టైప్ బటర్‌ఫ్లై ఛాయాచిత్రం ఉత్తమమైనదిగా ఎంపికైంది. ఈ సందర్భంగా



మంగళవారం బెంగళూరులోని కర్ణాటక చిత్రకళా పరిషత్‌లో వైభవంగా నిర్వహించిన పురస్కారాల ప్రదానోత్సవంలో ఆ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి రామలింగారెడ్డి, సమాచార శాఖ కమిషనర్ డాక్టర్ బి.ఆర్.మమత, మీడియా అకాడమీ చైర్‌పర్సన్ ఆయేషా కానం చేతుల మీదుగా రవీందర్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. నిర్వాహకులు ఆయనకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. గతంలోనూ రవీందర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సహా తెలంగాణ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పలు ఫోటోగ్రఫీ పోటీల్లో పాల్గొని ప్రతిష్ఠాత్మక అవార్డులు సొంతం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో ఆయనకు అవార్డు దక్కడంతో ధర్మపురి ప్రాంత ప్రముఖులు, పాత్రికేయులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలి

**రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార , గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**



**మంచిర్యాల /ఆగస్టు 5 (వుదయం ప్రతినిధి)**

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే విధంగా అధికార యంత్రాంగం సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార , గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలోని శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ లతో కలిసి కోటపల్లి, చెన్నూర్, భీమారం, జైపూర్ మండలాల తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో వివిధ రకాల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో సుమారు 100 కోట్ల రూపాయల వ్యయంతో నీటి ట్యాంకులు, పైప్‌లైన్‌ల నిర్మాణ పనులు చేపడుతున్నామని, ప్రతి ఇంటికి సురక్షితమైన త్రాగునీటిని అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం సెంట్రల్ లైటింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో భాగంగా సోలార్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇళ్లను కేటాయించడం జరుగుతుందని, ప్రతి నియోజకవర్గానికి 3 వేల 500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని, అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇల్లు అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. నగర అభివృద్ధి నిధులతో మున్సిపల్ పరిధిలో వివిధ అభివృద్ధి పనులతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సి.సి. రోడ్లు, మురుగు కాలువల వ్యవస్థ, నీటి ట్యాంకులు, విద్యుత్ స్తంభాలు తదితర మౌలిక వసతుల పనులను చేపడుతున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మున్సిపల్, రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీ రాజ్, విద్యుత్, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా, గృహ నిర్మాణ శాఖల అధికారులతో ఆయా శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని, అభివృద్ధి పనులలో జాప్యం లేకుండా నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుత్తేదారులకు కేటాయించిన పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, పనుల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వచ్చే సంవత్సరం జరగనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి పుష్కర ఘాట్ల ఏర్పాటు, అంతర్గత రహదారుల నిర్మాణం, ప్రజా సౌకర్యాల కల్పన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బడి పిల్లల భద్రతపై ఫోకస్..

### రెండు వాహనాలు సీజ్

**– మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ గంధం వంశీధర్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 05 (వుదయం ప్రతినిధి) :**

బడి పిల్లల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా మోటారు వాహన శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ గంధం వంశీధర్ ఆధ్వర్యంలో వేములవాడ నుండి చందుర్తి, రుద్రంగి వరకు పాఠశాల విద్యార్థులను తరలించే వాహనాలను తనిఖీ చేశారు,ఈ సందర్భంగా పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేశారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా పరిమితికి మించి ప్రయాణికులను, పాఠశాల పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ తరలించవద్దని హెచ్చరించారు. తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన రెండు మోటార్ క్యాబ్ (టాటా ఏస్) వాహనాలను సీజ్ చేసినట్లు మోటర్ వేహికిల్ ఇన్స్పెక్టర్ వంశీధర్ తెలిపారు.ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ రమ్య, హోంగార్డు ఎల్లయ్య పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యానికి తల్లిపాలు శ్రీరామరక్ష

**అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపా లు కలకాలం కార్యక్రమం**

**చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన**

**పదో వార్డు కౌన్సిలర్ సంగి ఆనంద్**



**ధర్మపురి ఆగస్ట్ 05(వుదయం ప్రతినిధి):**

అంగన్‌వాడీ మూడో కేంద్రంలోపిల్లల శారీరక,మానసిక ఎదు గుదలకు,సరైన ఆరోగ్యానికి మంచి పౌష్టికాహారాన్ని అందిం చడమే శ్రీరామరక్ష అని పదో వార్డు కౌన్సిలర్ సంగి. ఆనంద్ పేర్కొన్నారు.తల్లిపాలు-కలకాలం ఉత్సవాలలో భాగంగా స్థానిక అంగన్‌వాడీ మూడో కేంద్రంలో నిర్వహించిన కార్యక్ర మానికి ఆయన ముఖ్యఅతిథి గా హాజరయ్యారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పసి పిల్లలకు తల్లిపాల ప్రాము ఖ్యతను వివరిస్తూ, చిన్నతనం నుంచే సరైన పోషకాలు అందించకపోతే పిల్లల ఆరోగ్యం దెబ్బ తింటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూ చించారు. అనంతరం కేంద్రంలో ఉన్న చిన్నారులకు వైభవంగా అక్షరాభ్యాస మహోత్సవం నిర్వ హించారు.ఈ కార్యక్రమంలో డా.వినయ్,ఏఎన్ఎమ్ విజయ,సరిత అంగన్‌వాడీ టీచర్స్, సిబ్బంది,తల్లులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తతే ఆయుధం..

### జిల్లా ఎస్పీ నితికా పంత్




**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సైబర్ జాగ్రత్త దివాస్ - సురక్షకా తిరంగా" కార్యక్రమంలో భాగంగా బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని హెచ్‌ఆర్‌డీ భవనంలో జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రోజురోజుకు సైబర్ నేరాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పెట్టుబడి మోసాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా నేరాలు, సైబర్ బులీయింగ్, ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ స్టాకింగ్ వంటి అంశాలపై వీడియో ప్రదర్శన ద్వారా సమగ్ర అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక్కరోజులోనే సైబర్ నేరాల వల్ల సుమారు రూ.5 కోట్ల మేర ప్రజలు నష్టపోతుండగా, దేశవ్యాప్తంగా రోజుకు సుమారు రూ.70 కోట్ల వరకు సైబర్ మోసాల కారణంగా నష్టం జరుగుతోందని తెలిపారు.సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశను ఆసరాగా చేసుకుని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని నమ్మించి సైబర్ నేరగాళ్లు అమాయకుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు కాజేస్తున్నారని హెచ్చరించారు.గుర్తు తెలియని వ్యక్తులు పంపే ఎపిక్ ఫైళ్లు, అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయరాదని సూచించారు. బ్యాంకింగ్, సోషల్ మీడియా తదితర డిజిటల్ సేవలకు సంబంధించిన పాస్‌వర్డ్‌లను బలమైనవి, క్లిష్టమైనవిగా రూపొందించుకోవాలని తెలిపారు. ఓటీపీలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. చిన్న నిర్లక్ష్యమే పెద్ద ఆర్థిక నష్టానికి దారితీస్తుందని, ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.సైబర్ నేరాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే సమీప పోలీసు స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.ఈ సందర్భంగా గతంలో సైబర్ నేరాలకు గురైన పలువురు బాధితులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ వాహిదుద్దీన్, కాగజ్‌నగర్ టౌన్ సీఐ ప్రేమ్‌కుమార్, రూరల్ సీఐ కుమారస్వామి, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ రవీందర్, సైబర్ క్రైమ్ ఎస్ఐలు దివ్య, కిరణ్, ఇతర ఎస్.ఐలు రాజు, లక్ష్మణ్, నరేష్ తదితర పోలీసు అధికారులు, సైబర్ క్రైమ్ సిబ్బంది సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులకు కాకుండా అనర్హులకు, డబుల్ బెడ్రూమ్ ఇండ్ల కేటాయింపు

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ధ్వజం**



**కరీంనగర్ ఆగస్టు 05 (వుదయం ప్రతినిధి):**

హుజురాబాద్ మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని, కాంగ్రెస్ విధేయులకే ఇళ్లు మంజూరు చేశారని భారతీ య జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధ వారం రోజున బిజెపి హుజూరాబాద్ మున్సిపల్ ఫ్లోర్, కౌన్సిలర్లమీటింగ్ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పాలన అవినీతికి అడ్డాగా మారిందని మండిపడ్డారు. నిజమైన నిరుపేదలు, అర్హులైన లబ్ధిదారులను పక్కనబెట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లను కేటాయించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

## భూ రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలి: కలెక్టర్



**కామారెడ్డి, ఆగస్టు 5 (వుదయం ప్రతినిధి):**

జిల్లాలో భూ రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం గాంధారి మండలం సీతాయిపల్లి గ్రామంలో కొనసాగుతున్న రీసర్వే పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే బృందాలు చేపడుతున్న కొలతల విధానం, సరిహద్దుల నిర్ధారణ, రికార్డుల పరిశీలన తదితర అంశాలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భూ యజమానులు, రైతులు భూ రీసర్వే ప్రక్రియకు పూర్తిస్థాయిలో సహకరించాలని, ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రీసర్వే పనుల్లో ఖచ్చితత్వం, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దీని ద్వారా భూ సరిహద్దు వివాదాలు తగ్గి భూమిపై ఉన్న రైతులకు ఖచ్చితమైన హక్కుల నిర్ధారణ అవుతుంది కాబట్టి రైతులు ఈ కార్యక్రమానికి పూర్తిగా సహకరించాలని కోరారు. ఈ క్షేత్ర పరిశీలనలో ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ), గాంధారి తహసీల్దార్, సర్వే బృంద సభ్యులు, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ సైబర్ జాగృతి దివస్ సందర్భంగా అవగాహన ర్యాలీ ప్రారంభించిన పోలీస్ కమిషనర్



**నిజామాబాద్, వుదయం, ఆగస్ట్ 06:**

జాతీయ సైబర్ జాగృతి దివస్ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సురక్షా కా తిరంగా — సైబర్ ఇండిపెండెంట్ తెలంగాణ వైపు" రాష్ట్రవ్యాప్త సైబర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు నిజామాబాద్ నగరంలోని విజయ రూరల్ ఇంజినీరింగ్ కళాశాల (VREC)లో సైబర్ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు విద్యార్థులు, అధ్యాపకులు మరియు సిబ్బందితో కలిసి సైబర్ అవగాహన ప్రతిజ్ఞ చేయించారు.

## భవిత కేంద్రాల్లో ఏఐ సాంకేతికతతో శిక్షణ: కలెక్టర్



**ఆదిలాబాద్, ఆగస్టు 5 :**

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిపుణుల వైద్య సేవలు అందించి మెరుగైన భవిష్యత్తుకు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం పట్టణంలోని డబ్ల్యూ కన్వెన్షన్ హాలులో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిదండ్రుల అవగాహన సదస్సులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజ్యలక్ష్మి తో కలిసి ఆయన పాల్గొన్నారు. భవిత కేంద్రాల్లో ఏఐ సాంకేతికతతో పాటు ప్రత్యేక శిక్షణ సామగ్రిని అందుబాటులోకి తెస్తున్నామని, ఫిజియోథెరపిస్టులు, స్పీచ్ థెరపిస్టుల ద్వారా పిల్లలకు సేవలు అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. చికిత్స, శిక్షణలో విరామం లేకుండా పిల్లలను ప్రతిరోజూ భవిత కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని, యూడీఐడీ కార్డు, బెంచ్‌మార్క్ డిసెబిలిటీ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్లో అపారమైన ప్రతిభ ఉంటుందని, వారికి సరైన అవకాశాలు కల్పిస్తే ఉన్నత స్థాయికి చేరుకుంటారని డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజ్యలక్ష్మి అన్నారు. అనంతరం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దిన పలువురు తల్లిదండ్రులను కలెక్టర్, కార్యదర్శి సన్మానించారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## యువ క్రీడాకారులు ఉన్నత స్థాయిలో రాణించాలి



- మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్

**నాగర్ కర్నూల్,ఆగస్టు 05 (వుదయం ప్రతినిధి):** క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ గ్రౌండ్‌లో నిర్వహించిన అండర్ 18 రన్నింగ్ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ యువ క్రీడాకారులు నిరంతర సాధనతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి నాగర్‌కర్నూల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. శిక్షణ పొందుతున్న క్రీడాకారులను అభినందించిన చైర్మన్ వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని రన్నింగ్ కోచ్ మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో 24వ వార్డు కౌన్సిలర్ ఎం.డి. నిజాం, భాస్కర్, మలిపెద్ది చంద్రశేఖర్క్రీడాకారులు, యువత, అభిమానులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ సమీక్షా సమావేశం





- క్రమశిక్షణ, సమయపాలనతో నాణ్యమైన విద్యనందించాలి జిల్లా కలెక్టర్ కె. హైమావతి


**సిద్దిపేట, ఆగస్టు 05 (వుదయం బ్యూరో):** ఉపాధ్యాయులు క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేలా తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని టీటీసీ భవన సమావేశ మందిరంలో ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, హైస్కూల్ హెచ్ఎంలు, తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లతో నిర్వహించిన విద్యాశాఖ పనితీరు సమీక్షా సమావేశంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా విద్యాశాఖను పర్యవేక్షిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందించి ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్ రోల్మెంట్ అనుకున్న స్థాయిలో జరగకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతులు ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల పనితీరు సరిగా లేకపోవడం వల్లే తల్లిదండ్రులకు నమ్మకం సడలుతోందని హెచ్చరించారు. ప్రైవేట్ స్కూళ్లలో పనిచేసే ప్రభుత్వ ఉపాధ్యాయులను తక్షణమే గుర్తించి విధుల్లో నుంచి తొలగించాలని డిఈఓను ఆదేశించారు. రోజువారీ ఉపాధ్యాయుల, విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు ఎఫ్ ఆర్ ఎస్ నివేదికను సాయంత్రంలోగా అందజేయాలన్నారు. స్కూళ్లు ప్రారంభమై నెలన్నర గడుస్తున్నా కొన్నిచోట్ల 23 పాఠాలు కూడా పూర్తి కాకపోవడం సరికాదని, 1, 2, 3 తరగతుల పిల్లలకు చదవడం, రాయడం ఖచ్చితంగా రావాలని స్పష్టం చేశారు. విద్యార్థుల ఆధార్ అపిడేషన్ ప్రక్రియను రేపటిలోగా పూర్తి చేయాలని, బడి మానేసిన పిల్లల ఇళ్లకు వెళ్లి తిరిగి అడ్మిషన్లు కల్పించాలని ఆదేశించారు. మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు ప్రతినెల ఒక ఉపాధ్యాయుడికి బాధ్యతలు అప్పగించాలని, ఈనెల 15 నాటికి అందరికీ యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు చేరేలా చూడాలన్నారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి రోజూ క్రీడలు, యోగా, ధ్యానం అభ్యసించేలా చర్యలు తీసుకోవాలని, పీఈటీలు లేనిచోట ఉపాధ్యాయులే ఆటలు ఆడించాలని తెలిపారు. ప్రతి మండలానికి ఒక పాఠశాలను ఇందిరాగాంధీ జెడ్పీ స్కూల్ స్థాయికి తీర్చిదిద్ది, జిల్లాను విద్యా రంగంలో అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, ఏఎంఓ రామస్వామి, మండల విద్యాశాఖ అధికారులు, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## బిర్యానీలో నాణ్యత తక్కువ

- గురుకులంలో ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హైమావతి
- నాణ్యమైన భోజనం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం



**దుబ్బాక ప్రతినిధి, ఆగస్టు 5, వుదయం:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి గురుకుల ప్రిన్సిపల్ ను ఆదేశించారు.బుధవారం దుబ్బాక పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా బిర్యాని రైస్, బాయిల్డ్ గుడ్డు, ఆలు కూర్మ, రసం, పెరుగును పరిశీలించారు. బిర్యాని రైస్ నాణ్యత సరిగా లేదని, సామగ్రిని తక్కువ మోతాదులో వేశారని అసంతృప్తి వ్యక్తం చేశారు. మొక్కుబడిగా వండి విద్యార్థులకు పెడితే సహించబోమని హెచ్చరించారు. బిర్యానీలో క్యారెట్, పుదీనా, బగారా సామగ్రిని సమపాళ్లలో వేసి రుచికరంగా వండి పెట్టాలని సూచించారు.స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించి, రోజు కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థుల హాజరు ప్రకారం ఫుడ్ కమిటీ సమక్షంలోనే కూరగాయలు, వంట సరుకులు వంట సిబ్బందికి అందించాలని ఆదేశించారు.వంట గది, స్టోర్ రూమ్ ను తనిఖీ చేశారు. వంట చేసిన వెంటనే పరిసరాలను శుభ్రంగా కడగాలని, మురికి నీరు నిలవకుండా, ఈగలు, దోమలు రాకుండా చూడాలని తెలియజేశారు. స్టోర్ రూమ్ లో గుడ్లు, కూరగాయలు, వంట సరుకుల నాణ్యతను పరిశీలించి, మంచి నాణ్యమైన సరుకులనే వాడాలని ఆదేశించారు.సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యార్థులకు జ్వరం, జలుబు వస్తే క్లోజ్ గా మానిటర్ చేసి, తీవ్రత ఎక్కువైతే ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించాలని సూచించారు. గురుకుల సమస్యలపై ఆరా తీయగా బియ్యం నాణ్యత బాగోలేదని తెలపడంతో వెంటనే డిసిఎస్ఓ కి ఫోన్ చేసి నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని ఆదేశించారు. గురుకులంలోని ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని డిసిఓ ను ఫోన్ ద్వారా ఆదేశించారు.



**వనపర్తి ఆగస్టు 5 (వుదయం ప్రతినిధి)**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతతో పాటు వేగానికి ప్రాధాన్యత ఇవ్వాలి: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతమ్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిమితులకు లోబడి, నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి. గౌతమ్ ఆదేశించారు. బుధవారం వనపర్తి జిల్లా వనపర్తి మండలం రాజపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి మేనేజింగ్ డైరెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఎండి ఆరా తీయగా.. గ్రామంలో మంజూరైన 34 ఇందిరమ్మ ఇళ్లకు 34 ఇళ్ల నిర్మాణ

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత, వేగానికి ప్రాధాన్యత ఇవ్వాలి

పనులు ప్రారంభమైనట్లు, ఇండ్లు నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు హౌసింగ్ పీడీ వివరించారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లులు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఎక్కువ ఎత్తుతో కూడిన బేస్మెంట్ నిర్మించుకోవడం, పరిమితికి మించి స్లాబ్ సైజు పెంచుకోవడం వంటివి చేయవద్దని సూచించారు. అలా చేస్తే నిర్మాణ ఖర్చు భారీగా పెరుగుతుందని సూచించారు. కాబట్టి లబ్ధిదారులు పరిమితులకు లోబడే నిర్మాణం చేపట్టాలని తెలియజేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం లబ్ధిదారులు గంధం నాగమ్మతో పాటు మరో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలను సందర్శించి, పరిశీలించి వారితో నేరుగా మాట్లాడారు. నిర్మాణ వ్యయం, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం, నిర్మాణ పనుల పురోగతి తదితర అంశాలపై ఆరా తీశారు. అలాగే ప్రస్తుతం మార్కెట్లో సిమెంట్ బస్తాలు, ఇనుప సామగ్రి ధరలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్‌ను ప్రభుత్వం రాయితీ ధరలకు లబ్ధిదారులకి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అంశంపై లబ్ధిదారుల అభిప్రాయాలను కూడా తెలుసుకుని నమోదు చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ విఠోభా, ఇతర అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బెంగాల్ పనివారిలో రాజకీయ చైతన్యం

- గీతం ఆతిథ్య ఉపన్యాసంలో పేర్కొన్న కేంబ్రిడ్జ్ చరిత్రకారిణి ప్రొఫెసర్ సమీతా సేన్



**పటాన్చెరు (వుదయం):** పశ్చిమ బెంగాల్ లోని గృహ కార్మికులలో రాజకీయ చైతన్యం అభివృద్ధి చెందుతోందని, గుర్తింపు, గౌరవం, న్యాయపరమైన వేతనాలు, చట్టపరమైన రక్షణ వంటి డిమాండ్లతో సమీకృతమవుతున్నట్టు కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలోని చరిత్ర ఉపన్యాసకురాలు సమీతా సేన్ పేర్కొన్నారు. హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, సెంటర్ ఫర్ ఏషియన్ స్టడీస్ ఆధ్వర్యంలో పట్టణీకరణ, లింగం, శ్రమ (యూజీఎల్) విభాగం క్లస్టర్ ప్రారంభోపన్యాసాన్ని బుధవారం నిర్వహించింది. 'ఉద్యమిస్తున్న పనిమనుషులు: పశ్చిమ బెంగాల్ లో గృహ కార్మికుల రాజకీయాలు' అనే అంశంపై ఆమె ఆన్ లైన్ లో ఆతిథ్య ఉపన్యాసం చేశారు. పట్టణీకరణ, శ్రమ, లింగం వంటి అంశాలపై పనిచేస్తున్న స్కాలర్లను ఒకచోట చేర్చి, వివిధ రంగాల మధ్య అర్థవంతమైన సంభాషణలను ప్రోత్సహించే ఒక వేదికగా యూజీఎల్ డైలాగ్ ను రూపొందించారు.గృహాలలో పనిచేయడం అనేది లింగం, వర్గం, వలసలు, పట్టణీకరణ సమస్యలతో ముడిపడి ఉందని, ఇది అంతర్ విభాగ పరిశోధనకు ఒక ముఖ్యమైన రంగంగా నిలుస్తుందని డాక్టర్ సమీతా సేన్ అభిప్రాయపడ్డారు. అస్థిరమైన ఉపాధి, సామాజిక భద్రత లేకపోవడం, పరిమిత చట్టపరమైన రక్షణలతో సహా గృహ కార్మికులు ఎదుర్కొంటున్న సవాళ్లపై ప్రొఫెసర్ సేన్ చర్చించారు. గృహ కార్మికుల సంఘాలు, సమూహాలు పెరగడం వారి సమస్యలను ప్రజా చర్చలు, విధానపరమైన సంప్రదింపులలోకి తీసుకు రావడంలో కీలక పాత్ర పోషించిందని ఆమె పేర్కొన్నారు. కార్మికుల జీవన అనుభవాలను నమోదు చేయవలసిన ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, సమకాలీన భారతదేశంలో కార్మిక, లింగ, పట్టణ పరివర్తనలను మరింత బాగా అర్థం చేసుకోవడానికి స్కాలర్లు అంతర్ విషయ విధానాలను అవలంబించాలని ఆమె ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. కార్మిక హక్కులు, మహిళా ఉద్యమాలు, పట్టణ భారతదేశంలో గృహ కార్మికుల మారుతున్న స్వభావంపై అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమాన్ని హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని ఆంగ్ల, ఇతర భాషల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, యూజీఎల్ క్లస్టర్ సమన్వయకర్త డాక్టర్ దేబద్రిత చక్రవర్తి సమన్వయం చేశారు.

**వక్త గురించి:**

ప్రొఫెసర్ సమీతా సేన్ కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఇంపీరియల్, నావల్ హిస్టరీకి సంబంధించిన వేర్ హార్మ్స్‌వర్త్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. ఆమె గతంలో డైమండ్ హార్బర్ మహిళా విశ్వవిద్యాలయానికి తొలి ఉప కులపతిగా పనిచేశారు. కలకత్తా, జాదవ్ పూర్ విశ్వవిద్యాలయాలలో బోధించారు. జాదవ్ పూర్ వర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఉమెన్స్ స్టడీస్ డైరెక్టర్ గా, అంతర్ విభాగం అధ్యయనం డీన్ గా కూడా సేవలందించారు. కామన్వెల్త్ చరిత్రలో ట్రెవర్ రీస్ బహుమతి గ్రహీత అయిన ఆమె, కార్మిక చరిత్ర, లింగ అధ్యయనాలు, వలస భారతదేశంలో విస్తృతంగా ప్రచురించారు. 1982 నుంచి 'సచేతన' అనే సంస్థ ద్వారా మహిళా ఉద్యమంలో కూడా చురుకైన సభ్యురాలిగా ఆమె ఉన్నారు.

## కష్టాలను జయించిన ప్రతిభకు సామాజిక చేయూత

- తండ్రి లేని లోటు... తల్లి అనారోగ్యం... రాత్రిళ్లు పనిచేసి డిగ్రీ పూర్తి చేసిన యువకుడికి ఎస్ఎస్‌సీ కోచింగ్ కోసం రూ.25 వేల చెక్కు అందజేత



**గద్వాల, ఆగస్టు 05 (వుదయం కరస్పాండెంట్):** జీవితంలో వరుస కష్టాలు వెంటాడినా లక్ష్యాన్ని మాత్రం వదలని ఓ పేద విద్యార్థికి సామాజిక బాధ్యతతో ముందుకొచ్చిన సేవాభావులు అండగా నిలిచారు. తండ్రి చిన్నతనంలోనే మృతి చెందడం, తల్లి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటం, కుటుంబ ఆర్థిక పరిస్థితులు పూర్తిగా దెబ్బ తిన్నా... రాత్రిళ్లు క్యాటరింగ్‌లో పనిచేస్తూ చదువును కొనసాగించి డిగ్రీ పూర్తి చేసిన యువకుడి పట్టుదలకు గుర్తింపుగా రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గట్టు మండలం చాగదోన గ్రామానికి చెందిన సి. వినోద్ కుమార్ చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయాడు. తల్లి కూలి పనులు చేస్తూ ఎన్నో కష్టనష్టాలను భరిస్తూ కుమారుడిని చదివించింది. వినోద్ కుమార్ గట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 9.8 జీపీఏ సాధించగా, ఐజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో 1000 మార్కులకు 921 మార్కులు సాధించి తన ప్రతిభను చాటుకున్నాడు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ సిటీ కాలేజ్లో బీఎస్సీ (ఎంపీసీ) చదివాడు. హాస్టల్ ఫీజులు చెల్లించే స్థోమత లేకపోవడంతో రాత్రివేళల్లో క్యాటరింగ్ సర్వీసుల్లో పనిచేస్తూ వచ్చిన ఆదాయంతోనే మూడు సంవత్సరాల పాటు తన చదువును కొనసాగించి డిగ్రీని విజయవంతంగా పూర్తి చేశాడు. ఇదిలా ఉండగా, అతని తల్లి ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో స్వగ్రామం లోనే జీవిస్తోంది. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఇంట్లో వంట చేసుకునే స్థితి కూడా లేక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వ ఉద్యోగమే తన జీవిత లక్ష్యంగా పెట్టుకున్న వినోద్ కుమార్, హైదరాబాద్‌లోని ఐఏసిఈ దిల్‌సుఖ్‌నగర్లో ఎస్ఎస్‌సీ కోచింగ్ తీసుకోవాలని నిర్ణయించాడు. కోచింగ్ ఫీజుగా రూ.25 వేల అవసరమని తెలిసిన నేపథ్యంలో సోషల్ రెస్పాన్సిబిలిటీ టీమ్ సభ్యులను ఆశ్రయించాడు. వినోద్ పరిస్థితిని తెలుసుకున్న సోషల్ రెస్పాన్సిబిలిటీ టీమ్ సభ్యులు అతని పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని అభినందిస్తూ రూ.25,000 విలువైన చెక్కును అందజేశారు. ఈ సహాయం అతని ప్రభుత్వ ఉద్యోగ సాధనలో కీలకంగా ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఈ చెక్కు అందజేత కార్యక్రమం గద్వాల్ పట్టణంలోని శృతివనం పార్క్, రాజీవ్ మార్గ్లో జరిగింది. ఈ కార్యక్రమంలో నాగమద్దిలేటి, మోహన్, బెంజావేను, సంజీవ్, నగేష్, రామన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకే ఇందిరమ్మ ఇల్లుగృహ నిర్మాణ శాఖ ఎం డి వి. పి గౌతమ్



**మహబూబ్ నగర్, ఆగస్టు 05(వుదయం ప్రతినిధి):** డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటించి నిజమైన అర్హులైన పేద కుటుంబాలకే ప్రాధాన్యం ఇవ్వాలని గృహ నిర్మాణ శాఖ ఎం.డి., కార్యదర్శి,ఎల్ నినో పై ప్రభుత్వం జిల్లా కు నియమించిన ప్రత్యేక అధికారి వి.పి. గౌతం ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఖాళీగా ఉంచకుండా వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని, రెండు పథకాల లబ్ధిదారుల జాబితాలను కృత్రిమ మేధ సాయంతో సరిపోల్చి ఒకే వ్యక్తికి రెండు పథకాల ప్రయోజనం అందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గృహనిర్మాణ, రెవెన్యూ,మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.పెండింగ్ లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్, రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరగాలని, ఇప్పటికీ పంపిణీ చేయకుండా పెండింగ్ లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ను, ఇప్పటికే గుర్తించిన డబుల్ బెడ్రూం అర్హుల జాబితాను 360 డిగ్రీ డాటా తో పరిశీలించి అనర్హులను తొలగించి అర్హులకు కేటాయించాలని గౌతమ్ సూచించారు. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, ఇతర తక్కువ వేతనాలతో పనిచేసే ప్రభుత్వ సేవల సిబ్బందిని కేవలం ఉద్యోగం ఆధారంగా అనర్హులుగా ప్రకటించరాదని, వారి కుటుంబ పరిస్థితులు, ఆదాయం, ఆస్తులను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి తిరస్కరణకు స్పష్టమైన కారణాలను నమోదు చేయాలని ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లను ఎక్కువకాలం ఖాళీగా ఉంచితే ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొంటూ,వెంటనే లబ్ధిదారులకు కేటాయించి విద్యుత్, తాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. కేటాయించిన ఇళ్లలో నివసించకుండా తాళాలు వేసి వేరే ప్రాంతాల్లో ఉంటున్న వారి వివరాలను పరిశీలించి అవసరమైతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, దీర్ఘకాలంగా వినియోగంలో లేని ఇళ్లను తిరిగి స్వాధీనం చేసుకుని అర్హులకు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ గృహాల లబ్ధిదారుల జాబితాలను కృత్రిమ మేధ ద్వారా సరిపోల్చాలని సూచించారు ఆధార్ నంబర్ లేకున్నా పేర్ల ఆధారంగా కూడా వివరాలను పోల్చి ఒకే వ్యక్తి రెండు జాబితాల్లో ఉన్నారా అనే విషయాన్ని గుర్తించాలని, సాంకేతికంగా ధృవీకరణ పూర్తైన తర్వాత నిర్భయంగా ఇళ్ల కేటాయింపు చేపట్టాలని అధికారులకు సూచించారు.

ఇందిరమ్మ గృహాల రెండో దశ అమలుపై సమీక్షిస్తూ గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలకు తప్పనిసరిగా తొలి ప్రాధాన్యం ఇవ్వాలని గౌతమ్ స్పష్టం చేశారు. రాజకీయాలు లేదా ఇతర అంశాలకు అతీతంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హుల ఎంపిక జరగాలని సూచించారు. కొత్త ఇళ్లు, రూఫ్ రీప్లేస్‌మెంట్‌కు అర్హులైన వారి వివరాలను ఒకే సమగ్ర ప్రతిపాదనగా సిద్ధం చేయాలని ఆదేశించారు.అంతకు ముందు గౌతమ్, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి ఏనుగొండలోని మౌలాలి గుట్టలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ గృహాలను సందర్శించి లబ్ధిదారుల నివాసం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై ప్రత్యక్షంగా ఆరా తీశారు. అక్కడ ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను గమనించిన ఆయన, వెంటనే లబ్ధిదారులను గుర్తించి వాటిని అర్హులైన వారికి అప్పగించాలని అన్నారు.

సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని,డి.ఆర్.ఓ ఎ. నిర్మల, ఆర్.డి.ఓ నవీన్, గృహనిర్మాణ శాఖ పి.డి. ఉపేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## డీపీఆర్వో చేతుల మీదుగా వు దయం రిపోర్టర్లకు అక్రిడిటేషన్ కార్డుల అందజేత



**సంగారెడ్డి వు దయం :** సంగారెడ్డి జిల్లాకు సంబంధించిన వుదయం దినపత్రిక మండల రిపోర్టర్లకు డీపీఆర్వో చేతుల మీదుగా అక్రిడిటేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా డీపీఆర్వో మాట్లాడుతూ ప్రతి మండల రిపోర్టర్ తమ పరిధిలో ప్రజలకు సంబంధించిన సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తదితర అంశాలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా బాధ్యతాయుతంగా వార్తలను ప్రచురించాలని, వాస్తవాలను నిర్ధారించుకుని వార్తా కథనాలను అందించాలని తెలిపారు. అక్రిడిటేషన్ కార్డులు పొందిన రిపోర్టర్లకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

## ఎడిటర్ చేతుల మీదుగా వు దయం రిపోర్టర్లకు అక్రిడిటేషన్ కార్డుల అందజేత









**సంగారెడ్డి, వుదయం :** సంగారెడ్డి జిల్లాకు సంబంధించిన వుదయం రిపోర్టర్లకు అక్రిడిటేషన్ కార్డులను ఎడిటర్ సిరి కొండ అగస్టిన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎడిటర్ మాట్లాడుతూ ప్రతి రిపోర్టర్ తమ పరిధిలో ప్రజా సమస్యలను గుర్తించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చేలా వార్తలను ప్రచురించాలని సూచించారు. ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా పనిచేస్తూ బాధ్యతాయుతమైన జర్నలిజాన్ని కొనసాగించాలని తెలిపారు.



## గాయకుడు రాజేందర్ రెడ్డి అందించిన కళా సేవలు చిరస్మరణీయం

**నారాయణపేట, ఆగస్టు 05 (వుదయం ప్రతినిధి):** గాయకుడు దివంగత రాజేందర్ రెడ్డి బాలకేంద్రంలో తబలా వాయిద్యా కారులుగా ఉంటూ తనవంతు గా ఎందరో చిన్నారుల్లో దాగి ఉన్న కళలను వెలికి తీసి తనవంతు గా చేసిన కృషి చిరస్మరణీయమని సీనియర్ శివ మాల దారణ సీనియర్ గురు స్వామి బండి గోపాల్ రెడ్డి, ఎస్పి బాలు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం రాజేందర్ రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బాలు అభిమానసంఘం బాలకేంద్ర సిబ్బంది ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళ్ళర్పించి ఆయన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నంగనర్సింహులు, వసంత్ కుమార్ ప్రభాకర్ రెడ్డి, అనంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు పట్టకపోతే శిశువుకు ముప్పే'



- నిర్లక్ష్యం వీడండి, దివ్యౌషధాన్ని అందించండి!
- వ్యాధులపై పోరాడే తొలి ఆయుధం అమృతధారే!
- అమరవాయిలో గర్జించిన అవగాహనా నినాదం..
- గర్భిణులు, బాలింతలకు హెచ్చరిక

**మానవపాడు, ఆగస్టు 05 (వుదయం కరస్పాండెంట్)** "శిశువుకు తల్లిపాలు పట్టకపోవడం అంటే బిడ్డ ప్రాణ రక్షణను ప్రమాదంలోకి నెట్టడమే. అది కేవలం పాలు ఇవ్వడం కాదు... ప్రాణనిధిని అందించడం!" అని అధికారులు తెగేసి చెప్పారు. అమృతధార లాంటి తల్లిపాలే నవజాత శిశువుకు తిరుగులేని శ్రీరామరక్ష అని, వ్యాధులపై పోరాడే తొలి ఆయుధమని ఘాటుగా స్పష్టం చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం అమరవాయి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన 'తల్లిపాల వారోత్సవాలు' గ్రామంలో తీవ్ర చైతన్యాన్ని రగిలించాయి. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన తొలి గంటలోనే అందించే ముర్రుపాలు ప్రకృతి ప్రసాదించిన తొలి టీకా అని, దానిని అందించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. మూఢనమ్మకాలతో ముర్రుపాలను వృథా చేస్తే శిశువు రోగనిరోధక వ్యవస్థను కోలుకోలేని దెబ్బతీసినట్లేనని స్పష్టం చేశారు. మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే పడితే ఏ వ్యాధీ బిడ్డ దరిచేరదని తేల్చిచెప్పారు.

**రక్తహీనతపై పోరు.. నిర్లక్ష్యం వహిస్తే ముప్ప తప్పదు:**


గర్భస్థ శిశువు ఎదుగుదల తల్లి తీసుకునే ఆహారంపైనే ఆధారపడి ఉంటుందని, రక్తహీనతను తేలిగ్గా తీసుకుంటే దారుణ ఫలితాలు ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న 'బాలామృతం'ను అలసత్వం వహించకుండా రోజూ వాడాలని, ఐరన్ మాత్రలను క్రమం తప్పక మింగాలని సూచించారు. అంగన్వాడీ, ఆరోగ్య శాఖ సిబ్బంది ఇచ్చే సలహాలను బేఖాతరు చేయకుండా పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవ, గ్రామ సర్పంచ్ పి. హుస్సేన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యాకూబ్, ఎంపీవో ప్రభాకర్, అంగన్వాడీ సూపర్వైజర్ రేణుక, హెల్త్ సూపర్వైజర్ అక్కమ్మ, గ్రామ కార్యదర్శి నాగరాజు, ఉప సర్పంచ్ బుచ్చన్న, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఏఎన్ఎం మాబి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీమంతం, అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమం



**మెదక్ జిల్లా వుదయం** నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం నిర్వహించడంతో పాటు ఐదేళ్ల చిన్నారులకు అక్షరాభ్యాసం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత, గర్భిణీల ఆరోగ్య సంరక్షణ, చిన్నారులకు సమతుల్య పోషకాహారం అందించాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు .ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొమ్మన మల్లేశం, ఉప సర్పంచ్ ఆకుల మహేందర్, గ్రామ కార్యదర్శి శ్యామల, అంగన్‌వాడీ టీచర్లు సునీత, భార్గవి, రాణి, ఏఎన్ఎంలు నిర్మల, సౌజన్య, ఆశా వర్కర్లు అనురాధ,దుర్గమణి, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్టీ గ్రేడ్–2 ఉద్యోగం సాధించిన విద్యార్థిని ఎం. వైష్ణవికి ఘన సన్మానం




**వనపర్తి ఆగస్టు 5 (వుదయం ప్రతినిధి)** ఎంఎల్టీ గ్రేడ్-2 ఉద్యోగం సాధించిన విద్యార్థిని ఎం. వైష్ణవికి ఘన సన్మానం వనపర్తి పీజీ సెంటర్, సూక్ష్మజీవశాస్త్ర (మైక్రోబయాలజీ) విభాగానికి చెందిన 2023-2025 మూడవ బ్యాచ్ విద్యార్థిని ఎం. వైష్ణవి ఇటీవల ,ఎంఎల్టీ (MLT) గ్రేడ్-2 ఉద్యోగాన్ని సాధించిన సందర్భంగా ఆమెకు ఘన సన్మానం నిర్వహించారు.మైక్రోబయాలజీ విభాగం చివరి సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు (Farewell) కార్యక్రమంసందర్భంగా ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉద్యోగం సాధించిన పూర్వ విద్యార్థిని విజయాన్ని ప్రస్తుత విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, పోటీ పరీక్షలు మరియు ఉద్యోగాల సాధన పట్ల ప్రోత్సాహాన్ని కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు మైక్రోబయాలజీ విభాగ అధ్యాపకులు *డా. ఎ. శివశంకర్*, డా. విజయ్‌కుమార్,డా. సంజీవ్ కుమార్ ఎం. వైష్ణవి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు.వారు మాట్లాడుతూ, ఎం. వైష్ణవి సాధించిన విజయం ప్రస్తుత విద్యార్థులకు ఆదర్శప్రాయమని, కృషి, పట్టుదలతో ప్రతి విద్యార్థి ఉన్నత ఉద్యోగాలను సాధించవచ్చని పేర్కొన్నారు. వైష్ణవి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ విభాగం మొదటి సంవత్సరం మరియు చివరి సంవత్సరం విద్యార్థులు పాల్గొని వైష్ణవికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమె విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని తాము కూడా ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తామని విద్యార్థులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.



# వర్ష కాలం పంటకు వెంటనే కోయిల్ సార్ నీళ్లు విడుదల చేయాలి

మరికల్ ఆగస్టు 5 (వుదయం ప్రతినిధి)

మరికల్ మండల కేంద్రంలోని బుధవారం రైతులకు వెంటనే వర్షా కాలం పంటకు కోయిల్ సార్ నీళ్లు విడుదల చేయాలని టిఆర్ఎస్ మండల నాయకుడు లంబాడి తిరుపతయ్య వి లేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులకు వర్షాకాలం సరిగా వర్షాలు పడలేక రెండు నెలలు కావస్తున్న పంటలు ఎండి పోతున్నావని మరియు మహారాష్ట్ర కర్ణాటక నుండి జూరాల ప్రాజెక్టుకు నీళ్లు విడుదల కావడంతో అవి కోయిల్ సాగర్ ప్రాజెక్టుకు విడుదలయ్య నీరు రైతులకు కాల్వ ద్వారా అందించాలని ఆయన డిమాండ్ చేశారు అధికారులు వెంటనే స్పందించి పంటకు నీటి విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి వై కృష్ణారెడ్డి వైస్ ఎంపీపీ రవికుమార్ మాజీ ఎంపిటిసి సుజాత శ్రీనివాసులు వార్డ్ మెంబర్ సూర్యునికి చంద్రశేఖర్ కానుగంటి నారాయణ వీరభసంతు మతిన్ సుధాకర్ గౌడ్ కొండారెడ్డి హుస్సేన్ బోయ రఘు తో పాటు టిఆర్ఎస్ కార్యకర్తలు ఈ సమావేశంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ఫీజుల దోపిడీకి చెక్.. యువతకు 'బండ్ల' కొండంత అభయం!



- ఉచితంగా పోలీస్ కోచింగ్.. 'బీకేఎంఆర్' సరికొత్త సమర శంఖారావం
- వాసవి కమ్యూనిటీ హాల్‌లో సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే
- "డబ్బు లేదని వెనుకంజ వేయొద్దు.. ఉద్యోగం కొట్టే వరకు వెనకడుగు వేయొద్దు"

గద్వాల ఆగస్టు 03 (వుదయం కరస్పాండెంట్)

లక్షలాది రూపాయలు ఉంటేనే కోచింగా? పేదలకు ప్రభుత్వ ఉద్యోగాలు దక్కకూడదా? ఆ వివక్షను తుడిచిపెట్టడానికే ఈ ఉచిత కోచింగ్ సెంటర్!" అని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆవేశపూరితంగా పేర్కొన్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుకు కొండంత అభయాన్ని ఇస్తూ 'బీకేఎంఆర్ స్టడీ సర్కిల్' ఆధ్వర్యంలో ఉచిత పోలీస్ కోచింగ్ సెంటర్‌ను బుధవారం గద్వాలలోని వాసవి కమ్యూనిటీ హాల్‌లో ఆయన అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక స్తోమత లేక హైదరాబాద్‌లో గదులు అద్దెకు తీసుకుని ఉండలేని గ్రామీణ అభ్యర్థుల ఆవేదనను చూసే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మహానగరాలకు ఏమాత్రం తీసిపోని రీతిలో సబ్జెక్ట్ నిపుణులతో అత్యుత్తమ శిక్షణ ఇప్పిస్తామని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత ఆయుధంగా మలుచుకుని, సర్కారీ కొలువును సాధించి తమ సత్తా ఏంటో సమాజానికి చాటాలని ఆకాంక్షించారు.

# బోనాల మహోత్సవాల్లో పాల్గొన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే గారు




(వుదయం హైదరాబాద్):

జూబ్లీహిల్స్ నియోజకవర్గం కళ్యాణ్ నగర్ లోని బి.ఆర్.సి.ఆర్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రాంగణంలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ వింధ్యవాసిని మాత దేవాలయంలో ఆషాఢ మాస బోనాల మహోత్సవాలు వైభవంగా నిర్వహించబడ్డాయి..ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని, తెలంగాణపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు..ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కళాశాల విద్యార్థిని, విద్యార్థులు, భక్తులు ఎమ్మెల్యే గారికి ఘన స్వాగతం పలికి సత్కరించారు..

# పెద్ద చింతరేవులలో దివ్య వైభవం

- ఆగస్టు 8 నుంచి సెప్టెంబర్ 25 వరకు అఖండ భక్తి క్రతువు.. నిత్యం ప్రవచనాలు, వైదిక హోమాలు, నిరతాన్నదానం!

ధరూర్ ఆగస్టు 05 (వుదయం బ్యూరో)



శతాబ్దాల నాటి పవిత్ర ఆధ్యాత్మిక సాంప్రదాయానికి, తుంగభద్రాకృష్ణ తీరాల భక్తి వైభవానికి నిలయమైన జోగులాంబ గద్వాల జిల్లా దరూర్ మండలం పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయస్వామి దివ్య క్షేత్రం అపూర్వ ఆధ్యాత్మిక ఘట్టానికి సిద్ధమైంది. ఆలయంలో 48వ చాతుర్మాస్య మహోత్సవాలు ఆగస్టు 8 నుంచి సెప్టెంబర్ 25 వరకు 48 రోజుల పాటు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సవ వాతావరణంలో జరగనున్నాయి. 18వ శతాబ్దానికి చెందిన ఈ పురాతన దివ్యధామంలో మధ్వ సంప్రదాయ మహోన్నత పీఠమైన ఉడిపి పలిమారు మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 1008 శ్రీ విద్యాధీశ తీర్థ శ్రీపాదులు, శ్రీశ్రీశ్రీ 1008 శ్రీ విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదుల దివ్య సమక్షంలో ఈ చాతుర్మాస్య దీక్షా కార్యక్రమాలు అత్యంత శాస్త్రోక్తంగా జరగనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు వెల్లడించారు.

**శాస్త్రోక్త పూజలు.. పీఠాధిపతుల అనుగ్రహ ప్రవచనాలు**

ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం పవిత్ర 'శ్రీమన్న్యాయసుధా' పాఠం, మఠం సంస్థాన పూజలతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అనంతరం పీఠాధిపతులు 'శ్రీరామాయణం', 'శ్రీమద్భాగవతం' పై భక్తులకు దివ్య ప్రవచనాలు అనుగ్రహించనున్నారు. స్వామివారికి నిత్య అభిషేకాలు, విశేష తమలపాకుల పూజలు, ఆర్చనలతో పాటు భక్తుల సంకల్ప నెరవేర్పు కోసం పవమాన హోమం, నవగ్రహ హోమం, సంపూర్ణ సేవ, తులాభార సేవ, పాదపూజ, తొట్టెల పూజల వంటి మహోన్నత క్రతువులు నిర్వహించ నున్నారు. అఖండంగా అన్నదాన సమారాధన ఈ 48 రోజుల అఖండ భక్తి యజ్ఞంలో భక్తజనం విశేష సంఖ్యలో పాల్గొని శ్రీ ఆంజనేయస్వామివారి కృపాకటాక్షాలు, పీఠాధిపతుల మంగళాశాసనాలు పొందాలని ఆలయ నిర్వాహకులు పిలుపునిచ్చారు. పూజలు, సేవల వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 9440807109, 9959251123, 9449934567, 9440770020

# అప్రమత్తతే సైబర్ నేరాలకు శ్రీరామరక్ష

- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS
- 'సురక్షా కా తిరంగా – సైబర్ స్వతంత్ర తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా తాండూర్ లో భారీ అవగాహన ర్యాలీ
- మోసపోతే వెంటనే 1930 కి కాల్ చేయండి:
- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

తాండూర్ ఆగస్టు 05 వుదయం ప్రతినిధి :-

సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత కాలంలో డిజిటల్ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS పిలుపునిచ్చారు.కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే "సైబర్ జాగ్రూక్త దివాస్", అలాగే తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (TGCSB) ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "సురక్షా కా తిరంగా - సైబర్ స్వతంత్ర తెలంగాణ" మాసోత్సవాలలో భాగంగా బుధవారం తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ముందుగా తాండూర్ చౌరస్తా నుండి సెయింట్ మార్క్ స్కూల్ వరకు విద్యార్థులు, పోలీసు అధికారులతో కలిసి జిల్లా ఎస్పీ భారీ సైబర్ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. అనంతరం సెయింట్ మార్క్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సభలో ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.



**ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ముఖ్య సందేశం:**

వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచండి: ఓటీపీ , బ్యాంక్ ఖాతా వివరాలు, ఎటిఎం పిన్ని , సీవ్ , యూపీఐ వంటి వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరితోనూ పంచుకోవద్దు.మోసపూరిత ఆఫర్లను నమ్మవద్దు: తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, నకిలీ పెట్టుబడి ఆఫర్లు, పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరుతో వచ్చే మెసేజ్ ల పట్ల జాగ్రత్తగా ఉండాలి.గోల్డెన్ అవర్ (గోల్డెన్ హౌర్ ) లో ఫిర్యాదు చేయండి: సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 ఉచిత హెల్ప్‌లైన్ నెంబర్‌కు కాల్ చేయాలి లేదా నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ (సైబరక్రైమ్ .గవర్నమెంట్ .ఇన్) లో ఫిర్యాదు నమోదు చేయాలి.

విద్యార్థుల పాత్ర కీలకం: విద్యార్థులు సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించుకొని తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు తెలియజేయాలి. ప్రతి పౌరుడూ బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరుడిగా వ్యవహరిస్తేనే "సైబర్ స్వతంత్ర తెలంగాణ" లక్ష్యం నెరవేరుతుంది.

"సైబర్ నేరాలు ఈనాడు ప్రతి కుటుంబాన్నీ ప్రభావితం చేస్తున్నాయి. డిజిటల్ లావాదేవీలు చేసే సమయంలో విద్యార్థులు, యువత, మహిళలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. పోలీసు శాఖ నిర్వహిస్తున్న ఇటువంటి అవగాహన కార్యక్రమాలు సమాజానికి ఎంతో ప్రయోజనకరం."

— నీరజ బాల్ రెడ్డి, తాండూర్ మున్సిపల్ ఛైర్మెన్

**హాజరైన ప్రముఖులు:**

ఈ కార్యక్రమంలో , వైస్ ఛైర్మెన్ అబ్దుల్ రజాక్, తాండూర్ డీఎస్పీ ఎన్. యాదయ్య, తాండూర్ సీఐ సీఐ పరమేశ్వర్, రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, డివిజన్ ఎస్సైలు యాలాల విట్టల్ రెడ్డి,, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పటాన్‌చెరు ప్రభుత్వ ఐటీఐలో జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా

- ఆగస్టు 11న నిర్వహణ – ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులకు సువర్ణావకాశం

పటాన్‌చెరు (వుదయం):

సంగారెడ్డి జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో పటాన్‌చెరులోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (Government ITI)లో జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ హెచ్. సుజన తెలిపారు.ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో, 2026 ఆగస్టు 11వ తేదీ (మంగళవారం) ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు ప్రభుత్వ ఐటీఐ, పటాన్‌చెరు ప్రాంగణంలో జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ మేళాలో ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు పలు ప్రముఖ ప్రైవేట్ కంపెనీలు పాల్గొని అర్హులైన అభ్యర్థులను అప్రెంటిస్‌షిప్‌కు ఎంపిక చేయనున్నాయి. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌లో ముందస్తుగా నమోదు చేసుకుని మేళాకు హాజరు




కావాలని సూచించారు.

**తీసుకురావాల్సిన పత్రాలు**

అభ్యర్థులు మేళాకు హాజరయ్యే సమయంలో ఈ క్రింది పత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలి.రెజ్యూమ్ / బయోడేటా అప్రెంటిస్‌షిప్ రిజిస్ట్రేషన్ కాపీ ఎస్ఎస్‌సీ, ఐటీఐ మెమోలు, ఎన్‌టీసీ సర్టిఫికెట్లు

ఆధార్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్ ప్రతులు

కుల ధృవీకరణ పత్రం

రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు

అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ప్రిన్సిపాల్ హెచ్. సుజన కోరారు.

మరిన్ని వివరాల కోసం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ హెచ్. సుజన లేదా రాష్ట్ర అప్రెంటిస్‌షిప్ సలహాదారు ఎన్. మధుసూదన్ రావును 9121797379, 9440068152 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# సైబర్ కేటుగాళ్ల మాయాజాలం.. వలలో పడితే నట్టేట మునకే!

- అమాయకత్వమే పెట్టుబడి.. అప్రమత్తతే తిరుగులేని ఆయుధం
- 'సురక్ష కా తిరంగా'తో దొంగల గుండెల్లో నిద్రపోవాలి: జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ టి. శ్రీనివాసరావు

గద్వాల, ఆగస్టు 05 (వుదయం బ్యూరో)




సాంకేతికత అందించే వెసులుబాటును ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు విరుచుకుపడుతున్నారని, రూపం మార్చి వస్తున్న డిజిటల్ దొంగలను తిప్పికొట్టడానికి ప్రజల అప్రమత్తతే అత్యంత శక్తిమంతమైన ఆయుధమని జోగులాంబ గద్వాల జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ టి. శ్రీనివాసరావు హెచ్చరించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో స్వతంత్ర మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సురక్ష కా తిరంగా -సైబర్ స్వతంత్ర తెలంగాణ' సమరంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్డీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన విస్తృత అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రచార రథాన్ని ప్రారంభించిన జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న కొద్దీ కేటుగాళ్లు సరికొత్త పద్ధతుల్లో అమాయకులకు వల విసురుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

**కేటుగాళ్లు పన్నుతున్న పద్మవ్యూహాలు ఇవే!**

**అధిక లాభాల ఆశ:**

వ్యాపార పెట్టుబడుల పేరిట తక్కువ కాలంలోనే కోట్లు సంపాదించవచ్చని నమ్మించి ముంచడం.

డిజిటల్ అరెస్ట్ భయం:

కేంద్రీయ దర్యాప్తు సంస్థలు, ఈడీ, పోలీసులమంటూ వర్చువల్ బెదిరింపులకు దిగి సొమ్ము లాక్కోవడం.

**నకిలీ యాప్‌ల వల:**

ఫోన్లకు నకిలీ ఏపీకే ఫైళ్లు పంపడం, ఆన్‌లైన్ లోన్ యాప్‌ల వేధింపులు, ఉద్యోగాల పేరుతో బోగస్ ఆఫర్లు ఇవ్వడం.

**సమాచారం చోరీ:**

రహస్య సంకేతాలు (ఓటీపీలు), వినియోగదారుల వివరాల (కేవైసీ) అప్‌డేట్ సాకులతో బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేయడం పరిపాటిగా మారిందన్నారు.

**గోల్డెన్ అవర్'లో స్పందిస్తే.. సొమ్ము భద్రం!**

అపరిచిత ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. వ్యక్తిగత సమాచారాన్ని, బ్యాంకింగ్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు. జీవితంలో ప్రతి ఒక్కరూ "ఆగు.. ఆలోచించు.. నిజం నిర్ధారించు.. సైబర్ భద్రత పెంచు" అనే సూత్రాన్ని విధిగా పాటించాలని పిలుపునిచ్చారు. ఒకవేళ సైబర్ మాయగాళ్ల ఉచ్చులో పడి మోసపోతే కాలయాపన చేయకుండా తక్షణమే 1930 ఉచిత హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాలని సూచించారు. మోసం జరిగిన వెంటనే ఆ క్షణంలోనే స్పందిస్తే బాధితులు పోగొట్టుకున్న సొమ్మును వెనక్కి తెప్పించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. 'సురక్ష కా తిరంగా' సందేశాన్ని ప్రతి ఇంటికీ చేరవేసి, సైబర్ నేర రహిత జోగులాంబ గద్వాల జిల్లాతో పాటు 'సైబర్ స్వతంత్ర తెలంగాణ' నిర్మాణంలో ప్రతి పౌరుడూ సైనికుడిలా మారాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో సైబర్ భద్రతా ప్రతిజ్ఞ చేయించారు.విద్యార్థులే చైతన్య రథసారథులు!కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. ఖలందర్ భాష మాట్లాడుతూ.. డిజిటల్ ప్రపంచంలో భద్రతగా ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులు సైబర్ అంశాలపై పట్టు సాధించి తమ కుటుంబ సభ్యులకు, గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించే చైతన్య రథసారథులుగా మారాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చంద్రమోహన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి. సురేందర్ రెడ్డి, గద్వాల సర్కిల్ ఇన్స్పెక్టర్ టంగుటూరి శ్రీను, పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ కళ్యాణ్ కుమార్, జిల్లా డి4సి విభాగ సిబ్బంది, అధ్యాపక బృందం మరియు వేలాదిగా విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇసుక 'అసురుల'పై పోలీసు దెబ్బ!

- పంచలింగాల సరిహద్దుల్లో 'మాఫియా' ఆటకట్టు
- రాత్రికి రాత్రే తుంగభద్ర ఖాళీ.. అక్రమ రవాణాపై 'అలంపూర్' మెరుపు దాడి!
- రెండు భారీ లారీలు సీజ్.. గ్యాంగ్‌పై కఠిన కేసులు

అలంపూర్, ఆగస్టు 05 (వుదయం కరస్పాండెంట్)



సరిహద్దు నిఘా కన్నుగప్పి.. సహజ వనరులను విచ్చలవిడిగా తోడేస్తూ, కోట్ల రూపాయలు కొల్లగొడుతున్న అక్రమ ఇసుక 'అసురుల'పై అలంపూర్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. రాత్రివేళల్లో చీకటి దందాలు నడుపుతూ, తుంగభద్ర తీరాన్ని గుల్ల చేస్తున్న ఇసుక మాఫియా నెట్‌వర్క్‌ను పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. కర్నూలు జిల్లా పంచలింగాల కేంద్రంగా రూపుదిద్దుకున్న ఈ అక్రమ సామ్రాజ్యం నుంచి అలంపూర్ మండలంలోని కాశాపురం, లింగనవాయి వైపు లారీలకు లారీలు తరలిపోతుండగా పోలీసులు మెరుపు దాడి చేసి, విరుచుకుపడ్డారు.

రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత! పక్కా సమాచారంతో వ్యూహం పన్నిన పోలీసులు, సరిహద్దు మార్గాలను దిగ్బంధించారు. ఎలాంటి వేబిల్లులు, ముందస్తు అనుమతులు లేకుండా అక్రమంగా ప్రవేశిస్తున్న రెండు భారీ ఇసుక లారీలను ముట్టడించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రూ.లక్షల విలువైన ఇసుకతో పాటు లారీలను స్వాధీనం చేసుకుని, ఈ దందాలో భాగస్వాములైన డ్రైవర్లు, యజమానులపై కఠిన చట్టపరమైన కేసులు నమోదు చేశారు.

ఇసుక దొంగల ఆటలు సాగనివ్వం: పోలీసుల తీవ్ర హెచ్చరిక ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ, సహజ సంపదను దోచుకునే అక్రమార్కులకు తావులేదని పోలీసులు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. సరిహద్దుల్లో నిఘా మరింత పెంచామని, చట్టాన్ని బొటన వేలి కింద తొక్కి వ్యాపారం చేస్తామంటే సహించేది లేదని స్పష్టం చేశారు. అక్రమ రవాణాకు పాల్పడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు, ఈ దందా వెనుక ఉన్న ఎంతటి 'పెద్దలైనా' సరే ఊచలు లెక్కించక తప్పదని హెచ్చరించారు. ఈ వ్యవహారంపై లోతైన దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

# భూసేకరణలో జాప్యానికి తావివ్వొద్దు

- కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్, ఆగస్టు 05 (వుదయం ప్రతినిధి) :

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణలో ఎదురవుతున్న ఆటంకాలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూసేకరణ పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పాలమూరురంగారెడ్డి, కల్వకుర్తి, డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలు, మిషన్ భగీరథ ప్రాజెక్టుల భూసేకరణ, అవార్డుల జారీ, పరిహారం చెల్లింపులపై సమీక్షించారు. పాలమూరురంగారెడ్డి పరిధిలో 51 ఎకరాల 10 గుంటలు, కల్వకుర్తిలో 200 ఎకరాలు, డిండిలో 186 ఎకరాలు, అచ్చంపేటలో 2,588 ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉందని అధికారులు వివరించారు. మిగిలిన భూసేకరణను వేగంగా పూర్తి



చేయాలని, రైతులకు జాప్యం లేకుండా పరిహారం చెల్లించాలని కలెక్టర్ ఆదేశించారు.భూసేకరణ పూర్తయితేనే ప్రాజెక్టు పనులు వేగం పుంజుకుంటాయని, జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి ఊతం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ చెన్నయ్య, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అరుణ రెడ్డి, మాధవి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు అశోక్, హర్షవర్ధన్, సాగునీటి ప్రాజెక్టుల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు అమర్ సింగ్, రాములు, కల్వకుర్తి ఆర్డీవో జనార్ధన్ రెడ్డి, కలెక్టరేట్ భూ సేకరణ సూపరింటెండెంట్ నారాయణ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ నేరాలపై అవగాహన

మెదక్ జిల్లా వుదయం

నిజాంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం స్థానిక ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో మండలంలోని సర్పంచ్ ఉప సర్పంచ్లు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు సెల్ ఫోన్ లలో ఓటిపి వివరాలు అడిగితే తెలియజేయవద్దన్నారు. ఆన్లైన్ మోసాలు జరిగినట్లయితే 1903 కి సమాచారం అందించాలని లేదా 100 కు కాల్ చేయాలన్నారు. గ్రామాలలో ఆన్లైన్ మోసాలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరికి గ్రామ సర్పంచులు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ మురళీధర్, ఏఈఓ శ్రీలత, రమ్య, సర్పంచులు భాను ప్రకాష్ రెడ్డి, బొమ్మే న మల్లేశం, నరేందర్, సుశీల, ఆకుల స్వప్న రమేష్, ఉప సర్పంచులు ఆకుల మహేందర్,దేవరాజ్, అనిల్, గెరిగంటి బాబు, సూర రాములు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# తాండూరులో ఘనంగా ఎమ్మెల్యే BMR జన్మదిన వేడుకలు

- వైట్ ప్యాలెస్‌లో కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే తనయులు శివారెడ్డి, అవినాష్ రెడ్డి
- అమెరికా పర్యటనలో ఉన్నా... నియోజకవర్గంలో మిన్నంటిన సంబరాలు
- భారీగా రక్తదానం, అన్నదాన కార్యక్రమాలు

తాండూరు ఆగస్టు 05 వుదయం ప్రతినిధి:-

తాండూరు నియోజకవర్గ శాసనసభ్యులు బుయ్యాని మనోహర్ రెడ్డి (BMR) జన్మదిన వేడుకలు పట్టణంలోని వైట్ ప్యాలెస్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో అత్యంత వైభవంగా, ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి.

ప్రస్తుతం ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డి గారు అమెరికా పర్యటనలో ఉన్నప్పటికీ, ఆయన గైర్హాజరీలో కూడా అభిమానం కొంచెమైనా తగ్గలేదు. ఎమ్మెల్యే తనయులు శివారెడ్డి, అవినాష్ రెడ్డిల ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వైట్ ప్యాలెస్‌కు భారీ సంఖ్యలో చేరుకుని కేక్ కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.సేవా కార్యక్రమాలతో హోరెత్తిన సంబరాలు:

ఎమ్మెల్యే బి.ఆర్.ఎమ్ జన్మదినాన్ని కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా, ఆయన ఆశయాలకు అనుగుణంగా భారీ సేవా కార్యక్రమాలు చేపట్టారు. రక్తదాన శిబిరం: అత్యవసర సమయాల్లో బాధితులకు ఉపయోగపడేలా నిర్వహించిన రక్తదాన శిబిరంలో అనేకమంది యూత్ కాంగ్రెస్ నాయకులు, యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు.అన్నదాన కార్యక్రమం: వేడుకలకు విచ్చేసిన వేలాది మంది కార్యకర్తలకు, అభిమానులకు మరియు పేదలకు బ్రహ్మాండమైన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే తనయులు శివారెడ్డి, అవినాష్ రెడ్డి మాట్లాడుతూ... "తాండూరు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న నాన్న బి. మనోహర్ రెడ్డి గారికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి. ఆయన అమెరికా పర్యటనలో ఉన్నా, వారి మార్గదర్శకంలో నియోజకవర్గంలో ప్రజలకు సేవలుఅందిస్తూనే ఉంటాం" అని పేర్కొన్నారు కార్యక్రమంలో తాండూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, తాండూరు పట్టణ కౌన్సిలర్లు ముఖ్య నాయకులు యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు




# విద్యా వాలంటీర్ల ఎంపికలో అక్రమాల 'విషాద' విద్య!

- నోటిఫికేషన్ కంటితుడుపు.. అర్హుల పొట్టకొట్టే 'గోప్య' క్రీడ!
- కలెక్టర్ మార్గదర్శకాలకు తూట్లు.. నిబంధనల విచ్ఛిన్నం!
- రాజకీయ బ్రోకర్లు, అధికారుల లాలూచీకి 'మెరిట్' బలి!
- ఇందువాసిలో 4 పోస్టుల 'దోపిడీ'పై తిరగబడ్డ నిరుద్యోగ సమరం!

గట్టు ఆగస్టు 05 (వుదయం బ్యూరో)

భావి భారత పౌరులను తీర్చిదిద్దాల్సిన బడుల్లో కొలువుల భర్తీ దందాగా మారింది! అర్హత ఉండి, పగలు రాత్రి కష్టపడి చదివిన నిరుద్యోగుల కలలను తొక్కిపెడుతూ.. నాయకుల కాళ్ల దగ్గర మోకరిల్లే 'సిఫార్సు' రాయుళ్లకు పీఠం వేసే కుట్రలు పరాకాష్టకు చేరాయి. జోగులాంబ గద్వాల్ జిల్లా గట్టు మండలం ఇందువాసి గ్రామంలో విద్యా వాలంటీర్ పోస్టుల భర్తీ ప్రక్రియ అధికారుల లంచగొండితనానికి, రాజకీయ నాయకుల అహంకారానికి నిలువుటద్దంగా మారింది.దొంగచాటు నోటిఫికేషన్లు.. చీకటి ఒప్పందాలు! గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పేందుకు నాలుగు విద్యా వాలంటీర్ పోస్టులు ఖాళీగా ఉంటే.. ఆ వివరాలను గ్రామంలో బహిరంగంగా ప్రచారం చేయాల్సిన బాధ్యతను విద్యాశాఖ గాలికి వదిలేసింది. గ్రామంలో ఏ ఒక్కరికీ సమాచారం తెలియకుండా, అత్యంత గోప్యంగా 'చీకటి ఒప్పందాలు' కుదుర్చుకుని ప్రక్రియను కానిచ్చేసేందుకు రంగం సిద్ధం చేశారు. సమాచారం లేక పదుల సంఖ్యలో అర్హులైన పేద యువతీ యువకులు దరఖాస్తు చేసుకునే హక్కును కూడా కోల్పోయారంటే అధికారుల నిర్వాకం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

**మెరిట్'ను పూడ్చిపెట్టి.. 'సిఫార్సుల'కే దండలు!**

విద్యార్హతలు, సాధించిన మెరిట్ మార్కులను బంగాళాఖాతంలో కలిపేసి.. కేవలం అధికార పార్టీ నాయకులు, అధికారుల జేబుల్లోని సిఫార్సు లేఖలకే పెద్దపీట వేస్తున్నారని స్థానిక యువత రగిలిపో తోంది. “గతంలో పనిచేసిన వారికే ఇస్తాం” అని అధికారులు బాహాటంగానే చెబుతూ, కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులకే తూట్లు పొడుస్తున్నారు. అని ప్రచారం సాగుతుండటం చూస్తుంటే, ఇది ఎంపికా? లేక నాయకుల ప్రాపకం కోసం చేస్తున్న వేలమా? అని నిరుద్యోగులు నిలదీ స్తున్నారు. కలెక్టర్ గారూ.. ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయరా? ఇందువాసి గ్రామంలో విద్యాశాఖ అధికారుల పాత్రపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు, కలెక్టర్ తక్షణమే స్పందించి ఈ బాహాట దోపిడీపై సమగ్ర విచారణ జరిపించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ఎంపిక ప్రక్రియ వివరాలు, మెరిట్ జాబితాను అందరికీ కనిపించేలా పారదర్శకంగా ప్రదర్శించాలని, రాజకీయం పక్కనపెట్టి నిజమైన అర్హులైన స్థానిక అభ్యర్థులకే న్యాయం చేయాలని లేదంటే ఉపాధి పోరాటాన్ని ఉధృతం చేస్తామని నిరుద్యోగ యువత హెచ్చరిస్తోంది.

# భూ భారతిపై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

నాగర్ కర్నూల్,ఆగస్టు 05 (వుదయం బ్యూరో)

భూ రికార్డుల్లో పారదర్శకత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి పోర్టల్ ద్వారా ప్రజలకు వేగవంతమైన, జవాబుదారీ సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్లకు భూ భారతి పోర్టల్ నిర్వహణ, దరఖాస్తుల పరిష్కారంపై ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సకాలంలో సేవలు అందించడం, భూ వివాదాలు తగ్గించడమే భూ భారతి లక్ష్యమన్నారు. పోర్టల్‌లోని 13 మాడ్యూళ్లపై పూర్తి అవగాహన పెంచుకోవాలని, లాగిన్ వివరాలను గోప్యంగా ఉంచాలని ఆదేశించారు.దరఖాస్తులను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని, ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చెన్నయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు అశోక్, హర్షవర్ధన్, ఆర్డీవో బన్సీలాల్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖరరెవెన్యూ అధికారులు, జిల్లా వ్యాప్తంగా జూనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



# చక్కని ఆరోగ్యం

## పులిపిర్లను తగ్గించే ఇంటి చిట్కాలు.. ఇలా చేస్తే సమస్య తగ్గుతుంది..



చర్మంపై కనిపించే చిన్న గుండ్రని లేదా అండాకార పెరుగుదలలను పులిపిర్లు (వార్ట్స్) అంటారు. ఇది వైరల్ ఇన్‌ఫెక్షన్ కారణంగా ఏర్పడే సాధారణ చర్మ సమస్య. సాధారణంగా నొప్పి ఉండకపోయినా, కొన్ని సందర్భాల్లో అసౌకర్యం లేదా నొప్పిని కలిగిస్తాయి. చేతులు, కాళ్లు, జననేంద్రియాలపై కూడా ఇవి కనిపించే అవకాశం ఉంటుంది. వైద్యులు అవసరాన్ని బట్టి శస్త్రచికిత్స లేదా క్రయోథెరపీ వంటి చికిత్సలను సూచిస్తారు. అయితే ప్రారంభ దశలో కొన్ని సహజ పదార్థాలను ఉపయోగించడం వల్ల కొంతమందికి ఉపశమనం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అలోవెరా (కలబంద) జెల్‌ను నేరుగా పులిపిర్లపై రాయడం వల్ల ప్రయోజనం కలుగుతుందని పేర్కొంటున్నారు. కలబందలో ఉండే మాలిక్ యాసిడ్ చర్మాన్ని పునరుద్ధరించడంలో, వార్ట్‌లను క్రమంగా తగ్గించడంలో సహాయపడుతుంది. బేకింగ్ పౌడర్‌ను ఆముదం నూనెతో కలిపి పేస్ట్‌లా తయారు చేసి రాత్రి సమయంలో వార్ట్‌లపై రాసి, బ్యాండేజ్‌తో కప్పాలి. ఇలా ప్రతిరోజూ చేయడం వల్ల వార్ట్ లు క్రమంగా తగ్గే అవకాశం ఉంటుంది.

యాపిల్ సైడర్ వెనిగర్‌లో ఉండే అసిటిక్ యాసిడ్ వార్ట్ ల కణజాలాన్ని క్రమంగా దెబ్బతీయడంలో సహాయపడుతుంది. కాటన్‌ను వెనిగర్‌లో ముంచి వార్ట్‌లపై ఉంచి, అతికే బ్యాండేజ్‌తో రాత్రంతా అలాగే ఉంచాలి. అరటి తొక్కలో ఉండే ఎంజైమ్‌లు చర్మాన్ని పునరుత్తేజపరచడంలో సహాయపడతాయి. అలాగే ఇందులో యాంటీ మైక్రోబియల్ గుణాలు కూడా ఉంటాయి. ప్రతిరోజూ కొన్ని నిమిషాల పాటు అరటి తొక్క లోపలి భాగంతో వార్ట్‌లపై నెమ్మదిగా రుద్దడం వల్ల ప్రయోజనం కలుగుతుంది. వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ అనే పదార్థం శక్తివంతమైన యాంటీ మైక్రోబియల్ గుణాలను కలిగి ఉంటుంది. ఇది బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, వైరస్‌లపై ప్రభావం చూపుతుంది. కొన్ని వెల్లుల్లి రెబ్బలను దంచి వార్ట్‌లపై రాయడం వల్ల వైరల్ ఇన్‌ఫెక్షన్ తగ్గడంలో సహాయపడతాయి. వెల్లుల్లిని ఆహారంలో భాగంగా తీసుకోవడం కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

పసుపును కొద్దిగా నీటితో కలిపి పేస్ట్‌లా చేసి వార్ట్‌లపై రాసి సుమారు అరగంట తర్వాత కడిగేయాలి. పసుపులో ఉండే యాంటీ మైక్రోబియల్ గుణాలు ఇన్‌ఫెక్షన్‌ను తగ్గించడంలో, వార్ట్‌లను తొలగించడంలో సహాయపడతాయి. పసుపు వల్ల చర్మంపై ఏర్పడే పసుపు రంగును నిమ్మకాయ ముక్కతో నెమ్మదిగా రుద్ది తొలగించవచ్చు. లవంగ నూనెను వార్ట్‌లపై రాసి బ్యాండ్ ఎయిడ్‌తో కప్పాలి. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల వార్ట్ లు తగ్గే అవకాశం ఉంటుంది. లవంగ నూనెలో ఉండే యూజెనిన్ అనే సమ్మేళనం యాంటీ వైరల్ గుణాలను కలిగి ఉండి వైరస్ వ్యాప్తిని నిరోధించడంలో సహాయపడుతుంది. అయితే వార్ట్స్ పరిమాణం పెరగడం, నొప్పి, రక్తస్రావం లేదా జననేంద్రియాలపై కనిపించడం వంటి పరిస్థితుల్లో ఇంటి చిట్కాలపై మాత్రమే ఆధారపడకుండా చర్మవ్యాధి నిపుణులను సంప్రదించడం అవసరం.

## స్లీప్ హైజీన్ పాటించండి

పాటించండి

నిద్రలో ఉన్నప్పుడు మెదడులో, శరీరంలో అనేక జీవ రసాయన ప్రక్రియలు జరుగుతాయి. ఈ చర్యలు ఎదుగుదలను, శరీర అవయవాల నియంత్రణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. భావోద్వేగాలను నిద్ర ప్రభావితం చేస్తుంది. జ్ఞాపకశక్తిని, నేర్చుకునే సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది. నిద్రలో ఉన్నప్పుడు మెదడులో, శరీరంలో అనేక జీవ రసాయన ప్రక్రియలు జరుగుతాయి. ఈ చర్యలు ఎదుగుదలను, శరీర అవయవాల నియంత్రణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. భావో

నిద్రలో ఉన్నప్పుడు మెదడులో, శరీరంలో అనేక జీవ రసాయన ప్రక్రియలు జరుగుతాయి. ఈ చర్యలు ఎదుగుదలను,

శరీర అవయవాల నియంత్రణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. భావోద్వేగాలను నిద్ర ప్రభావితం చేస్తుంది. జ్ఞాపకశక్తిని, నేర్చుకునే సామ

ద్వేగాలను నిద్ర ప్రభావితం చేస్తుంది. జ్ఞాపకశక్తిని, నేర్చుకునే సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది. నేర్చుకున్నవన్నీ మెదడు సరిగా అర్థం చేసుకుని జ్ఞాపకంగా నమోదు చేసుకుంటుంది. వయసుకు తగ్గట్టుగా నిద్ర లేకపోతే.. నిద్రలో జరిగే ప్రక్రియలన్నీ సజావుగా సాగవు. పిల్లలు ఎక్కువ సమయం, పెద్దలు తక్కువ సమయం నిద్రపోతారు. సంవత్సరంలోపు పిల్లలు రోజులో పన్నెండు నుంచి పదహారు గంటలు నిద్రపోతారు. రెండు నుంచి అయిదేళ్ల లోపు పిల్లలు పదకొండు గంటలు, ఆరు నుంచి పన్నెండేళ్ల మధ్య వయసు పిల్లలు తొమ్మిది నుంచి పది గంటలు నిద్రపోతారు. ఆపై వయసు వాళ్లు రోజుకు ఎనిమిది గంటలు నిద్రపోతే సరిపోతుంది. ఒకే వయసు పిల్లలందరూ కచ్చితంగా ఒకే సమయం నిద్రపోరు. కొంత తేడా ఉంటుంది. నిద్ర సరిపోకపోతే మత్తుగా ఉంటుంది. అప్రమత్తత ఉండదు. జ్ఞాపకశక్తి తక్కువగా ఉంటుంది. హైపర్‌యాక్టివ్‌గా ఉంటారు. చేయకూడదనే పనులు చేస్తుంటారు. కొంతమంది అనారోగ్య సమస్యల వల్ల నిద్ర సమస్యలు ఎదుర్కొంటారు. నిద్రపోవాలని ఉన్నా ఒక్కోసారి టాన్సిల్స్ పెద్దగా ఉండి ఇబ్బంది పెడతాయి. గురక పెడతారు. కొంతమంది పిల్లలు నిద్రలో ఉలిక్కిపడి లేస్తారు. హారర్ సినిమాలు, కలవరపెట్టే వీడియోలు చూస్తే ఇలా నిద్రాభంగం అవుతుంది. చెడు కలల వల్ల గాఢమైన నిద్రలోకి జారుకోరు. స్లీప్ క్వాలిటీ తగ్గకుండా ఉండాలంటే 'స్లీప్ హైజీన్' మెయింటెయిన్ చేయాలి.



ర్థ్యాన్ని పెంపొందిస్తుంది. నేర్చుకున్నవన్నీ మెదడు సరిగా అర్థం చేసుకుని జ్ఞాపకంగా నమోదు చేసుకుంటుంది. వయసుకు తగ్గట్టుగా నిద్ర లేకపోతే.. నిద్రలో జరిగే ప్రక్రియలన్నీ సజావుగా సాగవు. స్లీప్ హైజీన్

## సూర్యకాంతి మంచి నిద్రకు మార్గమా?



ఉదయపు కాంతి మనల్ని మేల్కొలుపుతుందనే తెలుసు. కానీ నిద్ర పుచ్చుతుందని కూడా విన్నారా... కానీ సరికొత్త విషయాన్ని ఇటీవలి శాస్త్రవేత్తలు కనిపెట్టారు. చక్కటి వెలుతురు శరీరాన్ని తాకడం అన్నది మంచి నిద్రకు బాటలు వేస్తుందని వాళ్లు చెబుతున్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం, వ్యాయామం, మందులు మాత్రమే సరిపోవని... ప్రకృతి ప్రసాదించే వెలుతురూ అంతే ముఖ్యమని తాజా వైద్య పరిశోధనలు సూచిస్తున్నాయి. ఉదయం నిద్రలేచిన తర్వాత కొద్దిసేపు సహజ సూర్యకాంతిలో గడిపితే శరీరంలోని జీవ గడియారం సక్రమంగా పనిచేసి, రాత్రి నిద్ర నాణ్యత మెరుగుపడే అవకా శం ఉందట. ఇటీవల మాంచెస్టర్ విశ్వవిద్యాలయం పరిశోధకులు ఓ అధ్యయనంలో భాగంగా 89 మంది పెద్దలను పరిశీలించారు. వాళ్లు ధరించిన ప్రత్యేక పరికరాల ద్వారా రోజంతా ఎంత సహజ కాంతి అందుతోందో, రాత్రి ఎంతసేపు, ఎంత ప్రశాంతంగా నిద్రపోతున్నారో నమోదు చేశారు. పగటి వేళల్లో ఎకువసేపు సహజ వెలుతురులో గడిపినవారిలో నిద్ర నాణ్యత మెరుగ్గా ఉండటమే కాకుండా, మేలొన్న తర్వాత ఎక్కువ ఉత్సాహంగా కూడా కనిపించినట్లు పరిశోధకులు వెల్లడించారు.

ఇదే అంశం మీద మరో పరిశోధనలో భాగంగా, హాంకాంగ్ పాలిటెక్నిక్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు కొంతమంది విద్యార్థులను పరిశీలించారు. ఉదయం సహజ కాంతిలో కొంతసేపు గడిపిన వారిలో ఏకాగ్రత, చురుకుదనం, రాత్రి నిద్రలో మెరుగుదల కనిపించినట్లు వీళ్లు గుర్తించారు. అయితే ఈ ఫలితాలను మరింత పెద్ద సంఖ్యలో ప్రజలపై పరీక్షించి నిర్ధారించాల్సి ఉందని కూడా వీళ్లు స్పష్టం చేస్తు న్నారు. కాబట్టి నిద్రలేచిన వెంటనే మొబైల్ తెరవడం కంటే, ఇంటి ముంగిట ఓ పది నుంచి ఇరవై నిమిషాలు సహజ సూర్యకాంతిలో గడపడం మంచి విషయం అన్న మాట!


## పింక్ నాయిస్‌తో మనసుకి ఊరట!

ఒకప్పుడు చినుకులు పడుతోంటే పిల్లలతో పాటు మనమూ వాటిల్లో తడుస్తూ సరదాగా ఆడి పాడేవాళ్లం. మరిప్పుడో ఇంటి పనులు.. ఆఫీస్ డెడ్‌లైన్లు.. పిల్లల బాధ్యతతో రోజూ కాలంతోపాటు పరుగులు పెడుతూ ప్రకృతిని ఆస్వాదించడమే మర్చిపోతున్నాం. కాస్త తీరిక దొరికితే... చేతిలోకి ఫోన్ తీసుకుని స్క్రీన్లకు అతుక్కుపోతున్నాం. కానీ, తొలకరి చినుకుల నుంచే వచ్చే శబ్దం, మట్టి సువాసన మనసుకి చెప్పలేని హాయిని ఇస్తాయని చెబుతున్నారు నిపుణులు. వర్షం వాతావరణంలో వచ్చే మార్పు మాత్రమే కాదంటున్నారు. మన మెదడుకూ, శరీరానికీ సహజథెరపీగా పని చేస్తుందట. అంతేకాదు, బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు. వాన పడుతున్నప్పుడు వచ్చే ఆ చినుకుల శబ్దాన్ని సైన్స్‌లో 'పింక్ నాయిస్' అని పిలుస్తున్నారు. ఇది మెదడులో ప్రతికూల ఆలోచనల్ని తగ్గించి ప్రశాంతతను ఇస్తుంది. చినుకుల నుంచి సహజ ధ్వని తరంగాలు మన నాడీ వ్యవస్థను శాంతపరచి, ఆందోళనను తగ్గిస్తాయట. అంతేకాదు, వర్షం పడుతున్నప్పుడు వెలుతురు తగ్గి, మన శరీరంలో నిద్రను ప్రేరేపించే మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి పెరుగుతుంది. అది త్వరగా నిద్రలోకి జారుకునేలా చేస్తుంది. సాధారణ రోజులతో పోలిస్తే వర్షం పడే సమయంలో చినుకుల సవ్వడికి మన మెదడు మరింత ఏకాగ్రతతో పనిచేస్తుంది. దాంతో పనులు వేగంగా పూర్తిచేస్తామట. వానాకాలంలో తగ్గే ఉష్ణోగ్రతలకు తగ్గట్టుగా శరీరాన్ని సిద్ధం చేయడానికి జీవక్రియను కాస్త వేగవంతం చేస్తుందట. ఇది శరీరంలో కొత్త ఉత్సాహాన్నీ, శక్తినీ తీసుకొస్తుంది. అందుకే ఇకపై ఎప్పుడైనా ఒత్తిడి, అలసటగా అనిపిస్తే... పనులన్నీ పక్కన పెట్టేసి కిటికీ పక్కనో, బాల్కనీలోనో కూర్చుని పడుతున్న వర్షపు చినుకుల్ని చూస్తూ వాటి సంగీతాన్ని ఆస్వాదించండి. మీ ఒత్తిడి మొత్తం చిటికెలో మాయం అయిపోతుంది.



## వయస్సు పెరుగుతున్న కొద్దీ చర్మంపై కనిపించే ముడతలను ఇలా తగ్గించుకోండి

వయసు పెరుగుతున్న కొద్దీ చర్మంపై ముడతలు కనిపించడం సహజం. అయితే కేవలం వయసే కాదు, చర్మంలో తేమ తగ్గడం, స్థితిస్థాపకత (ఎలాస్టిసిటీ) కోల్పోవడం, అధిక సూర్యరశ్మి, కాలుష్యం, ధూమపానం, అలాగే పోషకాహార లోపాలు కూడా ముడతలు త్వరగా రావడానికి కారణమవుతాయి. చాలా మంది వీటిని తగ్గించేందుకు ఖరీదైన యాంటీ ఏజింగ్ క్రీములను ఉపయోగిస్తుంటారు. అయితే ఇంట్లోనే లభించే కొన్ని సహజ పదార్థాలతో కూడా చర్మ సంరక్షణ చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అదే సమయంలో సమతుల్యమైన ఆహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం కూడా ఎంతో ముఖ్యమని చెబుతున్నారు. మొట్టమొదటగా గుడ్డు తెల్లసొనను ఉపయోగించవచ్చు. ఒక గిన్నెలో గుడ్డు తెల్లసొనను బాగా గిలక్కొట్టి నేరుగా ముఖంపై రాసి, మృదువుగా మసాజ్ చేయాలి. సుమారు 15 నిమిషాలు లేదా పూర్తిగా ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇందులో ఉండే ప్రోటీన్, విటమిన్ బి, విటమిన్ ఇ చర్మాన్ని పోషించి ముడతలను తగ్గించడంలో సహాయపడతాయి. ఆలివ్ ఆయిల్ కూడా చర్మానికి మంచి సహజ మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. రాత్రి నిద్రపోయే ముందు కొన్ని చుక్కల ఆలివ్ ఆయిల్‌ను ముఖంపై మృదువుగా మసాజ్ చేసి, అదనంగా ఉన్న నూనెను మృదువైన వస్త్రంతో తుడవాలి. ఇలా చేయడం వల్ల ఉదయానికి చర్మం మరింత మృదువుగా, తేమతో కనిపించే అవకాశం ఉంటుంది. నిమ్మరసంలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. కొద్దిగా నిమ్మరసాన్ని ముడతలు ఉన్న ప్రాంతాల్లో రాసి సున్నితంగా మసాజ్ చేయవచ్చు. ఇది చర్మాన్ని కాంతివంతంగా కనిపించేలా చేయడంలో తోడ్పడుతుంది. అయితే నిమ్మరసం ఆమ్ల గుణాలు కలిగి ఉండటంతో ఎక్కువగా లేదా తరచూ ఉపయోగించకుండా జాగ్రత్త వహించాలి. అలోవెరా జెల్‌లో ఉండే మాలిక్ యాసిడ్ చర్మ స్థితిస్థాపకతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. తాజా అలోవెరా ఆకులోని జెల్‌ను తీసి ముఖంపై రాసి 15 నిమిషాల తర్వాత కడిగేయాలి. లేదా విటమిన్ ఇ ఆయిల్‌తో కలిపి కూడా ఉపయోగించవచ్చు. అరటిపండులోని పోషకాలు కూడా చర్మానికి మేలు చేస్తాయి. రెండు అరటిపండ్లను మెత్తగా మెదిపి పేస్ట్‌లా చేసి ముఖంపై రాసి సుమారు అరగంట తర్వాత కడిగేయాలి. కావాలంటే తేనె, అవకాడోతో కలిపి కూడా ఉపయోగించవచ్చు. క్యారెట్‌లో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తికి తోడ్పడి చర్మాన్ని మృదువుగా ఉంచడంలో సహాయపడుతుంది. ఉడికించిన క్యారెట్‌ను తేనెతో కలిపి పేస్ట్ చేసి ముఖానికి పట్టించి అరగంట తర్వాత కడిగేయాలి. అలాగే క్యారెట్‌ను నేరుగా ఆహారంగా తీసుకోవడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. అనాసపండులో ఉండే ఎంజైములు చర్మానికి తేమను అందించడంతో పాటు చనిపోయిన కణాలను తొలగించడంలో సహాయపడతాయి. అనాసపండు ముక్కను నేరుగా ముఖంపై రుద్ది 20 నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగేయాలి. చర్మ ఆరోగ్యానికి అత్యంత సులభమైన మార్గం తగినంత నీరు తాగడం. రోజుకు కనీసం రెండు లీటర్ల నీరు తాగడం వల్ల శరీరం, చర్మం తేమను నిల్వ చేసుకోవడానికి సహాయపడుతుంది. దీంతో చర్మం తాజాగా, ఆరోగ్యంగా కనిపించే అవకాశాలు మెరుగుపడతాయి.



## జాజికాయ... మంచి ఔషధం!




మన వంటింట్లో ఉండే మసాలా దినుసుల్లో జాజికాయ తప్పక ఉంటుంది కదా! ఇది వంటలకి రుచినీ సువాసననీ ఇవ్వడమే కాదు, మానసిక ఆరోగ్యానికీ, శారీరక దృఢత్వానికీ మేలుచేస్తుందని తెలుసా! దీనిలో ఉండే యూజినాల్ నొప్పి నివారిణిగా పనిచేస్తుంది. రెండు మూడు చుక్కల జాజికాయ ఎసెన్షియల్ ఆయిల్‌ను ఒక టేబుల్ స్పూన్ కొబ్బరి లేదా నువ్వుల నూనెతో కలిపి కొద్దిగా వేడి చేయాలి. దాన్ని నొప్పి ఉన్న చోట మర్దన చేస్తే కండరాల నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం దొరుకుతుంది. రోజువారీ వంటల్లో దీన్ని భాగం చేయడం వల్ల ఆహారం త్వరగా జీర్ణం అవుతుంది. కడుపు ఉబ్బరం, మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. దీంట్లో ఉండే ప్రీబయాటిక్ గుణాలు కడుపులో మంచి బ్యాక్టీరియాను పెంచి జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తాయి. అంతేకాదు, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ మైక్రోబియల్ గుణాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. రాత్రి నిద్రపోయే ముందు చిటికెడు జాజికాయ పొడిని గోరువెచ్చని పాలు లేదా చామంతి టీలో తేనెతో కలిపి తీసుకుంటే నరాలకు సాంత్వన కలుగుతుంది. ఒత్తిడి, ఆందోళనలు తగ్గి మంచి నిద్ర పడుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో కణాలు దెబ్బతినకుండా కాపాడి, వృద్ధాప్య ఛాయల్ని తగ్గిస్తాయి.

## జుట్టు రాలుతోందా?

జుట్టు విపరీతంగా రాలిపోవడం అనేది ఈ మధ్య చాలామంది అమ్మాయిలు ఎదుర్కొంటోన్న సమస్య. వయసుతో సంబంధం లేకుండా ఎంతోమందిని ఈ సమస్య వేధిస్తోంది. ఈ క్రమంలో– కొన్ని చిట్కాల ద్వారా ఈ సమస్యను నివారించవచ్చంటున్నారు నిపుణులు.

కప్పు ఆముదం నూనెలో టీస్పూన్ రోజ్‌మేరీ నూనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక గ్లాస్ జార్‌లో భద్రపరచుకోవాలి. రోజూ రాత్రి పడుకునే ముందు ఈ నూనెను కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి కాసేపు మర్దన చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తున్నట్లయితే జుట్టు రాలిపోయే సమస్య తగ్గుముఖం పడుతుంది అంటున్నారు నిపుణులు. అంతేకాదు.. జుట్టు ఒత్తుగా పెరిగేందుకూ ఈ నూనె తోడ్పడుతుందట.

గరుకుగా, గడ్డిలా మారిన జుట్టును రిపేర్ చేయడానికి కండిషనర్ చక్కగా ఉపయోగపడుతుంది. అయితే ఇందుకోసం బయట దొరికేవి కాకుండా మన వంటింట్లో ఉండే కొబ్బరి పాలను ఉపయోగిస్తే ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో కొన్ని కొబ్బరి పాలలో కొద్దిగా ఆర్గన్ ఆయిల్ వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి.. షవర్ క్యాప్ పెట్టుకోవాలి. తర్వాత షాంపూ చేసుకుంటే జుట్టు మృదువుగా మారుతుందని చెబుతున్నారు.

అలాగే కొబ్బరి నూనెను కాస్త వేడి చేసి.. పడుకునే ముందు కుదుళ్లు, జుట్టుకు పట్టించాలి. కాసేపు కుదుళ్లను మర్దన చేసి షవర్ క్యాప్ పెట్టుకోవాలి. మరుసటి రోజు ఉదయం గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు.



## ఈపీఎఫ్ఓ 'ఈఆఫీస్' నేడు పనిచేయదా..? క్లారిటీ ఇచ్చిన సంస్థ



ఉద్యోగ భవిష్యనిధి సంస్థ (EPFO)కు చెందిన ఈ–ఆఫీస్ యాప్, ఉమాంగ్ యాప్ (UMANG app)లో క్లెయిమ్ ప్రాసెసింగ్ సేవలు బుధవారం అందుబాటులో ఉండవంటూ సోషల్ మీడియాలో ఒక పోస్టు వైరల్ అవుతోంది. సిస్టమ్ అప్‌గ్రేడేషన్‌లో భాగంగా ఈ సేవలు నిలిచి పోతాయని దాని సారాంశం. ఆ ప్రచారాన్ని ఈపీఎఫ్ఓ తోసిపుచ్చింది. తాము ఎలాంటి సర్వీసులు నిలిపివేయడం లేదని, సిస్టమ్ అప్‌గ్రేడ్ కోసం అడ్వైజరీని జారీ చేయలేదని స్పష్టం చేసింది (Fact Check). ఇవన్నీ నకిలీ వార్తలని వెల్లడించింది. ఈపీఎఫ్ఓ చందాదారులు సోషల్ మీడియాలో వచ్చే ఈ తరహా సందేశాలపై ఆధారపడకుండా.. సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌పై ఆధారపడాలని సూచించింది.




# స్వల్ప లాభాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప లాభాల్లో ముగిశాయి (stock market). పశ్చిమాసియాలో ప్రతికూల పరిస్థితులు, చమురు ధరలు పెరగడం మార్కెట్‌పై ప్రభావం పడింది. మరోవైపు, ఆర్‌బీఐ రెపో రేటు 5.25 శాతం వద్దే యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించడంతో మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్ ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దీంతో లాభనష్టాల్లో ఊగిసలాడిన సూచీలు ఆఖర్లో కొలుకుని లాభాల్లో ముగిశాయి.

ఉదయం సెన్సెక్స్ 79,055.38 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,428.95) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 79,055.38 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకొని 78,285.74 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరికి సెన్సెక్స్ 152.05 పాయింట్లు లాభపడి 78,581 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 9.75 పాయింట్లు పెరిగి 24,624.65 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.13 వద్ద ఉంది.

సెన్సెక్స్ 30లో అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్టీపీసీ, ఎస్‌బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండిగో, కోటక్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టీసీఎస్, హెచ్‌సీఎల్‌టెక్, రిలయన్స్, బీఈఎల్, సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 80.69 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,152.30 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## వడ్డీరేట్లు యథాతథం



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ (RBI) గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది నాలుగోసారి కావడం గమనార్హం.

ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్, జూన్‌లో జరిగిన సమీక్షల్లోనూ వడ్డీ రేట్లను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది.

పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హర్మూజ్‌లో నౌకల రాకపోకలకు అంతరాయాలు కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. దాంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సవాళ్లు ఎదురవుతూనే ఉన్నాయి. అయితే బలమైన డిమాండ్ ఆర్థిక వృద్ధికి మద్దతు ఇస్తోంది. చమురు, ఆహారధాన్యాల అధిక ధరల కారణంగా ద్రవ్యోల్బణం పెరగనుంది. మూడో త్రైమాసికంలో గరిష్ఠస్థాయికి చేరి, తర్వాత నుంచి కాస్త దిగిరానుంది.

ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో అంచనా వేసిన దానికంటే భారత ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా ఉంది. అయితే, పశ్చిమాసియాలో మళ్లీ మొదలైన ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్లలోని అస్థిరతలు, ఎల్‌నినో ఎఫెక్ట్.. వృద్ధికి ముప్పుగా మారే అవకాశం ఉంది.

2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీడీపీ వృద్ధి అంచనాను 6.6 శాతం నుంచి 6.7 శాతానికి పెంచుతున్నాం.

రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను 5.1 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాం. కేంద్ర బ్యాంకింగ్ వ్యవస్థలో తగినంత ద్రవ్య లభ్యత ఉంది.

## బంగారానికి వ్యూహాత్మక ఖనిజ హోదా!



బంగారాన్ని వ్యూహాత్మక ఖనిజంగా వర్గీకరించాలని ప్రభుత్వానికి ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) విజ్ఞప్తి చేసింది. అపుడే దేశీయంగా బంగారు గనుల తవ్వకానికి మద్దతు లభిస్తుందని, దిగుమతులపై ఆధారపడడం తగ్గుతుందని వివరించింది. హోదా ఇవ్వడం వల్ల..

పసిడి తవ్వకానికి ఏకగవాక్ష అనుమతుల వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది. అపుడు గనుల కంపెనీలు కేంద్రం నుంచి అనుమతులు పొందడం సులువవుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఇతర అనుమతులు పొందాల్సిన అవసరం కంపెనీలకు ఉండదని డబ్ల్యూజీసీ ప్రాంతీయ సీఈఓ(భారత్) సచిన్ జైన్ పేర్కొన్నారు. గనుల మంత్రిత్వ శాఖతో జరిగిన చర్చల్లో ఈ విషయాన్ని ప్రస్తావించామని జైన్ పేర్కొన్నారు. 'పసిడికి ఈ హోదా లభిస్తే, దేశంలో ఎక్కడైనా తమ గని ఏర్పాటు చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఏకగవాక్ష పద్ధతిలో అనుమతులు పొందడానికి కంపెనీలకు వీలవుతుంద'ని జైన్ వెల్లడించారు. ప్రస్తుతం బంగారం కోసం విదేశాలపై ఆధారపడుతున్నామని, విదేశీ మారకపు ద్రవ్యాన్ని కాపాడుకోవడానికి, పసిడి కొనుగోళ్లు తగ్గించాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు పిలుపునివ్వడాన్ని ప్రస్తావించారు. దేశీయ గనుల ద్వారా, 2047 కల్లా భారత వార్షిక పసిడి గిరాకీలో 10–15 శాతాన్ని పొందాల్సిన అవసరం ఉందని 'స్వర్ణిమ్ ఉడాన్ 2047' నివేదికలో డబ్ల్యూజీసీ పేర్కొంది. భారత్‌లోని ఇళ్లలో వృథాగా ఉన్న బంగారాన్ని నగదీకరిస్తే, దిగుమతులపై ఆధారపడడం తగ్గించొచ్చని జైన్ తెలిపారు. డబ్ల్యూజీసీ అంచనాల ప్రకారం.. భారతీయుల ఇళ్లలో 31,000 టన్నుల పసిడి ఉంది. ఇందులో 20,000 టన్నుల వరకు ఆభరణాల రూపంలో, 6000 టన్నుల దాకా బిస్కెట్లు, నాణేల రూపంలో ఉంది. ఈ మొత్తం విలువ రూ.314.9 లక్షల కోట్లు. ఇందులో 1% పసిడిని నగదీకరించినా, రూ.3.1 లక్షల కోట్ల దిగుమతులకు ప్రత్యామ్నాయంగా మారుతుంది. పసిడి నగదీకరణ నియమావళిని సరళీకరించడం, డిజిటలీకరణ ద్వారా ఇళ్లలో వృథాగా ఉన్న పసిడికి ఆర్థిక ఉత్పాదకతకు తీసుకురావొచ్చని జైన్ పేర్కొన్నారు.

## మహీంద్రా స్కార్పియో N ఫేస్‌లిఫ్ట్ విడుదల..



ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా అప్‌డేట్ చేసిన స్కార్పియో ఎన్‌ను దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీని ప్రారంభ ధరను రూ.13.69 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) నిర్ణయించింది. టాప్ వేరియంట్ ధర రూ.25.49 లక్షలుగా పేర్కొంది. కొత్తగా పనోరమిక్ సన్‌రూఫ్, అతిపెద్ద ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, ఫుల్లీ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, సరౌండ్ వ్యూ కెమెరా వంటి ఫీచర్లను జోడించారు. మహీంద్రా స్కార్పియో ఎన్‌లో చూడటానికి దాదాపు పాత మోడల్‌నే పోలి ఉంటుంది. 18 అంగుళాల అల్లాయ్ వీల్స్‌తో డ్యూయల్ టోన్ ఫినిష్‌తో వస్తోంది. లోపల 12.29 అంగుళాల ఫ్రీ–ఫ్లోట్ ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్ ఇచ్చారు. 10.24 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ ఉంది. థార్ రాక్స్‌లోనూ ఇదే ఇన్ఫోటైన్‌మెంట్, డిజిటల్ క్లస్టర్‌ను గమనించొచ్చు. స్కార్పియో ఎన్‌లో బ్లైండ్ వ్యూ మానిటర్‌తో కూడిన 540 డిగ్రీల కెమెరా ఇచ్చారు. 12 స్పీకర్ సోనీ ఆడియో సిస్టమ్ ఉంది. వెంటిలేటెడ్ సీట్లు, ఆటో డిమ్మింగ్ ఐఆర్‌వీఎం, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, టైప్–సి ఛార్జర్, ఆరు ఎయిర్‌బ్యాగులు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, లెవల్ 2 అడాస్ ఫీచర్లు వంటివి ఇందులో ఉన్నాయి. కొత్త స్కార్పియో 2.0 లీటర్ల టర్బో పెట్రోల్ ఇంజిన్, 2.2 లీటర్ల mHawk డీజిల్ ఇంజిన్ ఆప్షన్లతో లభిస్తోంది. సిక్స్‌స్పీడ్ మాన్యువల్ లేదా సిక్స్ స్పీడ్ ఆటోమెటిక్ గేర్ బాక్స్ ఆప్షన్లు ఉన్నాయి. వేరియంట్‌ను బట్టి రియర్ వీల్ డ్రైవ్, ఫోర్ వీల్ డ్రైవ్‌ను ఎంపిక చేసుకోవచ్చు.

## రూ.299 ప్లాన్‌కు ఎయిర్‌టెల్ గుడ్‌బై.. మరో 2 ప్లాన్లకూ!

ప్రముఖ టెలికాం సంస్థ ఎయిర్‌టెల్ రూ.299 విలువ కలిగిన ఎంట్రీ లెవల్ ప్రీపెయిడ్ రీఛార్జి ప్లాన్‌ను తొలగించింది. 28 రోజుల వ్యాలిడిటీతో అపరిమిత కాల్స్ డేటా అందించే ఈ ప్లాన్‌కు గుడ్‌బై చెప్పింది. ఎయిర్‌టెల్ వెబ్‌సైట్, ఎయిర్‌టెల్ థాంక్స్ యాప్ నుంచి ఈ ప్రీపెయిడ్ ప్లాన్‌ను తొలగించింది. ప్రారంభ ధర రీఛార్జి ప్లాన్ ధరలను సవరించిన ఏడాదికే ఎయిర్‌టెల్ ఈ మార్పును చేపట్టింది. దీంతోపాటు మరో రెండు ప్రీపెయిడ్ ప్లాన్‌లనూ ఎయిర్‌టెల్ తొలగించినట్లు తెలుస్తోంది. రూ.299 ప్లాన్‌తో 28 రోజుల వ్యాలిడిటీ, రోజుకు 1జీబీ డేటా, 100 ఎస్సెమ్మెస్‌లు, ఫ్రీ కాలర్ ట్యూన్స్, పెర్‌ప్లెక్సిటీ ప్రో ఏఐ సబ్‌స్క్రిప్షన్ వంటి ప్రయోజనాలు లభించేవి. ఇకపై రీఛార్జి చేయాలంటే అందుబాటులో ఉన్న ప్లాన్ ఒక్క రూ.349 మాత్రమే. ఈ ప్లాన్‌లో అపరిమిత కాల్స్‌తోపాటు రోజుకు 2జీబీ డేటా, 100 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. ఇది కూడా 28 రోజుల వ్యాలిడిటీతో వస్తోంది. ఆరు నెలల పాటు యాపిల్ మ్యూజిక్ సబ్‌స్క్రిప్షన్, ఫ్రీ హెలో ట్యూన్స్ లభిస్తాయి. ఎంట్రీ లెవల్ ప్లాన్‌తో పాటు రూ.579, రూ.619 విలువైన రీఛార్జి ప్లాన్‌లనూ ఎయిర్‌టెల్ తొలగించినట్లు తెలుస్తోంది. ఈ రెండు ప్లాన్లు కూడా ఎయిర్‌టెల్ వెబ్‌సైట్‌లో కనిపించడం లేదు.

రూ.579 ప్లాన్ 56 రోజుల వ్యాలిడిటీ, రోజుకు 1.5 జీబీ డేటా లభిస్తుంది. ఇదే డేటా ప్రయోజనాలతో 60 రోజుల వ్యాలిడిటీతో రూ.619 రీఛార్జి ప్లాన్ అందిస్తూ వచ్చింది.







## సీఓఈలోనే సుదర్శన్



గాయం నుంచి కోలుకుంటున్న టీమ్ఇండియా టెస్టు బ్యాటర్ సాయి సుదర్శన్ శ్రీలంకతో టెస్టు సిరీస్ కోసం భారత జట్టుతో పాటు ప్రయాణించలేదు. ఈ ఎడమ చేతివాటం బ్యాటర్ బెంగళూరులోని 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'లో వైద్య బృందం పర్యవేక్షణలో ఉన్నాడు. శ్రీలంక పర్యటనలో భారత్–ఎ జట్టుకు ఆడుతుండగా సుదర్శన్ కాలి వేలికి గాయమైంది. ''సుదర్శన్ గాయం పూర్తిగా నయం కాలేదు. అతడు వైద్యబృందం పర్యవేక్షణలో ఉన్నాడు. సుదర్శన్ గంటకుపైనే నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. ఇప్పుడే తొందరపడకుండా అతడు పూర్తి ఫిట్‌నెస్ సాధించే వరకు వేచి చూస్తాం. వచ్చే మూడు, నాలుగు రోజుల్లో సుదర్శన్ భారత జట్టుతో చేరడంపై తుది నిర్ణయం తీసుకుంటాం'' అని జట్టు వర్గాలు తెలిపాయి. తొలి టెస్టుకు ఇంకా పది రోజులు ఉండటంతో అప్పటికి సుదర్శన్ కోలుకుని జట్టుతో కలిసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఫిట్‌నెస్ సాధిస్తేనే లంక పర్యటనలో ఆడించే షరతుతో సుదర్శన్‌ను సెలక్టర్లు జట్టులోకి ఎంపిక చేసిన సంగతి తెలిసిందే.

## సీనియర్ ఆటగాళ్లను కాపాడుకోవాలి: అజింక్య రహానే




టెస్టు క్రికెట్ జట్టులో యువ ఆటగాళ్ల కంటే సీనియర్ ప్లేయర్లు ఎక్కువ మంది ఉండాలని అజింక్య రహానే అభిప్రాయపడ్డాడు. ఇటీవల అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రహానే ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొని పలు విషయాల గురించి మాట్లాడాడు. టెస్టు క్రికెట్‌లో భారత్ పూర్వ వైభవం పొందాలంటే ప్రస్తుతం ఉన్న సీనియర్ ఆటగాళ్లను జట్టులో కొనసాగించాలన్నాడు. సీనియర్లు ఒకేసారి ఆటకు దూరమవుతుండటం టీమ్ఇండియాకు సమస్యగా మారిందని 'జింక్స్' పేర్కొన్నాడు.

'గత రెండేళ్లుగా నేను టెస్టు క్రికెట్ ఆడకపోవడంతో ఇంట్లోనే కూర్చొని మ్యాచ్‌లు వీక్షించా. భారత జట్టు స్వదేశంలోనే మ్యాచ్‌లు ఓడిపోవడం కూడా చూశా. టెస్టు క్రికెట్ ఆడాలంటే పట్టుదల ఉండాలి. దాన్ని భారత ఆటగాళ్లు పెంపొందించుకుని పోటీతత్వంతో కూడిన క్రికెట్ ఆడాలి. ప్రతి సెషన్ పూర్తిగా ఆడాలి. చాలా జట్లు అలా చేయడం లేదు. నేను ఏ జట్టు గురించి ప్రత్యేకంగా చెప్పదల్చుకోలేదు. భారత టెస్టు క్రికెట్‌లోకి గత రెండేళ్లలో కొత్త ఆటగాళ్లు వచ్చారు. వారి సంగతి పక్కన పెట్టండి.

టెస్టు జట్టులో 7–8 మంది సీనియర్లు, ఇద్దరు లేదా ముగ్గురు యువ ఆటగాళ్లు ఉండాలనేది నా అభిప్రాయం. కానీ, ఇప్పుడు జట్టు కొత్త వాళ్లతో నిండిపోతోంది. దాదాపుగా సీనియర్ ఆటగాళ్లంతా రిటైర్ అయ్యారు. మిగిలిన అనుభవజ్ఞులైన ఆటగాళ్లను గౌరవించడం చాలా అవసరం. నిజం చెప్పాలంటే టెస్టు క్రికెట్ గురించి నాకు భయంగా ఉంది. ఇది మనుగడ సాగించాలని మనందరం కోరుకోవాలి. ముఖ్యంగా భారత్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సౌతాఫ్రికాల్లో టెస్టు క్రికెట్ కొనసాగాలి'' అని రహానే వివరించాడు. గతేడాది రవిచంద్రన్ అశ్విన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, ఛతేశ్వర్ పుజారా వంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. తాజాగా రహానే కూడా రిటైర్మెంట్ ప్రకటించడంతో జట్టులో సీనియర్ల సంఖ్య తగ్గిపోయింది. ప్రస్తుతం భారత జట్టులో రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, జస్‌ప్రీత్ బుమ్రా మాత్రమే 50 కంటే ఎక్కువ టెస్టులు ఆడారు.

## గత పది నెలలు.. ఊహించని రీతిలో పరీక్షించాయి: నీరజ్ చోప్రా



కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం సాధిస్తాడని నీరజ్ చోప్రాపై అభిమానులు భారీ అంచనాలే పెట్టుకున్నారు. కానీ, అతడికి శ్రీలంక అథ్లెట్ రుమేశ్ రూపంలో అడ్డంకి ఎదురైంది. దీంతో నీరజ్ రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే నీరజ్ తాజాగా చేసిన ఓ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. గత పది నెలల నుంచి తాను చాలా కఠిన పరిస్థితులు ఎదుర్కొన్నట్లు అందులో పేర్కొన్నాడు. కండరాల గాయంతో ఇటీవల అతడు కొంతకాలం పాటు జావెలిన్ త్రోకు దూరమైన సంగతి తెలిసిందే. అయినా సరే కామన్వెల్త్ గేమ్స్‌లో 85.83 మీటర్లు విసిరి రజతం దక్కించుకున్నాడు. 'అథ్లెట్ విసిరే కొన్ని త్రోలు చాలా దూరం వెళ్తాయి. కానీ, కొన్ని క్షణాలు మాత్రం ఆ ప్రయాణం తాలూకా భారాన్ని మోసుకెళ్తాయి. గత పది నెలలు నేను అనుకొన్నట్లు సాగలేదు. ఆ రోజులు నన్నెంతో పరీక్షించాయి. గాయాల నుంచి కోలుకోవడం, నా శరీరాన్ని సిద్ధం చేసుకోవడం, రిథమ్‌ను అందుకోవడం సవాళ్లతో కూడుకున్నదే. పోటీపడాలని ఎంతగానో ఆశపడినా.. ఓపిక పట్టడం నేర్చుకున్నా'' అని నీరజ్ చోప్రా తెలిపాడు. ''ఏ సీజన్‌లో బరిలోకి దిగుతానో లేదో తెలియకుండానే రోజుల తరబడి సాధన చేసేవాడిని. ఇప్పుడు (కామన్వెల్త్ గేమ్స్) కూడా పోటీ పడతానని అనుకోలేదు. అయితే, పతకం సాధించేలా సత్తా చాటడం బాగుంది. ఇదంతా నా ఒక్కడి వల్లే సాధ్యమైందని మాత్రం చెప్పను. ఈ ప్రయాణంలో నాపై నమ్మకం ఉంచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు చెబుతున్నా. ప్రతి అడుగులోనూ ముందుండి నడిపించిన ఫిజియో ఇషాన్‌కు థాంక్స్. జావెలిన్‌ను అందుకొన్నప్పటి నుంచి నాతోపాటు ఉంటోన్న కోచ్ జై, నా కుటుంబ సభ్యుల సహకారం మరువలేనిది. ఈ సీజన్‌లో ఒక్కో అడుగులో మెరుగవుతూ ముందుకు సాగుతున్నా'' అని నీరజ్ రాసుకొచ్చాడు.

## భారత్ కోసం ఆసీస్ స్పెషల్ బ్లూ ప్రింట్ రెడీ!

వచ్చే బోర్డర్–గావస్కర్ ట్రోఫీకి వేదిక భారత్. ఇంకా ఐదు నెలలే సమయం ఉంది. ఇప్పట్నుంచే ఐదు టెస్టుల సిరీస్‌ను నెగ్గేందుకు ఆస్ట్రేలియా కోచింగ్ బృందం తమ వ్యూహాలకు పదును పెట్టింది. ఎలాగైనా టీమ్ఇండియాను ఓడించి ట్రోఫీని సగర్వంగా తమ దేశానికి తీసుకెళ్లాలనేది ఆస్ట్రేలియా ఆలోచన. అందుకోసం బ్లూ ప్రింట్‌ను సిద్ధం చేసినట్లు ఆసీస్ కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ వెల్లడించాడు. జనవరి 21 నుంచి నాగ్‌పుర్ వేదికగా మొదటి మ్యాచ్ ప్రారంభం కానుంది. 'భారత్‌లోని పరిస్థితులకు అలవాటు పడేందుకు మాకు తగినంత సమయం ఉందని అనుకుంటున్నా. అక్కడికి వెళ్లి మేం ఎలాంటి ప్రాక్టీస్ మ్యాచ్ ఆడటం లేదు. అయితే, అక్కడి వాతావరణం, పిచ్‌ను అర్థం చేసుకొనేందుకు మా ట్రైనింగ్ క్యాంప్‌లోనే ఏర్పాట్లు చేసుకుంటాం. వేదిక ఎక్కడనేది ఇప్పుడే చెప్పలేను. గతంలో యూఏఈలోనూ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసుకున్నాం. బెంగళూరులోనే ఓసారి ట్రైనింగ్ క్యాంప్ పెట్టుకొన్నాం. టీమ్ఇండియాలోని ప్రతి ఆటగాడికీ ఎలా చెక్ పెట్టాలనే అంశాలపైనా లోతుగా దృష్టిసారించాం'' అని డొనాల్డ్ తెలిపాడు. ''ఈ ఏడాది డిసెంబర్‌లో న్యూజిలాండ్‌తో మేం నాలుగు టెస్టుల సిరీస్ ఆడుతున్నాం. అందులో బాగా ఆడిన ప్లేయర్లలో ఎవరు భారత్‌లో రాణించగలరని భావిస్తే వారినే ఎంపిక చేస్తాం. మరీ ముఖ్యంగా స్పెషలిస్ట్ ఆటగాళ్ల వైపే మొగ్గు చూపిస్తాం. అలాగని కివీస్‌తో తలపడిన టీమ్‌నే భారత్‌కు పంపిస్తామని కచ్చితంగా చెప్పలేం. మరోవైపు, బిగ్‌బాష్ కమిట్‌మెంట్స్‌ను చూడాల్సి ఉంది. అయితే, కీలకమైన ఆటగాళ్లు మరింత సన్నద్ధత అయ్యేలా చూసుకుంటాం'' అని మెక్‌డొనాల్డ్ స్పష్టం చేశాడు.



## ఇప్పుడు చీఫ్ సెలక్టర్ రేసులోకి లక్ష్మణ్!



వరుసగా ఓ రెండు సిరీస్‌లు భారత్ ఓడిపోవడంతో ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌పై వేటు పడుతుందనే ప్రచారం సాగింది. అతడికి బదులు మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్‌కు బాధ్యతలు అప్పగిస్తారనే ఊహాగానాలు హోరెత్తాయి. భారత్ Aతోపాటు సీనియర్ జట్టుతో అప్పుడప్పుడు విదేశీ పర్యటనలకూ వెళ్లిన అనుభవం లక్ష్మణ్‌కు ఉంది. కాబట్టి, ఆ ప్రచారంలో కొంత వాస్తవం ఉండొచ్చని అభిమానులూ భావించారు. ఇప్పుడేమో మరో కొత్త ప్రచారం తెరపైకి వచ్చింది. లక్ష్మణ్‌ను కోచ్‌గా చేయడం లేదు.. అతడిని చీఫ్ సెలక్టర్‌గా నియమిస్తారనే వార్తలు పుట్టుకొచ్చాయి. ప్రస్తుతం బీసీసీఐ చీఫ్ సెలక్టర్‌గా అజిత్ అగార్కర్ ఉన్నాడు. అతడి పదవీకాలం ఈ ఏడాది సెప్టెంబర్‌తో ముగియనుంది. ఇప్పటికే పొడిగింపుపై ఉన్న అజిత్‌కు మళ్లీ అవకాశం ఇచ్చేందుకు బీసీసీఐ సుముఖంగా లేదని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే ఏడాది ప్రపంచ కప్ నేపథ్యంలో కొత్త మార్పులు చేయాలని మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లు సమాచారం. దీంతో అజిత్ అగార్కర్ స్థానంలో వీవీఎస్ లక్ష్మణ్‌కు అవకాశం ఇస్తారని ప్రచారం మొదలైంది. మరోవైపు, వన్డే వరల్డ్ కప్ వరకూ అగార్కర్ – గంభీర్ జోడీని కొనసాగించాలనే ఆలోచనలోనూ బీసీసీఐ పెద్దలు ఉన్నట్లు సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. ప్రధాన కోచ్, చీఫ్ సెలక్టర్ పదవులతోపాటు రోహిత్ శర్మ వన్డే భవితవ్యంపైనా వచ్చే నెలలో ఓ స్పష్టత రానుంది. ప్రస్తుతం శ్రీలంక పర్యటనకు టీమ్ఇండియా వెళ్లింది. ఆ జట్టుతో రెండు టెస్టుల సిరీస్‌ను ఆడనుంది. ఆ తర్వాత సెప్టెంబర్‌లో వెస్టిండీస్‌తో సిరీస్‌లను ఆడనుంది. అన్నీ అనుకూలిస్తే బంగ్లాదేశ్ పర్యటనకూ భారత్ వెళ్లాల్సి ఉంది.

# వుదయం సినిమా MOVIE TIME!

## 'ఆహా'లో 'దీవాన' మూవీ సంచలనం 100+మిలియన్ల స్ట్రీమింగ్ మినిట్స్‌తో దూకుడు!

యంగ్ టాలెంటెడ్ హీరో హర్షిత్ రెడ్డి నటించిన "దీవాన" సినిమా ఫీల్ గుడ్ ఎమోషనల్ లవ్ స్టోరీ గా తెలుగు ఆడియన్స్ ని అలరించింది. థియేట్రికల్ గా ఈ సినిమా మంచి సక్సెస్ అందుకుంది. ఇప్పుడు ఓటీటీలోనూ దీవాన మూవీ సత్తా చాటుతోంది. ఇటీవల 'ఆహా' లో స్ట్రీమింగ్ కి వచ్చిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణతో 100+ మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్ మైల్ స్టోన్ కు చేరుకుంది. థియేటర్, ఓటీటీ.. వేదిక ఏదైనా మంచి సినిమాకు తప్పకుండా సక్సెస్ అందిస్తామని తెలుగు ప్రేక్షకులు మరోసారి ప్రూవ్ చేశారు. ఇక ఆహా ఎప్పటిలాగే తన వ్యూయర్స్ ని ఎంగేజ్ చేసే దీవాన వంటి ఎక్సైటింగ్ కంటెంట్ ని తీసుకొచ్చి ప్రశంసలు పొందుతోంది. దీవాన చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మించారు.




## బాలయ్య కూతురిని డైరెక్ట్ చేయబోయే దర్శకురాలు ఎవరంటే?

**వుదయం సినిమా:** నందమూరి నటసింహం నందమూరి బాలకృష్ణ చిన్నకుమార్తె తేజస్విని వెండితెరపై నటిగా పరిచయం కాబోతున్నారనే వార్తలు గత కొంత కాలంగా టాలీవుడ్‌లో గట్టిగా వినిపిస్తున్నాయి. తాజాగా జరుగుతున్న ప్రచారం ప్రకారం.. ఒక పవర్‌ఫుల్ ఫీమేల్ ఓరియెంటెడ్ స్పోర్ట్స్ డ్రామా ద్వారా నటిగా ఎంట్రీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అయితే ఎవరి దర్శకత్వంలో తేజస్విని ఎంట్రీ ఇస్తుందనేది క్లారిటీ లేదు. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం 'వరుడు కావలెను' చిత్రంతో దర్శకురాలిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న లక్ష్మి సౌజన్య దర్శకత్వంలో తేజస్విని నటిస్తున్నట్టు తెలుస్తోంది. ఇటీవల తేజస్విని ప్రత్యేకంగా కలిసి తేజస్వినితో దిగిన సెల్ఫీని సోషల్ మీడియా లో షేర్ చేసిన లక్ష్మి సౌజన్య.. "నందమూరి తేజస్విని కలవడం చాలా సంతోషంగా ఉంది. మళ్లీ కలవడానికి ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను' అని పోస్ట్ చేసింది. ఈ పోస్ట్ ప్రస్తుతం ఫిల్మ్ నగర్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. దీంతో తేజస్విని నటిగా ఎంట్రీ ఇచ్చే డెబ్యూ మూవీకి లక్ష్మి సౌజన్యనే దర్శకత్వం వహించబోతున్నారనే వార్తలు జోరందుకున్నాయి. ఈ కాంబినేషన్‌పై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని నందమూరి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



# 'ఫౌజీ'కి భారీ సెటప్ రెడీ!

**వుదయం సినిమా:** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సినిమా అంటే ప్రతి అప్‌డేట్ ను అభిమానులు పండగలా జరుపుకుంటారు. ఇప్పుడు అలాంటి మరో ఆసక్తికరమైన వార్త అభిమానుల్లో మరింత జోష్ ను పెంచుతోంది. మామూలు గా చార్మినార్ అంటే హైదరాబాద్ పాతబస్తీనే మనకు గుర్తుకు వస్తుంది. కానీ త్వరలో గచ్చిబౌలిలో కూడా మరో 'చార్మినార్' కనిపించబోతోంది. అయితే అది చారిత్రక కట్టడం కాదు, ప్రభాస్ నటిస్తున్న భారీ పీరియడ్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ' కోసం ప్రత్యేకంగా నిర్మిస్తున్న సినిమా సెట్ అది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఫౌజీ' మూవీ ప్రస్తుతం కీలక దశకు చేరుకుంది. సినిమా తదుపరి షెడ్యూల్ కోసం గచ్చిబౌలి–లింగంపల్లి రోడ్డులోని అల్యూమినియం ఫ్యాక్టరీ ప్రాంగణంలో అసలు చార్మినార్‌ను పోలిన భారీ సెట్ ను చిత్ర బృందం నిర్మిస్తోంది. ఈ సెట్‌లోనే సినిమాలోని కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఆగస్టు 3 నుంచి ప్రారంభమైన 25 రోజుల షెడ్యూల్‌లో ప్రభాస్ పాల్గొననున్నారు.



## 'ధాత్రి' టీజర్ రిలీజ్..



**వుదయం సినిమా:** హారర్, థ్రిల్లర్ కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న లేటెస్ట్ మూవీ 'ధాత్రి'. ఈ చిత్ర టీజర్‌ను ప్రముఖ దర్శకులు ఎస్.వి. కృష్ణారెడ్డి విడుదల చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. టీజర్‌లోని కాన్సెప్ట్, విజువల్స్ ఆసక్తికరంగా ఉన్నాయని ప్రశంసించిన ఆయన, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.సంజన ఫిలిమ్స్ బ్యానర్‌పై గిరి పయ్యావుల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో లక్కీ వెంకట్, శ్రావణి, ఆధ్య శర్మ, గిరి పయ్యావుల, జబర్దస్త్ జీవన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని గిరి పయ్యావుల స్వయంగా నిర్మిస్తుండగా, సాయి చరణ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు.ఈ చిత్ర కథ ఆసక్తికరమైన నేపథ్యంలో సాగుతుంది. చిన్నతనంలో అనాథగా మిగిలిపోయిన ఓ బాలికను కాశీలోని కొంతమంది అఘోరాలు పెంచి పెద్ద చేస్తారు. ఆ అనాథ పేరు 'ధాత్రి'. మరోవైపు ఎన్నో అసాంఘిక కార్యకలాపాలతో ఒక గ్రామ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న దుష్టశక్తులకు ఎదురు నిలిచిన ధాత్రి... ఆ గ్రామాన్ని ఎలా రక్షించింది? అనేదే ఈ చిత్ర ప్రధాన కథాంశం. హారర్‌తో పాటు థ్రిల్లింగ్ అంశాలను సమపాళ్లలో మేళవిస్తూ రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుంది.

## 'మిస్సింగ్ మేఘన' మూవీ పోస్టర్ లాంచ్



**వుదయం సినిమా:** ప్రొడ్యూసర్ గా, వాచస్పతి దర్శకత్వంలో రామ్ కార్తీక్, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య ప్రధాన పాత్రలో గోపరాజు రమణ, వెంప కాశి, కౌశిక్, మహిపాల్, రుచిత, నళిని, శ్రీనివాస్, అజీమ్, పండు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తూ ప్రేక్షకులు ముందుకు వస్తున్న చిత్రం "మిస్సింగ్ మేఘన". ఈ సినిమాకి సంబంధించిన ఫస్ట్ లుక్, టైటిల్ రివీలింగ్ పోస్టర్ లాంచ్ సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి.వినాయక్ గారి చేతుల మీదుగా జరిగింది. శామ్.కె.నాయుడు సినిమాటోగ్రాఫర్ గా పనిచేసిన ఈ చిత్రానికి ఆర్.ఆర్.ధృవన్ సంగీతం అందించారు. ఈ కార్యక్రమంలో మూవీ టీం తో పాటు బెక్కం వేణుగోపాల్ గారు కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి.వినాయక్ గారు మాట్లాడుతూ: బెక్కం వేణుగోపాల్ గారు, శ్రీనివాస్ గారి సపోర్ట్ తో వాచస్పతి దర్శకుడిగా వస్తున్న సినిమా 'మిస్సింగ్ మేఘన'. ఈ సినిమాతో హీరో రామ్ కార్తీక్ కి దర్శకుడు వాచస్పతికి మంచి పేరు రావాలి అని కోరుకుంటున్నాను.

## 'కొరియన్ కనకరాజు' ప్రీరిలీజ్ ఈవెంట్



**వుదయం సినిమా:** మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు'తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హారర్ కామెడీ సూపర్‌నేచురల్ ఎలిమెంట్స్, నవ్వులు పంచే వినోదంతో గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించనుంది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఎంటర్‌టైనింగ్ టీజర్, ట్రైలర్, చార్ట్‌బస్టర్‌గా నిలిచిన రెండు పాటల సినిమాపై ప్రేక్షకుల్లో మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి. 'కొరియన్ కనకరాజు' ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 7న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ భీమవరంలో గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్ లో హీరో వరుణ్ తేజ్ మాట్లాడుతూ... అందరికీ హాయ్. 'కొరియన్ కనకరాజు తో ఆగస్టు 7న థియేటర్లలో నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్ ఉండబోతోంది. డెఫినెట్‌గా మీరందరూ ఈ సినిమాను ఎంజాయ్ చేస్తారు. 2018లో 'తొలిప్రేమ' సినిమా ఈవెంట్ కోసం ఇక్కడికి వచ్చాను. ఈ కాలేజ్‌తో నాకు చాలా అనుబంధం ఉంది. 'తొలిప్రేమ' తర్వాత మళ్లీ 'కొరియన్ కనకరాజు' ఈవెంట్‌ను మీ అందరి సమక్షంలో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఇక్కడ మీ అందరి ఉత్సాహం చూస్తుంటే 'తొలిప్రేమ' మ్యాజిక్ ఈ సినిమాతో మళ్లీ రిపీట్ అవుతుందనిపిస్తోంది. ఈ సినిమాతో నాకు, మా టీమ్ అందరికీ పెద్ద సక్సెస్ రావాలని కోరుకుంటున్నాను. మా ప్రొడ్యూసర్స్ చాలా మంచి సపోర్ట్ ఇచ్చారు.

## దందా.. జెన్ జీ మాస్ ఊచకోత

**వుదయం సినిమా:** వర్టికల్ స్టోరీస్‌లో చాయ్ షాట్స్ నుంచి వచ్చిన 'దందా' సిరీస్ సెన్సేషనల్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. 'దందా'తో దర్శకుడు ఆదిత్య దేవులపల్లి అందరినీ ఆకట్టుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయన తన సినీ జర్నీ, నేపథ్యం గురించి ఎన్నో విషయాల్ని పంచుకున్నారు. ఆయన చెప్పిన సంగతులివే..

**మీ బ్యాక్‌గ్రౌండ్ గురించి చెప్పండి?**

నేను చదువులో టాపర్‌నే, కానీ చిన్నప్పటి నుంచీ నాకు సినిమాలంటే పిచ్చి ఇష్టం. ఆ ప్యాషన్‌తోనే ఇంజనీరింగ్ మధ్యలోనే వదిలేసి రాడికల్ డిసిషన్ తీసుకున్నా.

**చాయ్ షాట్స్‌లోకి ఎంట్రీ ఎలా జరిగింది?**

నేను చెప్పిన కథ అనురాగ్ అన్నకి బాగా నచ్చింది. తెలుగులో సాధారణంగా ఇలాంటి కథను తీసే ధైర్యం ఎవరూ చేయరు" అని చెప్పారు.

**'దందా' కథలో మీ ప్రమేయం ఎంతవరకు ఉంది?**

ఒరిజినల్ కథను విజయ్ కుమార్ రాశాడు, కానీ అందులో కొన్ని లోపాలు (Issues) ఉన్నాయి.

**'దందా'కి వస్తున్న రెస్పాన్స్ అండ్ అప్రిషియేషన్ ఎలా ఉంది?**

ఇప్పటివరకు 'దందా'కి ఒక్కటంటే ఒక్క నెగెటివ్ రివ్యూ కూడా రాలేదు!



**సొంత కథ కాకుండా 'దందా'తోనే డైరెక్టర్‌గా ఎందుకు డెబ్యూ చేశారు?**

నాకు పూరీ జగన్నాథ్, రామ్ గోపాల్ వర్మ, ఉపేంద్ర లాంటి డైరెక్టర్ల మేకింగ్ అన్నా, ఆటిట్యూడ్ అన్నా చాలా ఇష్టం. చాయ్ షాట్స్‌లో ఉన్నప్పుడు వందలాది స్క్రిప్ట్‌లు విన్నాను. కానీ 'దందా' కథ చదువుతుంటే నన్ను నేనే చూసుకున్నట్టు అనిపించింది.

**వర్టికల్ కంటెంట్ కోసం ఎలాంటి రీసెర్చ్ చేశారు?**

ప్రస్తుతం మైక్రో డ్రామాలను జనాలు విపరీతంగా చూస్తున్నారు. కానీ వర్టికల్ ఫార్మాట్‌లో ప్రతీ సీన్ గ్రిప్పింగ్‌గా ఉండాలి. మామూలు సినిమాల్లో అయితే ఇంటర్వెల్, క్లైమాక్స్‌లో హైస్ అండ్ లోస్ ఉంటాయి.

**డైలాగ్స్ గురించి చెప్పండి?**

ఈ పవర్‌ఫుల్ డైలాగ్స్ అన్నీ అరవింద్ క్యారెక్టర్ జర్నీ నుంచే పుట్టుకొచ్చాయి. చిన్నతనం నుంచే లైబ్రరీలో ఉంటూ, మనుషులను గమనించడం వల్ల ఆ పాత్రకు ఒక డెప్త్ వచ్చింది. ఆ క్యారెక్టరే మాతో ఇంకా కొత్తగా, ఫ్రెష్‌గా లైన్స్ రాయించింది.

**కాస్టింగ్ సెలెక్షన్ ఎలా జరిగింది?**

అరవింద్ పాత్ర కోసం చాలామందిని అనుకున్నాం.

## 7న 'మకుటం'.. ట్రైలర్



**వుదయం సినిమా:** సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద 99వ ప్రాజెక్ట్‌గా విశాల్ హీరోగా, దర్శకుడిగా చేస్తున్న చిత్రం 'మకుటం'. స్వర్గీయ ఆర్ బీ చౌదరి నిర్మాణంలో రాబోతోన్న ఈ మూవీలో అంజలి, దుషార విజయన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటి వరకు వచ్చిన టీజర్, పాటలు అన్నీ కూడా అందరిలోనూ అంచనాలు పెంచేశాయి. మ్యూజికల్ ప్రమోషన్స్ జోరుగా సాగుతున్న ఈ తరుణంలో మేకర్లు అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమాని ఆగస్ట్ 14న భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నట్టుగా ప్రకటించడమే కాకుండా.. ఆగస్ట్ 7న ట్రైలర్‌ను విడుదల చేస్తామని అప్డేట్ ఇచ్చారు.ఇప్పటికే విశాల్ 'మకుటం'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. విశాల్ డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తుండటం.. పైగా దర్శకుడిగా మొదటి సినిమా అవ్వడం, జీవీ ప్రకాష్ ఇచ్చిన మ్యూజిక్ అందరినీ ఆకట్టుకోవడంతో అంచనాలు భారీగా ఏర్పడ్డాయి.

## 'కరికాల'.. టైటిల్ పోస్టర్

**వుదయం సినిమా:** 'శంబాల' బ్లాక్ బస్టర్ తరువాత దర్శకుడు యుగంధర్ ముని సందీప్ కిషన్‌తో ప్రకటించిన ప్రాజెక్ట్ మీద భారీ అంచనాలు ఏర్పడిన సంగతి తెలిసిందే. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ ప్రకటన నుంచే ప్రేక్షకుల్లో ఉత్కంఠను రేకెత్తించింది. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన కాన్సెప్ట్



పోస్టర్‌లు అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ మూవీకి సంబంధించిన టైటిల్‌ను రివీల్ చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు.'కరికాల' అంటూ ఇంట్రెస్టింగ్ టైటిల్‌తో ఈ చిత్రం రాబోతోంది. ఈ పోస్టర్‌లో సందీప్ కిషన్ కనిపిస్తున్న తీరు చాలా కొత్తగా ఉంది. గుర్రంపై హీరో, చేతిలో ఖడ్గం, సింహాన్నే పరిగెత్తిస్తున్నట్టుగా ఆ రాజసం అన్నీ కూడా సినిమాపై ఉత్సుకతను పెంచేలా ఉన్నాయి. ఈ టైటిల్ పోస్టర్‌తో ఒక్కసారి అంచనాల్ని రెట్టింపు చేసేశారు. ఈ మూవీని రెండు పార్టులుగా మేకర్లు ప్లాన్ చేశారు. మొదటి చాప్టర్ 2027 జూలై 2న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుండగా, రెండో చాప్టర్ 2027 అక్టోబర్ 28న రానుంది.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.